PRAJASAKTI Regd.No. 15795/68

# ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 339 | విజయవాడ, శుక్రవారం 11 జులై 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Friday 11 July 2025 | Rs

## ఎల్ఐసిలో మళ్లీ వాటాల విక్రయం..!

- జూన్‌లో పెరిగిన పాలసీ అమ్మకాలు

3

## రాణించిన రాధా

- నాల్గో టి20లో ఇంగ్లండ్ మహిళలపై ఆరు వికెట్ల తేడాతో గెలుపు
- టి20 సిరీస్ తొలిసారి కైవసం

8

# బీహార్‌లో 'ఎస్ఐఆర్' ఇప్పుడే ఎందుకు?

## ఆధార్ ఎందుకు వద్దంటున్నారు?

### ఆధార్, ఓటరు, రేషన్ కార్డులూ పరిగణించండి

### పౌరసత్వం'పై పరిశీలన ఎందుకు? • ఇసిని ప్రశ్నించిన సుప్రీం కోర్టు

**న్యూఢిల్లీ :** ఎన్నికలు జరగనున్న బీహార్‌లో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో ఆధార్, ఓటరు కార్డు, రేషన్ కార్డులనూ పరిగణనలోకి తీసుకోవాలని ఎన్నికల కమిషన్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ మొత్తం ప్రక్రియ అంతా ఓటరు గుర్తింపు కోసమైనప్పుడు ఆధార్ కార్డు అనేది ప్రాథమికమైన పత్రమని న్యాయమూర్తులు వ్యాఖ్యానించారు. ఇసి దాన్ని తీవ్రంగా వ్యతిరేకించడం ఆశ్చర్యం కలిగిస్తోందని అన్నారు. ప్రతిపక్ష నేతలు, కార్యకర్తలు, ఎన్‌జిఓలు, న్యాయవాదులు దాఖలు చేసిన 10కి పైగా పిటిషన్లను జస్టిస్ సుధాంశు ధూలియా, జస్టిస్ జోమాల్యా బాగ్చిలతో కూడిన బెంచ్ గురువారం విచారించిన అనంతరం పై ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసు తదుపరి విచారణను జులై 28కి వాయిదా వేసింది. ఎస్ఐఆర్ ముందుకు సాగకుండా ఎన్నికల కమిషన్‌ను నిలువరించేందుకు సుప్రీంకోర్టు తిరస్కరించింది.

బీహార్‌లో ఎన్నికల తేదీ దగ్గరపడుతున్న వేళ.. ఎన్నికల కమిషన్ చేపట్టిన ఈ ప్రక్రియ చాలా హడావిడిగా, నిర్లక్ష్య ధోరణిలో జరుగుతోందని పిటిషనర్లు వాదించారు. ఆధార్ చెల్లుబాటయ్యే పత్రం కాదని ఎలా అంటారని వారు ప్రశ్నించారు. ఈ దశలో తాము తాత్కాలిక స్టే కోసం పట్టుబట్టడం లేదని కూడా పిటిషనర్లు తెలిపారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ చేపట్టడం తమ రాజ్యాంగ హక్కుల పరిధిలోనే వుందని ఎన్నికల కమిషన్ పేర్కొంది. త్వరలోనే దేశంలో మిగిలిన ప్రాంతాల్లో కూడా దీన్ని నిర్వహిస్తామని ఇసి తరపున వాదిస్తున్న సీనియర్ న్యాయవాది రాకేష్ ద్వివేది తెలిపారు.

**మూడు ప్రశ్నలు సంధించిన సుప్రీం కోర్టు**

"ఇరు పక్షాల వాదనలు విన్న అనంతరం, ఈ కేసులో మూడు ప్రశ్నలు ఇమిడివున్నాయని మేం ప్రాథమికంగా అభిప్రాయపడుతున్నాం. (ఎ) ఈ ప్రక్రియ చేపట్టిన ఎన్నికల కమిషన్ అధికారాలు (బి) ఈ ప్రక్రియను ఏ పద్ధతిలో నిర్వహిస్తున్నారు (సి) నవంబరులో బీహార్ ఎన్నికలు జరగబోతున్నాయన్న అంశాన్ని పరిగణనలోకి తీసుకుంటే ముసాయిదా ఓటర్ల జాబితాను సిద్ధం చేయడానికి ఇచ్చిన సమయంతో సహా ఈ ప్రక్రియను నిర్వహించే సమయం, అలాగే అభ్యంతరాలు వుంటే వాటిని పరిష్కరించి, తుది జాబితాను సిద్ధం చేయడానికి గల సమయం చాలా తక్కువగా వుంది." అని కోర్టు తన ఉత్తర్వుల్లో పేర్కొంది.

**ఇసి వివరణ ఇవ్వాలి... ఆ పత్రాలు తిరస్కరిస్తే కారణం చెప్పాలి : ధర్మాసనం**

"ఈ అంశంపై విచారణ జరపడం అవసరమేనని మేం కూడా అభిప్రాయపడ్డాం. అందుకే ఈ నెల 28న తదుపరి విచారణకు నిర్ణయించాం. ఈలోగా ఈ రోజు నుండి వారం రోజుల్లోగా అంటే జులై 21లోగా ఎన్నికల కమిషన్ కౌంటర్ అఫిడవిట్‌ను దాఖలు చేయాల్సి వుంటుంది. ఇంకా ఏదైనా వుంటే 28లోగా దాఖలు చేయాల్సి వుంది." అని కోర్టు పేర్కొంది. "ఎన్నికల కమిషన్ పేర్కొన్న 11 పత్రాలకు అదనంగా ఆధార్ కార్డు, ఇసి జారీ చేసిన ఓటరు ఐడి కార్డు, రేషన్ కార్డులను కూడా ఎన్నికల కమిషన్ పరిశీలించాలని మేం చెబుతున్నాం. ఒకవేళ వాటిని తిరస్కరించేందుకు సరైన కారణాలు వున్నట్లైతే తిరస్కరించండి, కానీ కారణాలేంటో చెప్పాలి." అని జస్టిస్ ధూలియా స్పష్టం చేశారు. ఆగస్టు 1న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించాల్సి ఉందని, 2న కోర్టు తిరిగి దీనిపై విచారణ చేపట్టినట్లైతే... ఒకవేళ కోటి మంది ప్రజలు ఈ ప్రక్రియలో ఓటు హక్కు కోల్పోయినట్లైతే అప్పుడు కోర్టు జోక్యం చేసుకోవచ్చని రాకేష్ ద్వివేది సూచించారు.

**ఇసి టైమ్‌లైన్ పట్ల న్యాయమూర్తి సందేహాలు**

ఎన్నికల కమిషన్ టైమ్‌లైన్‌ల పట్ల న్యాయస్థానానికి తీవ్రమైన సందేహాలు వున్నాయని జస్టిస్ ధూలియా అన్నారు. జనగణనకే మిగతా 7లో

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం

- సిఎస్ విజయానంద్

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

రాష్ట్రంలో ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్‌గా వచ్చే వివిధ అంటువ్యాధులు నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెకర్లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు. స్వర్ణాంధ్ర పి4 పౌండేషన్, సీజనల్ వ్యాధులు నియంత్రణ తదితర అంశాలపై సచివాలయం నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌ను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయానంద్ మాట్లాడుతూ.. డెంగీ, చికెన్ గున్యా, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో రోజువారీ సమావేశాలు నిర్వహించి పర్యవేక్షించాలన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి పైపులైన్లు లీకేజిలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆగస్టు 15 నాటికి రాష్ట్రంలోని 15 లక్షల బంగారు కుటుంబాలను మార్గదర్శిలు దత్తత తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. ఆ దిశగా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. సంక్షేమ వసతి గృహాల్లో పరిశుభ్రతను మెరుగు పరచడం, మరుగుదొడ్లు అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎప్పటికప్పుడు వసతి గృహాలు పరిశుభ్రంగా ఉండేలా దృష్టి పెట్టాలన్నారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేకప్రధాన కార్యదర్శి ఎంటి కృష్ణబాబు మాట్లాడుతూ వ్యాధుల నివారణలో భాగంగా మలేరియా ప్రభావిత ప్రాంతాల్లో మెడికేటెడ్ దోమతెరలను పంపిణీ చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ప్రణాళికా శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్, గిరిజన, సాంఘిక సంక్షేమ శాఖల ముఖ్య కార్యదర్శి ఎం.ఎం నాయక్, ఆర్టిజిఎస్ సిఇఒ ప్రఖర్‌జైన్, ప్రణాళిక శాఖ సంయుక్త కార్యదర్శి అనంత శంకర్, సమాచార ప్రసార శాఖ డైరెక్టర్ హిమాన్షు శుక్లా తదితరులు పాల్గొన్నారు.




ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

## నాలెడ్జ్ ఎకానమీదే భవిష్యత్తు

- ఉద్యోగాల్లోకే కాదు..రాజకీయాల్లోకి రావాలి
- మెగా పేరెంట్స్, టీచర్స్-2 మీటింగ్‌లో సిఎం చంద్రబాబు
- పాఠశాలల అభివృద్ధిలో పూర్వ విద్యార్థులు భాగస్వామ్యం కావాలి : లోకేష్

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

నాలెడ్జ్ ఎకానమీదే భవిష్యత్ అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. సత్యసాయి జిల్లా కొత్తచెరువులో నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల - 2 ఆత్మీయ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్ పాల్గొన్నారు. తొలుత పాఠశాల పరిసరాలను లోకేష్‌తో కలిసి ముఖ్యమంత్రి పరిశీలించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. అనంతరం వనరుల సద్వినియోగం పాఠ్యాంశాన్ని విద్యార్థులకు సిఎం బోధించారు. సమావేశంలో చంద్రబాబు మాట్లాడుతూ ఒక్క రోజే 61 వేల పాఠశాలల్లో 2.28 కోట్ల మంది ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించడం గిన్నిస్ రికార్డు అని చెప్పారు. 'విద్యార్థుల విషయంలో టీచర్లకే కాదు.. తల్లిదండ్రులకు కూడా బాధ్యత ఉంటుంది. ఆడపిల్లల్ని చదివిస్తే ఏం వస్తుందని గతంలో అనుకునేవారు. మగ పిల్లల కంటే ఆడపిల్లలు తక్కువ కాదు. ఇద్దరిని సమానంగా చూసుకోవాలి. అందుకే ఎంతమంది పిల్లలుంటే అంతమందికి తల్లికి వందనం ఇచ్చాం'. అని చంద్రబాబు అన్నారు. లోకేష్ విద్యార్థిగా ఉన్నప్పుడు తాను పేరెంట్స్ మీటింగులకు హాజరవ్వలేకపోయానని, తన సతీమణి భువనేశ్వరి మాత్రం తప్పకుండా సమావేశాలకు వెళుతూ ఉండేవారని చెప్పారు. ఆ రకంగా లోకేష్‌ను కేంబ్రిడ్జిలో చదుకునే విధంగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. ఇక్కడ తల్లిదండ్రులు కూడా పిల్లల చదువులపై శ్రద్ధపెట్టాలని సూచించారు. వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని కోరారు. పాఠశాలల్లో ఖాళీగానున్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయనున్నట్టు తెలిపారు. గడిచిన ఐదేళ్లలో ఒక్క డిఎస్‌సిని కూడా గత ప్రభుత్వం నిర్వహించలేదని, టోఫెల్, ఐబి సిలబస్ పేరుతో గందరగోళ పరిచారని, రాష్ట్రాన్ని గంజాయి, డ్రగ్స్ కేంద్రంగా మార్చారని విమర్శించారు. లోకేష్ మాట్లాడుతూ.. పాఠశాలల అభివృద్ధిలో పూర్వ విద్యార్థులు భాగస్వామ్యం కావాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని చెప్పారు. ఓటమిని చూసి భయపడవద్దని, తాను కూడా 2019 ఎన్నికల్లో మంగళగిరి నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయానని, పట్టుబట్టి 2024లో అక్కడే విజయం సాధించానని తెలిపారు. పిల్లలు కూడా కష్టపడి చదివితే విజయాలు సొంతమవుతాయని చెప్పారు. నైపుణ్యం పెంపుదల లీప్ పేరుతో ఎపి మోడల్ స్కూల్ ఎడ్యుకేషన్ తీసుకొస్తామని చెప్పారు. ప్రయివేటు బడులకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నామన్నారు. అమ్మ పేరుతో ఒక మొక్క నాటాలని ప్రధాని మోడీ ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్రంలో మిగతా 7లో

## బ్రెజిల్‌పై 50 శాతం అదనపు సుంకం

- వ్యక్తిగత దాడికి దిగిన ట్రంప్
- బోల్సొనారోపై ఆరోపణల ఉపసంహరణకు ఒత్తిడి

**వాషింగ్టన్ :** బ్రెజిల్ నుండి దిగుమతి చేసుకునే ఉత్పత్తులపై 50శాతం టారిఫ్‌లను విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఆగస్టు 1 నుండి ఇవి అమల్లోకి వస్తాయని తెలిపారు. బుధవారం సోషల్ మీడియాలో ప్రచురించిన ఒక లేఖలో ఆయన ఈ టారిఫ్‌ల విషయం ప్రకటించారు. బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డసిల్వాను ఉద్దేశిస్తూ లేఖ ప్రారంభించిన ట్రంప్, బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జేర్ బోల్సనారోను సమర్థిస్తూ, ఆయనపట్ల బ్రెజిల్ వ్యవహరిస్తున్న తీరును విమర్శించారు. బోల్సనారోపై వున్న కేసును ప్రస్తావిస్తూ ఆ విచారణ జరగకూడదని వ్యాఖ్యానించారు. తక్షణమే ఆ వేధింపులను ఆపాలని, విచారణ నిలిపివేయాలన్నారు. స్వేచ్ఛా ఎన్నికలపై, భావ ప్రకటనా స్వేచ్ఛపై బెజిల్ దాడులు చేస్తోందని విమర్శించారు. బ్రెజిల్‌తో వాణిజ్య సంబంధాల వల్ల అమెరికాకు అన్యాయం జరుగుతోందని, అందువల్ల వాణిజ్య సంబంధాలు తెగతెంపులు చేసుకోవాలని భావిస్తున్నట్లు చెప్పారు. ఈ 50శాతం టారిఫ్‌లు కూడా ఇంకా తక్కువేనని అన్నారు. రెండు దేశాల మధ్య సమాన అవకాశాలు వుండేలా చూడాలంటే ఇంకా విధించాలని వ్యాఖ్యానించారు. మొత్తంగా బ్రెజిల్ వాణిజ్య విధానాలపై అమెరికా వాణిజ్య చట్టం కింద దర్యాప్తు చేపడతామని హెచ్చరించారు. వాణిజ్య ఒప్పందాలను బ్రెజిల్ ఉల్లంఘిస్తుందో లేదా తెలుసుకుని వుంటే డబ్ల్యుటిఓ కింద చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఒకవేళ బ్రెజిల్ కూడా ఇదే తీరున ప్రతి చర్యలు తీసుకోవాలని నిర్ణయిస్తే అమెరికా మరో 50శాతం పెంచుతుందని ట్రంప్ హెచ్చరించారు. అమెరికాతో బ్రెజిల్ వ్యవహరించే తీరును బట్టే అంతా వుంటుందని స్పష్టం చేశారు. అమెరికా విధానాలను వ్యతిరేకించే బ్రిక్స్ దేశాలపై అదనంగా పది శాతం సుంకాలు విధిస్తామంటూ ట్రంప్ హెచ్చరించారు. దానిపై లూలా స్పందిస్తూ ప్రపంచానికి మరో చక్రవర్తి అవసరం లేదని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలోనే తాజాగా బ్రెజిల్‌పై ఈ సుంకాలు విధించారు.

## రాష్ట్రంలోనూ జనగణన..

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

రాష్ట్రంలో జనగణన చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే, 2027 మార్చి 1వ తేదీ నుంచి దేశంలో జనగణనను చేపట్టేందుకు ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. అదే సమయంలో రాష్ట్రంలోను జనగణన చేపట్టాలని నిర్ణయించిన ప్రభుత్వం ఇందుకు కేంద్రం ఇచ్చిన నోటిఫికేషన్ గురువారం పున్ణప్రచురించింది. ఈ మేరకు సాధారణ పరిపాలనా శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.ఎస్ రావత్ ఉత్తర్వులు జారీ చేశారు.

## స్మార్ట్ మీటర్ల వ్యతిరేక ఉద్యమం

- 13న రాష్ట్ర సదస్సు : ప్రజాసంఘాల ఐక్య వేదిక

3

## నిర్వాసితుల పేరుతో 'భూ' కుంభకోణం

- గతంలో అదనంగా సేకరించిన వెయ్యి ఎకరాల సంగతి తేల్చండి
- మళ్లీ భూసేకరణ పేరుతో గిరిజనుల భూములను దోచుకునే యత్నం
- వివాదాస్పద ఎల్‌టిఆర్ భూముల జోలికొస్తే ఖబడ్దార్
- ఏజెన్సీ పర్యటనలో వి.శ్రీనివాసరావు

భూముల్లో జెండాలు పాతుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, గిరిజనులు

**ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి**

పోలవరం నిర్వాసితుల పేరుతో ప్రజాప్రతినిధులు, అధికారులు ఏజెన్సీ ప్రాంతంలో భూ కుంభకోణానికి పాల్పడుతున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. గురువారం ఏలూరు జిల్లాలోని జీలుగుమిల్లి, బుట్టాయగూడెం, పోలవరం మండలాల్లో సిపిఎం బృందం పర్యటించింది. జీలుగుమిల్లి మండలం బర్రింకలపాడులోని 22 ఎకరాల భూ బదలాయింపు నియంత్రణ (ఎల్‌టిఆర్) భూములను పరిశీలించి గిరిజనులతో కలిసి జెండా పాతారు. ఈ సందర్భంగా ఎల్‌టిఆర్ భూముల విషయంలో అధికారులు ఏ విధంగా ఇబ్బందులకు గురి చేస్తున్నదీ గిరిజనులు వివరించారు. అనంతరం పి.అంకంపాలెంలోని మిగులు భూములను పరిశీలించి ఆ భూముల్లోనూ జెండా పాతారు. అనంతరం బుట్టాయగూడెం మండలం రెడ్డిగణపవరం, ఇనుమూరుల్లోని ఎల్‌టిఆర్ భూముల్లో పర్యటించి జెండాలు పాతారు. ఈ సందర్భంగా గిరిజనులనుద్దేశించి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఏజెన్సీలోని ఎల్‌టిఆర్ భూములు గిరిజనుల సొంతమని, అటవీ హక్కుల చట్ట ప్రకారం పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. గిరిజనులకు అన్యాయం చేస్తూ వివాదాస్పద ఎల్‌టిఆర్ భూములను పోలవరం నిర్వాసితుల పేరుతో ప్రభుత్వం సేకరిస్తూ గిరిజనేతరులకు లబ్ధి చేకూరుస్తుందన్నారు. దీన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదన్నారు. 2017లో మిగతా 7లో

## 'స్థానికత'పై గందరగోళం

- ఇతర రాష్ట్రాల్లో చదివిన విద్యార్థుల ఆందోళన
- ఉన్నత విద్య ప్రవేశాల్లో ప్రభావం

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

ఇతర రాష్ట్రాల్లో ఇంటర్మీడియట్ చదివిన రాష్ట్ర విద్యార్థుల స్థానికతపై గందరగోళం నెలకొంది. పదో తరగతి వరకు రాష్ట్రంలో చదివి, తెలంగాణ, ఇతర రాష్ట్రాల్లో ఇంటర్మీడియట్ చదివిన విద్యార్థులను స్థానికేతరులుగా రాష్ట్రప్రభుత్వం చూపడంతో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. డిగ్రీ, ఇంజనీరింగ్ వంటి ఉన్నత విద్య కోర్సుల్లో విద్యార్థులు చేరేందుకు అడ్డంకిగా మారుతోంది. రాష్ట్రవిభజన చట్టం-2014 ప్రకారం 2024 వరకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు ఉమ్మడిగానే ప్రవేశ పరీక్షలు జరిగాయి. 2024 జూన్ 2వ తేదీకి పదేళ్ల గడువు ముగిసిన తరువాత తెలంగాణ స్థానికత మార్గదర్శకాలను రూపొందించుకుంది. రాష్ట్రంలో మాత్రం ఏడాది తరువాత ఉమ్మడి ప్రవేశాల్లో అనుసరించాల్సిన స్థానికతను నిర్ధారిస్తూ 2025 మే 12వ తేదిన జిఓ 20ను రాష్ట్రప్రభుత్వం విడుదల చేసింది. ఆంధ్ర, శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీలను రెండు రీజియన్లుగా విభజించి సీట్లు మొత్తం రాష్ట్రవిద్యార్థులకే దక్కే విధంగా మార్గదర్శకాలను విడుదల చేసింది. ఎయు పరిధి కింద శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాలు ఉన్నాయి. ఈ పరిధిలోని నివాసించే విద్యార్థులకు ఎయు పరిధిలోని ఉండే విద్యాసంస్థల్లో స్థానికత ఉంటుంది. శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ పరిధిలోకి అనంతపూర్, కర్నూలు, చిత్తూర్, కడప, నెల్లూరు జిల్లాలు ఉన్నాయి. రాష్ట్రంలోని ఆయా యూనివర్సిటీల పరిధిలో చదువుతున్న వారిని స్థానికులుగా చూపుతూ వారికి 85శాతం, ఇతర యూనివర్సిటీ పరిధిలో చదువుతున్న వారిని స్థానికేతరులుగా పేర్కొంటూ 15శాతం చొప్పున సీట్లు భర్తీ చేసేవిధంగా మార్గదర్శకాల్లో పొందుపరిచింది. ఇతర రాష్ట్రాల్లో చదువుతూ రాష్ట్రంలో నివాసిస్తున్న వారికి నిర్దేశించిన మార్గదర్శకాల్లో గందరగోళం నెలకొంది. ఇంజనీరింగ్, డిగ్రీ వంటి కోర్సుల్లో ప్రవేశానికి ముందు నాలుగేళ్లల్లో ఏ ఒక్క ఏడాది బయట రాష్ట్రంలో చదివినా వాళ్లను స్థానికేతరులుగానే పరిగణించాలని ప్రభుత్వం నిబంధన విధించింది. ప్రభుత్వం విధించిన ఈ నిబంధన వల్ల తమకు స్థానికత రావడం లేదని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి ప్రవేశాల పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న సమయంలో స్థానికతను రాష్ట్రప్రభుత్వం తేల్చలేదు. గడువు ముగిసి ఏడాది పూర్తయినా ఎలాంటి మార్గదర్శకాలు విడుదల చేయకపోవడంతో సమస్య ఏర్పడింది. దీంతో విద్యార్థులు వారి పరిధిలోకి ఉన్న యూనివర్సిటీ పరిధిని దరఖాస్తులో పొందుపరిచారు. ఇప్పుడు ఆ స్థానికతను తెచ్చుకునేందుకు తిప్పలు పడుతున్నారు. స్థానికత పొందాలంటే విద్యార్థుల తల్లిదండ్రులు 10 ఏళ్లు రాష్ట్రంలో ఉనట్లు సర్టిఫికేట్ తీసుకోవాలని ప్రభుత్వం పేర్కొంది. ఈ స్థానికత సర్టిఫికేట్ నిలిపివేసినట్లు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. దీంతో ఈఎపిసెట్‌కు హెల్ప్‌లైన్లకు ఫోన్లు చేస్తూ తమ గోడును వెల్లబోసుకుంటున్నారు. నివాస ధృవీకరణ పత్రం లేకపోతే తల్లిదండ్రులు రాష్ట్రంలో పదేళ్లు చదువుకునట్లు స్టడీ సర్టిఫికేట్లు అప్‌లోడ్ చేయాలని కౌన్సిలింగ్ అధికారులు సూచిస్తున్నారు. అయితే తల్లిదండ్రులు చదువుకోకపోతే తమ పరిస్థితి ఏమిటని కొంత మంది విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ సరిహద్దు జిల్లాల్లో చదువుకున్న విద్యార్థులు ఎక్కువగా ఈ అంశంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై ప్రభుత్వం స్పందించి దీనిని పరిష్కరించాలని కోరుతున్నారు.

## మందస ఎయిర్‌పోర్టు పనులు అడ్డగింత

**ప్రజాశక్తి - శ్రీకాకుళం**

శ్రీకాకుళం జిల్లా మందస ప్రాంతంలో నిర్మించనున్న కార్గో ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులను స్థానికులు, రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. నేల స్వభావం, మార్కింగ్ కోసం వెళ్లిన సిబ్బందిని రైతులు, గ్రామస్తులు అడ్డుకున్నారు. ఎయిర్‌పోర్టు నిర్మాణంలో భాగంగా సాయల్ టెస్ట్ చేసేందుకు సిబ్బంది, రెవెన్యూ అధికారులు గురువారం ఉదయం 11 గంటల ప్రాంతంలో బిడిమి గ్రామానికి చేరుకున్నారు. సమాచారం తెలుసుకున్న బిడిమి, వంకులూరు, అనకాపల్లి, ఎం గంగువాడ, రాంపురం తదితర గ్రామాలకు చెందిన రైతులు, స్థానికులు భారీగా అక్కడకు చేరుకున్నారు. ఇక్కడకు ఎందుకు వచ్చారంటూ అధికారులను ప్రశ్నించారు. తాము ఎయిర్‌పోర్టును వ్యతిరేకిస్తున్నా... ఎందుకు వస్తున్నారంటూ నిలదీశారు. పచ్చని భూములను వదులుకోవడానికి సిద్ధంగా లేమని స్పష్టం చేశారు. ప్రజల అభిప్రాయం తెలుసుకోకుండా బలవంతంగా పనులు ఎందుకు చేస్తున్నారంటూ అడ్డుకున్నారు. తమ భూముల్లో మార్కింగ్‌లు చేయొద్దంటూ తేల్చిచెప్పారు. దీంతో అధికారులు అక్కడి నుండి వెనుదిరిగారు. పచ్చని భూములను బలవంతంగా తీసుకుంటామంటే ఊరుకునేది లేదని, కార్గో ఎయిర్‌పోర్టు తమకు అవసరం లేదని ఎయిర్‌పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు కొమర వాసు, జోగి అప్పారావు, లోకనాథం తేల్చిచెప్పారు.

స్థానికులు అడ్డుకోవడంతో వెనుదిరుగుతున్న సిబ్బంది

### 29 ఏళ్ల తరువాత

## కోయంబత్తూరు పేలుళ్ల నిందితుడి అరెస్టు

**కోయంబత్తూరు :** కోయంబత్తూరు వరుస పేలుళ్ల కేసులో కీలక నిందితుడు 'టైలర్' రాజు 29 ఏళ్ల తరువాత తమిళనాడు పోలీసులకు పట్టుబడ్డాడు. నిందితుడిని కోయంబత్తూరు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు ఎదుట గురువారం పోలీసులు హాజరుపరచగా, కోర్టు ఈ నెల 24 వరకూ జ్యుడీషియల్ కస్టడీకి అప్పగించింది. 1998 ఫిబ్రవరి 14న కోయంబత్తూరులోని పలు ప్రదేశాల్లో జరిగిన బాంబు పేలుళ్లలో 58 మంది ప్రాణాలు కోల్పోగా, 250 మంది తీవ్రంగా గాయపడ్డారు. నిషేధిత ఉగ్రవాద సంస్థ అల్ ఉమ్మా ఈ దారుణానికి పాల్పడింది. ఈ కేసులో కోయంబత్తూర్‌లోని సౌత్ ఉక్కడంలోని బిలాల్ ఎస్టేట్‌కు చెందిన కీలక నిందితుడైన 50 ఏళ్ల రాజు అలియాస్ సాధిక్ అలియాస్ షాజహాన్ అబ్దుల్ మజీద్ మకందర్ అలియాస్ షాజహాన్ షేక్‌ను కర్ణాటకలోని విజయపుర జిల్లాలో తమిళనాడు పోలీసులతో ఏర్పాటు చేసిన తమిళనాడు యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఎటిఎస్) బుధవారం రాత్రి అరెస్టు చేసింది. కోయంబత్తూరు కేసుతోపాటు పలు హత్య కేసుల్లో నిందితుడైన రాజు 1996 తరువాత ఎప్పుడూ పోలీసులకు పట్టుబడకపోవడం గమనార్హం.

## ముగిసిన రొట్టెల పండుగ

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

ఐదురోజుల పాటు జరిగిన రొట్టెల పండుగ గురువారం ముగిసింది. దేశ, విదేశాల నుంచి వచ్చిన యాత్రికులతో ఐదు రోజులు బారాషాహీద్ దర్గా వద్ద సందడి నెలకొంది. స్వర్ణాల తీరంలో ఆరోగ్యం, విదేశీయానం, ఉద్యోగం, చదువు, వివాహానికి సంబంధించిన రొట్టెలను యాత్రికులు పంచుకున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారుల మధ్య సరైన సమన్వయం లేకపోవడం, ప్రచారలోపం నెల్లూరు నగరంలో వివిధ అంశాలు ముందుకు రావడంతో రొట్టెల పండుగ ప్రాధాన్యత సంతరించుకోలేదు. ఈ ఏడాది కేవలం నారా లోకేష్ ఒక్కరే రొట్టెల పండుగకు హాజరయ్యారు. ప్రతి ఏడాది లక్షల్లో వచ్చే యాత్రికులు ఈ ఏడాది పది లక్షల లోపే వచ్చినట్లు సమాచారం.

## మయన్మార్‌లో బందీలుగా ఉన్నవారి విడుదలకు చర్యలు

- ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మయన్మార్‌లో బంధీలుగా ఉన్న విజయనగరం వాసులను విడుదల చేయించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ హామీ ఇచ్చారు. విదేశాల్లో ఉద్యోగాల కోసం ప్రయత్నించి ఏజెంట్ చేతిలో మోసపోయి విదేశాల్లో మానవ అక్రమ రవాణా ముఠా చెరలో మగ్గుతున్న తమ కుమారులను రక్షించాలని గండుబోయిన సూర్యకుమారి ఉపముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ మేరకు వినతి పత్రాన్ని గురువారం అందజేశారు. దీంతో పవన్ కల్యాణ్ వెంటనే స్పందించి కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్లారు. మానవ అక్రమ రవాణాలో భాగంగా విజయనగరానికి చెందిన 8 మంది మయన్మార్ సరిహద్దుల్లో బందీలుగా ఉన్నారని, వీరిని విడిపించి స్వదేశానికి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాలని పవన్ కోరారు.

**ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006**

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501**కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

## సచివాలయ ఉద్యోగి ఆత్మహత్య

- బదిలీయే కారణమంటున్న ఉద్యోగులు

ప్రజాశక్తి-పుల్లంపేట (అన్నమయ్య జిల్లా)

సచివాలయ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లె మండలం బాలిరెడ్డిపల్లి గ్రామ సచివాలయంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వైఎస్ఆర్ కడప జిల్లా ప్రొద్దుటూరు పట్టణం రామేశ్వరం గ్రామానికి చెందిన రాజేశ్వరి (32).. బాలిరెడ్డిపల్లి గ్రామ సచివాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఇటీవల నిర్వహించిన సాధారణ బదిలీల్లో భాగంగా ఆమె అన్నమయ్య జిల్లా సుండుపల్లెకు బదిలీ ఆయ్యారు.

తనను కడప జిల్లాకు బదిలీ చేయాలని అధికారులను ఆమె కోరారు. అధికారులు వినకపోవడంతో మనస్తాపంతో ఉరివేసుకున్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమర్టం నిమిత్తం రైల్వేకోడూరులోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. ఈ సంఘటనపై రైల్వేకోడూరు పోలీసులు కేసు నమోదు చేశారు. సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ మృతి చెందిన విషయం తెలుసుకున్న రైల్వేకోడూరు ఎమ్మెల్యే అవర శ్రీధర్ ఆస్పత్రికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించారు. రాజేశ్వరి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు.

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి

- ఐదుగురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మరణించిన సంఘటన కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలంలోని కాల్వబుగ్గ గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వ్యక్తిగత పనుల నిమిత్తం స్కార్పియో వాహనంలో కడప జిల్లా మైదుకూరు నుంచి హైదరాబాద్ వెళ్లిన కమల్ బాషా కుటుంబ సభ్యులు, బంధువులు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో కాల్వబుగ్గ సమీపంలోకి రాగానే మిడుతూరు నుంచి నంద్యాలకు రాళ్లబండల లోడుతో ముందు వెళుతున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టారు. ఈ ఘటనలో స్కార్పియోలో ప్రయాణిస్తున్న కమల్ బాషా (55), మున్ని (45) అక్కడికక్కడ మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన ఆరుగురిని చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న మూడు నెలల చిన్నారి షేక్ నదియా మృతి చెందారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# కరేడు భూ పోరాటంపై విభజన రాజకీయం

- ఉద్యమం నుంచి తమ వారిని వెనక్కి లాగేందుకు టిడిపి యత్నం
- కార్యకర్తలతో ఎమ్మెల్యే నాగేశ్వరరావు ప్రత్యేక సమావేశం
- ఉద్యోగాలు, పరిహారం పెంపునకు కృషి చేస్తానని హామీ
- వెనక్కి తగ్గని కార్యకర్తలు

టిడిపి కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు

ప్రజాశక్తి-కందుకూరు

భూ సేకరణకు వ్యతిరేకంగా కరేడు రైతులు సాగిస్తున్న ఉద్యమంలో విభజన రాజకీయానికి అధికార పార్టీ తెరలేపింది. టిడిపి కార్యకర్తలను ఉద్యమ బాట నుంచి వెనక్కి లాగేందుకు అధికార పార్టీ నాయకులు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలంలోని కరేడులో దాదాపు 8,400 ఎకరాల వ్యవసాయ భూమిని ఇండోసోల్ సోలార్ ప్రాజెక్టుకు దారాదత్తం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. రెండు పంటలు పండే భూములను సోలార్ పరిశ్రమకు అప్పగించడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను రైతులు పెద్ద ఎత్తున అడ్డుకుంటూ ఉద్యమిస్తున్నారు. రైతు ఉద్యమం ఇలాగే కొనసాగి తీవ్రతరమైతే భూసేకరణ సాధ్యం కాదని భావించిన అధికార పార్టీ నాయకులు తమ వ్యూహాలకు పదును పెట్టారు. ఇందులో భాగంగానే కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు బుధవారం మధ్యాహ్నం కరేడుకు చెందిన పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. రైతుల సమావేశంగా పేరు పెట్టినప్పటికీ నిజానికి టిడిపి కార్యకర్తలను మాత్రమే ఆహ్వానించారు. అయితే కేవలం ముగ్గురు నాయకులు తప్ప టిడిపి కార్యకర్తలెవ్వరూ ఈ సమావేశంలో భూసేకరణకు అంగీకరించలేదు. సోలార్ పరిశ్రమకు భూములు ఇవ్వడానికి తాము సిద్ధమేనని చెప్పిన ముగ్గురు నాయకులలోనూ ఇద్దరికీ అనేక ఏళ్లుగా వ్యవసాయంతో ప్రత్యక్ష సంబంధం లేదు. వాళ్ళిద్దరూ తమ పొలాలను కౌలుకు ఇస్తూ కాలక్షేపం చేస్తున్నారు. పైగా వాళ్లిద్దరూ జన బలం కలిగిన నేతలు కాదు. ఈ సమావేశంలో పాల్గొన్న మిగిలిన కార్యకర్తలందరూ భూసేకరణను తీవ్రంగా వ్యతిరేకించడంతో కొందరు క్రియాశీల కార్యకర్తలను ప్రత్యక్షంగా తన గదిలోకి పిలిపించుకొని ఎమ్మెల్యే మాట్లాడారు. అయినా కార్యకర్తలు వెనక్కి తగ్గలేదు. సోలార్ పరిశ్రమలో స్థానికులకు ఉద్యోగాలను ఇప్పించే బాధ్యతను తాను తీసుకుంటానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చినప్పటికీ కార్యకర్తలు ఊ కొట్టలేదు. భూములకు మరింత పరిహారం ఇప్పించేందుకు తాను కృషి చేస్తానని కూడా హామీ ఇచ్చారు. సమావేశంలో పాల్గొన్న కార్యకర్తలు భూసేకరణను తీవ్రంగా వ్యతిరేకించినప్పటికీ ఓ నాయకుడు మాత్రం కరేడులోని 75 శాతం మంది ప్రజలు భూసేకరణకు అనుకూలంగా ఉన్నారని చెప్పారు.

**వైసిపి వైఖరిపై అనుమానాలు**

కరేడు భూసేకరణ వ్యతిరేక ఉద్యమాన్ని నీరుగార్చడానికి అధికార పార్టీ నేతలు ఓవైపు ప్రయత్నిస్తుండగా మరోవైపు ప్రతిపక్ష వైసిపి నాయకులు రైతు ఉద్యమం పట్ల అంటీఅంటున్నట్లు వ్యవహరిస్తున్నారు. ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు మాత్రం ఓ సారి కరేడు గ్రామ సభకు వెళ్లి వచ్చారు. భూసేకరణకు వ్యతిరేకంగా మాజీ మంత్రి మేరుగ నాగార్జున పత్రికా ప్రకటన ఇచ్చారు. అయితే కందుకూరు శాసనసభ నియోజకవర్గానికి ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్న బుర్రా మధుసూదన్ యాదవ్ ఇంతవరకు కరేడు వైపు తొంగి చూడలేదు. బుధవారం కందుకూరులో తమ పార్టీకి చెందిన కరేడు కార్యకర్తలతో భూసేకరణ సమస్యపై మాట్లాడారు. అంతకు మించి ముందడుగు వేయలేదు.

## 18న ఐఎన్ఎస్ నిస్తార్ జలప్రవేశం

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ (విశాఖ)

హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్ ఇటీవల నిర్మించి భారత నావికా దళానికి అప్పగించిన మొదటి తరగతి తొలి స్వదేశీ డ్రైవింగ్ సపోర్ట్ వేసెల్ ఐఎన్ఎస్ నిస్తార్ ఈ నెల 18న భారత రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ సమక్షంలో ప్రారంభించనున్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వేదికగా విశాఖపట్నం నేవల్ డాక్‌యార్డును అధికారులు ఎన్నుకున్నారు. విశాఖపట్నంలోని మెస్సర్స్ హిందుస్తాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ ద్వారా స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన ఈ నౌక లోతైన సముద్ర డైవింగ్, జలాంతర్గామి రెస్క్యూ కార్యకలాపాల నిమిత్తం తూర్పు నేవల్ కమాండ్‌లో చేరనుంది. ఈ ప్రతిష్టాత్మకమైన, అత్యాధునిక నౌక నిర్మాణంలో పలు ఎంఎస్ఎంఇ సంస్థలు 80 శాతం కంటే ఎక్కువ స్వదేశీ పరిజ్ఞానాన్ని అందించాయి. సుమారు 120 మీటర్ల పొడవు, 10 వేల టన్నుల కంటే ఎక్కువ బరువుతో ఈ నౌక డైనమిక్ పొజిషనింగ్ సిస్టమ్‌ను ఉపయోగించి అత్యంత ఖచ్చితత్వంతో లక్ష్యాలు ఛేదించగల సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఎయిర్, సాచురేషన్ డైవింగ్ సిస్టమ్‌లు, నీటి అడుగున రిమోట్లీ ఆపరేటెడ్ వెహికల్స్ సైడ్ స్కాన్ సోనార్, విస్తారమైన డైవింగ్ కాంప్లెక్స్ కలిగి ఉంది. ఈ నౌకలో ఆపరేషన్ థియేటర్, ఇంటెన్సివ్ కేర్ యూనిట్, ఎనిమిది పడకల ఆసుపత్రి, హైపర్‌బారిక్ వైద్య సౌకర్యాలను కూడా కలిగి ఉంది. సముద్రంలో 60 రోజులకుపైగా ఉండే సముదాయంతోపాటు, హెలికాప్టర్ కార్యకలాపాల సామర్థ్యం ఉంది. ఈ నౌక హిందూ మహాసముద్ర ప్రాంతంలో వ్యూహాత్మక సముద్ర స్థానాన్ని బలోపేతం చేస్తుందని అధికారులు తెలిపారు.

# బడిలో ఉండాల్సిన పిల్లలు పనిలో..

- కార్మిక శాఖ ప్రత్యేక డ్రైవ్
- పలు సంస్థలపై కేసులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బడిలో చక్కని చదువులు చదవాల్సిన పిల్లలు పొట్టకూటి కోసం రేయింబవళ్లు కార్మికుల్లా పని చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా కార్మికశాఖ గత నెలలో చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌లో పదుల సంఖ్యలో బాల కార్మికులను, కౌమార దశ కార్మికులను గుర్తించారు. ఈ మేరకు కార్మికశాఖ గురువారం నాడు ఒక ప్రకటన విడుదల చేసింది. ప్రమాద రహిత సంస్థలు, దుకాణాల్లో 21 మంది 14 ఏళ్ల లోపు వయస్సున్న బాలలు పనిచేస్తున్నట్లు తేలింది. 18 ఏళ్లలోపు వయస్సు గల కౌమార దశ బాలలు 189 మంది వివిధ సంస్థల్లో పనిచేస్తుండగా అధికారులు గుర్తించారు. అయితే ప్రమాదకర పరిశ్రమల్లో 14 ఏళ్ల లోపు బాలలు పనిచేస్తున్నట్లు తమ డ్రైవ్‌లో ఎక్కడా కనిపించలేదని కార్మికశాఖ తెలిపింది. కాగా బాలలతో పని చేయించుకుంటున్న సంస్థల యజమానులపై కనీస వేతనాల చట్టం ప్రకారం 147 కేసులు నమోదు చేసినట్లు పేర్కొంది. రూ.1,98,148 ఆయా బాల కార్మికులకు డిడిల రూపంలో ఇప్పించినట్లు తెలిపింది. కౌమార దశలో ఉన్నవారిని కూడా పనిలో పెట్టుకోవడంపై చట్ట ప్రకారం నిషేదం ఉందని, దీనిని ఉల్లంఘిస్తే సంబంధిత యజమానులపై కేసులు నమోదు చేయనున్నట్లు తెలిపింది. నేర నిర్ధారణ అయితే 6 నెలలు నుంచి 2 ఏళ్ల వరకు జైలు శిక్ష, రూ.20 వేలు నుంచి రూ.50 వేల వరకూ జరిమానా లేక రెండూ శిక్షలు విధించే అవకాశం ఉందని కార్మిక శాఖ వెల్లడించింది.

# ప్రజల సొమ్ము అదానికి దోచి పెట్టేందుకే స్మార్ట్ మీటర్లు

## కర్నూలులో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా పోరుబాట

కర్నూలులో ప్రచారం నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్/ రాజమహేంద్రవరం ప్రతినిధి

ప్రజల సొమ్ము అదానికి దోచి పెట్టేందుకే స్మార్ట్ మీటర్లు పెడుతున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి.రాముడు విమర్శించారు. కర్నూలు కార్పొరేషన్ పరిధిలోని రెవెన్యూ కాలనీ, పివి నరసింహారావు నగర్, ఇల్లూరు నగర్‌లో సిపిఎం ఆధ్వర్యంలో స్మార్ట్ మీటర్లపై పోరుబాట కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఇంటింటికి కరపత్రాలు పంచుతూ స్మార్ట్ మీటర్లు పెట్టడం వల్ల జరిగే నష్టాల గురించి వివరించారు.

ఈ సందర్భంగా రాముడు మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు అధికారంలోకి వస్తే కరెంటు ఛార్జీలు పెంచబోమని ప్రజలకు హామీ ఇచ్చిన చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన సంవత్సర కాలంలోనే రూ.20 వేల కోట్ల భారాన్ని వేశారన్నారు. స్మార్ట్ మీటర్ల వల్ల విద్యుత్ వినియోగదారులు ముందస్తుగా రీఛార్జ్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. డబ్బు ఉంటేనే కరెంటు వస్తుందని తెలిపారు. దీనిని ఆదిలోనే అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఈ నెల 14న బళ్లారి చౌరస్తా దగ్గర ఉన్న విద్యుత్ సౌదా కార్యాలయం ఎదుట చేపట్టే ధర్నాలో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

**తూర్పుగోదావరిలో కాంగ్రెస్ నిరసన దీక్ష**

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని విద్యుత్ శాఖ ఎస్ఇ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. దీక్షల్లో కాంగ్రెస్ పార్టీ తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు టికె.విశ్వేశ్వరరెడ్డి కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్మార్ట్ మీటర్లంటే ప్రజలను దోపిడీ చేయడమేనని ఆయన వ్యాఖ్యానించారు. మాజీ ఎంపి జివి.హర్షకుమార్ దీక్షా శిబిరాన్ని ప్రారంభించి సంఘీభావం తెలిపారు. మాజీ ఎంపి ఉండవల్లి అరుణ్ కుమార్, సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, సిపిఐ జిల్లా కార్యదర్శి టి.మధు, రాజమండ్రి చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షులు అశోక్‌కుమార్‌జైన్, అఖిలపక్ష నాయకులు దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు.

## ఏడుగురి ప్రాణాలను నిలబెట్టిన అవయవదానం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

తాను చనిపోయినా మరో ఏడుగురికి అవయవాలు దానం చేసి ప్రాణాలు నిలబెట్టారు విజయవాడకు చెందిన జ్యోతి. ఈ నెల 7న ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం ఎదురుగా జ్యోతి (56) నడుస్తూ వెళుతుండగా ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన తలకు తీవ్ర గాయాలవ్వడంతో చికిత్స నిమిత్తం సమీపంలో ఉన్న రమేష్ ఆస్పత్రిలో చేర్చారు. మెదడులో రక్తస్రావం జరుగుతున్నట్లుగా గుర్తించి మెరుగైన వైద్యం కోసం గుంటూరులోని రమేష్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే బ్రెయిన్ డెడ్ అయినట్లుగా వైద్యులు నిర్ధారించి జీవన్ దాన్ ప్రతినిధులకు సమాచారం అందించారు. వారు రోగి కుటుంబ సభ్యులకు అవయవదాన ఆవశ్యకతను తెలియజేసి వారి అనుమతితో ఒక కిడ్నీని గుంటూరులోని రమేష్ హాస్పిటల్స్‌కు, గుండెను తిరుపతిలోని శ్రీపద్మావతి ఆస్పత్రికి, ఊపిరితిత్తులను తెలంగాణ రాష్ట్రంలోని కిమ్స్ హాస్పిటల్స్‌కు, లివర్‌ను మణిపాల్ హాస్పిటల్స్‌కు, ఇంకొక కిడ్నీను క్యాపిటల్ హాస్పిటల్స్‌కు, కళ్ళు ఎల్‌వి.ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌కు ఇవ్వడానికి అనుమతి ఇచ్చారు. గ్రీన్ ఛానల్ ద్వారా గుండెను తిరుపతికి గురువారం తరలించారు. అవయవదానానికి అంగీకరించి మరొక ఏడుగురు ప్రాణాలు కాపాడటంలో కీలక భూమిక పోషించిన కుటుంబ సభ్యులను రమేష్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్.పోతినేని రమేష్ బాబు అభినందించారు. డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్.రాయపాటి మమత, క్లస్టర్ బిజినెస్ హెడ్ డాక్టర్. వై.కార్తీక్ చౌదరి పర్యవేక్షించారు.

## ముందస్తు బెయిల్ కోసం ప్రసన్న కుమార్ రెడ్డి పిటిషన్

ప్రజాశక్తి, అమరావతి

నెల్లూరు జిల్లా, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశానంటూ తనపై నమోదైన కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిని శుక్రవారం విచారణ జరపనుంది. రాజకీయ కక్ష సాధింపులో భాగంగా తనపై కేసు పెట్టారని, తనను ఎలాగైనా అరెస్టు చేయాలనే లక్ష్యంతో పోలీసులు ఉన్నారని, అరెస్టు చేస్తే ప్రతిష్ట దెబ్బతింటుందని, ముందస్తు బెయిల్ ఇవ్వాలని ఆయన గురువారం దాఖలు చేసిన పిటిషన్‌లో పేర్కొన్నారు. ప్రశాంతి రెడ్డిని కించపర్చే వ్యాఖ్యలు చేయలేదని, ఆమె అనుచరులే తన ఇంటిపై దాడి చేసి ధ్వంసం చేశారని చెప్పారు. ఇంటిపై దాడి గురించి పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఎఫ్ఐఆర్ కూడా చేయలేదన్నారు.

## ఎపిఇఆర్‌సి సభ్యుల నియామక గడువు పెంపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి(ఎపిఇఆర్‌సి)లో ఖాళీగా ఉన్న సభ్యుల నియామక గడువును రాష్ట్రప్రభుత్వం పొడిగించింది. ఈ నెల 9 తేదిన ముగిసిన గడువును 16వ తేది వరకు పొడిగిస్తున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ గురువారం ఉత్తర్వులు విడుదల చేశారు. సభ్యుల నియామకానికి రాష్ట్రప్రభుత్వం సెలక్షన్ కమిటీని జూన్ 18వ తేదిన నియమించిన విషయం తెలిసిందే. ఈ కమిటీకి ఛైర్మన్‌గా రిటైర్డ్ జడ్జి జస్టిస్ ఎం సత్యనారాయణ మూర్తిని,సభ్యులుగా రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు, సెంట్రల్ ఎలక్ట్రిసిటీ ఆథారిటీ ఛైర్‌పర్సన్ ఉన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 16వ తేదిలోపు దరఖాస్తులు పంపించాలని ప్రభుత్వం వెల్లడించింది.

## అది తాత్కాలిక నిర్ణయమే

- ఇంజనీరింగ్ కాలేజీల బ్లాక్ పిరియడ్ ఫీజుపై హైకోర్టు

ప్రజాశక్తి, అమరావతి

రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కాలేజీల్లో 2023-26 బ్లాక్ పీరియడ్‌కు ఫీజుల నిర్ణయం ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ (ఎపిహెచ్ఆర్ఎంసి) తాజాగా చేసే సిఫారసులకు, ప్రభుత్వ ఆమోదానికి లోబడి ఉంటుందని హైకోర్టు స్పష్టం చేసింది. అప్పటి వరకు ఈ ఫీజులు తాత్కాలికమేనని చెప్పింది. కాలేజీలన్నీ రెండు వారాల్లో నిబంధనల్లో నిర్దేశించిన వివరాలను కమిషన్‌కు అందజేయాలని పేర్కొంది. దీని ప్రకారం ఎపిహెచ్ఆర్ఎంసి తాత్కాలిక ఫీజును నిర్ణయించాలని, ఆ వివరాలను కాలేజీలకు ఇవ్వాలని ఆదేశించింది. వాటిపై కాలేజీలు ఎపిహెచ్ఆర్ఎంసి ఎదుట వాదనలు వినిపించుకోవాలంది. కాలేజీలు కోరిన ఫీజును తిరస్కరిస్తే అందుకు కారణాలను ఎపిహెచ్ఆర్ఎంసి నమోదు చేసి కాలేజీలకు అందజేయాలంది. అన్నీ రకాల ఫీజులను కలిపి ట్యూషన్ ఫీజుగా నోటిపై చేయడం చట్ట విరుద్ధమని పేర్కొంటూ గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వును రద్దు చేసింది. కాలేజీలకు కేటాయించిన సీట్లతో ప్రమేయం లేకుండా కాలేజీలో చేరిన సగటు విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఫీజు నిర్ణయించాలన్న సింగిల్ జడ్జి ఉత్తర్వులను రద్దు చేసింది. ఫీజు ఖరారు చేసేందుకు కాలేజీల నుంచి అవసరమైన సమాచారాన్ని విధిగా తీసుకోవాలని తేల్చి చెబుతూ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవి ధర్మాసనం బుధవారం తీర్పు చెప్పింది. ఏపీహెచ్ఆర్ఎంసీ ఖరారు చేసిన ఫీజులను సవాలు చేస్తూ ఏపీ ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాల పిటిషన్‌పై సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును ఆ యాజమాన్యాలు అప్పీల్ దాఖలు చేయడంపై ఇటీవల డివిజన్ బెంచ్ తీర్పు చెప్పింది.

## డిగ్రీలో 'సింగిల్ మేజర్' విద్యార్థులకు నష్టం

- పిడిఎఫ్ ఎమ్మెల్సీ గోపిమూర్తి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

డిగ్రీ విద్యలో సింగిల్ మేజర్ విధానం విద్యార్థులకు నష్టం కలుగుతుందని పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. ఇది విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీస్తుందని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఉన్నత విద్య కమిషనర్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. దీనివల్ల అధ్యాపకులకు కూడా నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే సామాజిక శాస్త్రాలు కనుమరుగయ్యాయని, భవిష్యత్తులో గణితం, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రాలతో పాటు బాషలు కూడా కనుమరుగవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రభావం సమాజంపై పడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం దీనిపై ఆలోచించి పాత పద్ధతి గానీ డబుల్ మేజర్‌తో గానీ డిగ్రీ కోర్సులు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

## పెరుగుతున్న గోదావరి నీటిమట్టం

ప్రజాశక్తి - యంత్రాంగం

ఎగువ ప్రాంతం నుండి వస్తున్న వరదతో గోదావరి నీటిమట్టం నెమ్మదిగా పెరుగుతోంది. భద్రాచలం వద్ద గురువారం సాయంత్రానికి గోదావరి నీటి మట్టం 26.5 అడుగులకు చేరుకుంది. ప్రాణహిత నది నుండి అవుట్‌ఫ్లో విడుదల పెరుగుతోందని, 7 లక్షల క్యూసెక్కులకు చేరవచ్చని, దీని కారణంగా సమక్క బ్యారేజీ నుండి విడుదలయ్యే నీరు ఇంద్రావతితో సహా 8 లక్షల క్యూసెక్కులకు పెరగవచ్చని సిడబ్ల్యూసి అధికారులు తెలిపారు. భద్రాచలం వద్ద నీటి మట్టం శుక్రవారం సాయంత్రానికి 40 అడుగులకు చేరుకోవచ్చని అంచనా వేస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు స్పిల్ వేలోకి చేరుకున్న అదనపు జలాలను అధికారులు దిగువకు విడుదల చేశారు. వేలేరుపాడు మండలంలోని రుద్రంకోట, రేపాకగొమ్ము, తాట్కూరుగొమ్ము, తదితర గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల ప్రజలు రెండు, మూడు రోజులుగా ఇళ్లలోని సామగ్రిని ఆటోలు, ట్రాక్టర్లపై మెరక ప్రాంతాలకు తరలిస్తున్నారు.

**కుక్కునూరు, వేలేరుపాడు మండలాలకు ప్రత్యేక అధికారులు**

గోదావరి పరివాహక ప్రాంతాల్లో వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. బలహీనంగా ఉన్న కాలువలు, నదీ పరీవాహక ప్రాంతాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. జులై నుంచి సెప్టెంబర్ వరకు అధిక వర్షాలు, వరదలను దృష్టిలో ఉంచుకుని, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో వరద పునరావాస కార్యక్రమాల నిర్వహణకు మండల ప్రత్యేక అధికారులను నియమించినట్లు చెప్పారు.

## బేవరేజెస్ హమాలీల కూలిరేట్ల పెంపుపై చర్చలు సానుకూలం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బేవరేజెస్ హమాలీల కూలీ రేట్ల పెంపుపై జరిగిన సంయుక్త సమావేశంలో హమాలీ యూనియన్స్, మద్యం తయారీ సంస్థల ప్రతినిధుల మధ్య చర్చలు సానుకూలంగా జరిగాయి. మంగళగిరిలోని ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయంలో ఆ శాఖ ఉన్నతాధికారుల సమక్షంలో జరిగిన ఈ చర్చల్లో మద్యం తయారీ సంస్థల ప్రతినిధులు పెట్టెకు 50 పైసలు పెంచేందుకు తయారీ సంస్థలు అంగీకరించగా, హమాలీల యూనియన్స్ 60 పైసలు పెంచాలని కోరారు. దీంతో మరోమారు సంయుక్త సమావేశం నిర్వహించి సమస్యలను పరిష్కరించుకోవాలని హమాలీ యూనియన్స్, మద్యం తయారీ సంస్థల ప్రతినిధులు నిర్ణయించారు. ఈ చర్చల్లో ఎపిఎస్ బిసిఎల్ అండ్ ఐఎంఎఫ్ ఎల్ డిపోస్ హమాలీ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె.ఉమామహేశ్వరరావు, రాష్ట్ర, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎన్.వి సుబ్బారెడ్డి, ఎం.మదన్మోహన్, కార్యదర్శి వి.కొండలరావు, ఉపాధ్యక్షులు ఎన్.ప్రసాదరావు, ఎఐటియుసి నాయకులు ఎస్.వెంకటసుబ్బయ్య, లోకేష్, మద్యం తయారీ సంస్థల ప్రతినిధులు కామేశ్వరరావు, నాగ రాజారావు, ఎక్సైజ్ శాఖ జిఎం అనసూయాదేవి, సిజిఎం చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## మిధున్‌రెడ్డి ముందస్తు బెయిల్‌పై తీర్పు వాయిదా

ప్రజాశక్తి, అమరావతి

మద్యం విధానంలో అక్రమాలు జరిగాయనే కేసులో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ ఎంపీ పీవీ మిథున్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు తీర్పును వాయిదా వేసింది. రెండు పక్షాల వాదనలు గురువారం పూర్తి కావడంతో తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు గురువారం ప్రకటించారు. సీనియర్ లాయర్ టి. నిరంజన్ రెడ్డి వాదనలు వినిపిస్తూ, ఆరోపణలకు ఒక్క ఆధారం కూడా లేకపోయినప్పటికీ దర్యాప్తు పేరుతో అరెస్టు చేయాలనే కుట్ర జరుగుతోందన్నారు. మద్యం విధానాన్ని తీసుకున్నది మంత్రివర్గమని, ఎంపీగా తన ప్రమేయం ఏమీ ఉండదని చెప్పారు. పిటిషనర్‌ను కావాలని మాస్టర్ మైండ్ అంటూ ఆరోపిస్తున్నారేగానీ అందుకు ఆధారాలు చూపడం లేదన్నారు. గత ప్రభుత్వంలో మద్యం ఆదాయం రూ.24వేల కోట్లకు పెరిగితే, ప్రభుత్వానికి నష్టం వచ్చిందని ఎలా చెబుతారని ప్రశ్నించారు. 2014-19 మధ్య కాలంలో అంతకు ముందున్న ప్రభుత్వంలో మద్యం అమ్మకాలు గణనీయంగా పెరిగినా ఆదాయం పెరగలేదన్నారు. పీఎల్ఆర్ ప్రాజెక్ట్స్‌కు పిటిషనర్ డైరెక్టర్ కాదనే విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వమే గతంలో హైకోర్టుకు నివేదించిందన్నారు. తొలుత దర్యాప్తు సంస్థ తరపున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదిస్తూ, మద్యం స్కాంపై దర్యాప్తు పూర్తి కాలేదన్నారు. పిటిషనర్‌ను కస్టడీలోకి తీసుకుని విచారించాల్సిన అవసరం కూడా ఉందన్నారు. పిటిషనర్ దర్యాప్తునకు సహకరించడం లేదని, సాధారణ ప్రశ్నకు కూడా జవాబు ఇవ్వడం లేదన్నారు. రాజకీయంగా పలుకుబడి ఉన్న వ్యక్తి కాబట్టి ముందస్తు బెయిల్ ఇవ్వొద్దని కోరారు. వాదనలు పూర్తి కావడంతో తీర్పు వాయిదా పడింది.

## రిమాండ్ పేరుతో మూడేళ్లు జైల్లో ఎలా ఉంచుతారు?

- స్థిరాస్తి వ్యాపారి విడుదలకు హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి, అమరావతి

గుంటూరు జిల్లాకు చెందిన ఒక స్థిరాస్తి వ్యాపారిని రిమాండ్ పేరిట జైలుకు పంపి..మూడేళ్లుగా పొడిగిస్తూ రావడంపై హైకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. సదరు వ్యాపారిని రిమాండ్‌కు పంపిన గుంటూరు జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ తీరును ప్రశ్నించింది. తమ ఆదేశాలను అమల్జేయలేదంటూ విజయసారథి హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ యజమాని అల్లాభక్షును కమిషన్‌కు రిమాండ్‌కు పంపుతూ తొలిసారి 2022లో ఉత్తర్వులు జారీ చేసింది. అవే రిమాండ్ ఉత్తర్వులను మూడేళ్లుగా ఎలా పొడిగించుకుంటూ వెళతారని కమిషన్‌ను హైకోర్టు ధర్మాసనం ప్రశ్నించింది. కమిషన్ ఉత్తర్వులు ప్రజల వ్యక్తిగత స్వేచ్ఛను హరించడం కిందకే వస్తుందని తప్పుపట్టింది. రాజ్యాంగం కల్పించిన వ్యక్తి స్వేచ్ఛకు భంగం కలిగిస్తే ఎలాగని ప్రశ్నించింది. జైలు శిక్ష విధింపు అధికారాన్ని వినియోగదారుల కమిషన్ ఇష్టానుసారంగా వినియోగించడానికి వీల్లేదని తేల్చి చెప్పింది. అల్లాభక్షును మూడేళ్లుగా జైల్లో ఉంచడం ఎంతమాత్రం సమర్ధనీయం కాదని, తక్షణమే అతనిని విడుదల చేయాలని గుంటూరు జైలు సూపరింటెండెంట్‌ను జస్టిస్ రావు రఘునందన్‌రావు, జస్టిస్ జగడం సుమతి లతో కూడిన డివిజన్ బెంచ్ ఇటీవల ఆదేశాలిచ్చింది. అల్లాభక్షు.. గుంటూరు జిల్లా, వంకాయలపాడు గ్రామ పరిధిలో విజయసారథి హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ పేరిట రియల్ ఎస్టేట్ వ్యాపారం ఉంది.. స్థలాల అమ్మకాల నిమిత్త కొనుగోలుదారుల నుంచి డబ్బులు వసూలు చేసి అగ్రిమెంట్ చేసుకున్నారు. అయితే, ప్లాట్లను ఇవ్వకపోవడంతో మోసపోయినట్లు 2019లో వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కమిషన్ విచారణ జరిపి, నాలుగు వారాల్లో 12 శాతం వడ్డీతో సహా కొనుగోలుదారులకు మొత్తం డబ్బు చెల్లించాలని అల్లాభక్షును ఆదేశించింది. దీనిని అల్లాభక్షు అమలు చేయకపోవడంతో బాధితులు పెనాల్టీ పిటిషన్లు వేశారు. వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావాలని అల్లాభక్షును ఆదేశిస్తే అమలు చేయలేదు. దీంతో కమిషన్ వారెంట్ జారీ చేయడంతో పోలీసులు కమిషన్ ఎదుట హాజరుపర్చారు. 2022 జూలై 20న విధించిన రిమాండ్ ఉత్తర్వులను అనేకసార్లు కమిషన్ పొడిగిస్తూ వచ్చింది. దీనిని అల్లాభక్షు సోదరుడు హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ వేయడంతో పైవిధంగా ఉత్తర్వులు వెలువడ్డాయి.

## ఉత్పత్తుల ఎగుమతికి బిఐఎస్ తప్పనిసరి

- పరిశ్రమల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

వివిధ సంస్థల ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేయాలంటే భారత ప్రమాణాల బ్యూరో (బిఐఎస్) ధృవీకరణ తప్పనిసరి అని పరిశ్రమల శాఖ అదనపు డైరెక్టర్ ఎ.రామలింగేశ్వరరాజు తెలిపారు. విజయవాడలోని ఒక హోటల్‌లో బిఐఎస్, పరిశ్రమల శాఖ, ఎఫ్ఎస్ఎంఇ సంయుక్త ఆధ్వర్యంలో ఇండస్ట్రియల్ మీట్‌ను గురువారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రామలింగేశ్వరరాజు మాట్లాడుతూ.. రాష్ట్రంలో 16 లక్షల ఎంఎస్ఎంఇలు, 1,100 బారీ పరిశ్రమలు ఉన్నాయని తెలిపారు. బిఐఎస్ ధృవీకరణ పొందేందుకు ఖర్చు అధికంగా ఉందనే కారణంతో ఎక్కువ సంస్థలు ముందుకు రావడం లేదని చెప్పారు. ఎంఎస్ఎంఇలు.. బిఐఎస్ ధృవీకరణ పొందడానికి రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీ అందిస్తున్నట్లు చెప్పారు. బిఐఎస్ డైరెక్టర్ ప్రేమ్ సజినీ మాట్లాడుతూ.. ఇండియాలో ప్రమాణాలను నిర్ధారించాలంటే అది బిఐఎస్ మాత్రమే చేయాలన్నారు. దేశంలో ఉత్పత్తుల తయారీ, నిల్వ, అమ్మకాలు చేయాలన్నా బిఐఎస్ ధృవీకరణ అవసరమని చెప్పారు. 816 వస్తువులకు బిఐఎస్‌ను తప్పని సరి చేశారని తెలిపారు. ఇతర దేశాలకు చెందిన వస్తువులు దేశంలో అమ్మాలన్నా బిఐఎస్ ధృవీకరణ అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో ఎఫ్ఎస్ఎంఇ చైర్మన్ కెఎల్ఎన్ ప్రకాష్‌రావు, పరిశ్రమల శాఖ జాయింట్ డైరెక్టర్ వెంకట్రరావు, డిప్యూటీ డైరెక్టర్ వివేక్‌రెడ్డి తదితరలు పాల్గొన్నారు.

## విఓఎలకు కాలపరిమితి రద్దు

- ఎపి వెలుగు విఓఎల సంఘం డిమాండ్

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

వెలుగు విఓఎ ఉద్యోగులకు మూడు ఏళ్ల కాల పరిమితి రద్దు చేయాలని ఎపి వెలుగు విఓఎ ఉద్యోగుల సంఘం (సిఐటియు) రాష్ట్ర కమిటి డిమాండ్ చేసింది. విజయవాడలోని దుర్గాపురం సిఐటియు రాష్ట్ర కార్యాలయంలో సంఘం అధ్యక్షురాలు సిహెచ్.రూపాదేవి అధ్యక్షతన రాష్ట్ర కమిటీ సమావేశం గురువారం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మీ మాట్లాడుతూ.. 3 ఏళ్ల కాలపరిమితి రద్దు కోసం విఓఎలు ఐదేళ్లుగా పోరాటం చేస్తున్నట్లు చెప్పారు. మెప్మాలో ఆర్పిలకు ఈ విధానాన్ని ఇటీవలే తొలగించాలరని తెలిపారు. సమావేశం అనంతరం విఓఎల సమస్యలపై గ్రామీణ పేదరిక నిర్మూలన శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు, సెర్ప్ ఎసిఇఒ శ్రీరాములు నాయుడుకు రాష్ట్ర కమిటీ నాయకుల బృందం వినతి పత్రాన్ని అందించింది.

విఓఎలపై రోజు రోజుకూ పెరుగుతున్న పని భారాన్ని తగ్గించాలని, పని చేయడానికి వీలుగా శిక్షణ ఇవ్వడం, 5జి మొబైల్స్, సిమ్ కార్డ్స్, యూనిఫాం, ఐడి కార్డులు, రూ.10 లక్షల గ్రూప్ ఇన్స్యూరెన్స్, అర్హులైన వారికి సిసిలు పదోన్నతులు, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రంలో కోరారు. వినతిపత్రం అందించిన వారిలో యూనియన్ రాష్ట్ర నాయకులు ఎ.తిరుపతయ్య, కె.కృష్ణమ్మ, డి.మహేష్, ఎ.ఉమాదేవి, ఎస్.మహాలక్ష్మి, జి.గుంటప్ప, ఎ.రామకృష్ణారెడ్డి, ఇ.సుంకన్న, ఎం.సుబ్రమణ్యం తదితరలు ఉన్నారు.

## హింద్‌వేర్ కిచెన్ పోర్టుపోలియో బలోపేతం

హింద్‌వేర్ స్మార్ట్ అప్లయెన్సెస్ తమ కిచెన్ అప్లయెన్సెస్ పోర్ట్‌ఫోలియోను బిఎల్‌డిసి టెక్నాలజీ మోటార్‌తో కూడిన చిమ్నీలు, అత్యాధునిక హాబ్‌లు, కొత్త ఓవెన్‌లు, స్టైలిష్ కిచెన్ సింక్‌లతో విస్తరించినట్లు ఆ సంస్థ పేర్కొంది. భారత్‌లో వేగంగా పెరుగుతున్న స్థిరాస్తి మార్కెట్, పట్టణీకరణ, ఆధునిక జీవనశైలి డిమాండ్‌కు అనుగుణంగా, ఈ ఇంధన పొదుపు ఉత్పత్తులు టైర్-2, టైర్-3 నగరాల్లో పెరుగుతున్న అవసరాలను తీర్చనున్నాయని హింద్‌వేర్ హోమ్ ఇన్నోవేషన్ లిమిటెడ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ చౌదరి పేర్కొన్నారు.

# స్మార్ట్ మీటర్ల వ్యతిరేక ఉద్యమం

### 13న రాష్ట్ర సదస్సు : ప్రజాసంఘాల ఐక్య వేదిక

ఐక్య వేదిక సమావేశంలో మాట్లాడుతున్న వి. ఉమా మహేశ్వర రావు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

విద్యుత్ వినియోగదారులపై స్మార్ట్ మీటర్ల పేరుతో ఛార్జీల బాదుడు ప్రారంభమైందని ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులు పేర్కొన్నారు. విజయవాడలోని దాసరి భవన్‌లో రాష్ట్ర స్థాయి ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకుల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్త ఉద్యమాన్ని రూపొందించాలని నిర్ణయించారు. దానిలో భాగంగా రాష్ట్ర స్థాయి సదస్సుని ఈ నెల 13న జరపాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, ఇప్పటికే వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లోని విద్యుత్ సర్వీసులకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు చేశారని, ప్రస్తుతం గృహ వినియోగ సర్వీసులకు ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు.

ఈ మీటర్ల వల్ల సెల్ ఫోన్ ప్రీ పెయిడ్ రీచార్జ్ తరహాలో వినియోగించబోయే విద్యుత్‌కు ముందుగానే చెల్లింపులు చేయాల్సి ఉంటుందన్నారు. మీటర్ ఖర్చును వినియోగదారులే వాయిదాల రూపంలో భరించాలని, పీక్ అవర్స్‌లో అధిక ధరలు వసూలు చేస్తారని తెలిపారు. ఈ అంశాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి, జరిగే నష్టాన్ని తెలియజేయాలన్నారు. ఇందుకోసం 13వ తేదీన జరిగే సదస్సులో అధిక సంఖ్యలో ప్రజా సంఘాలను భాగస్వామ్యం చేయాలని కోరారు. రాష్ట్ర సదస్సు అనంతరం జిల్లాలు, పట్టణాలు, మండల స్థాయిల్లో సదస్సులు నిర్వహించి స్మార్ట్ మీటర్ల వల్ల జరిగే నష్టంపై ప్రజల్లో అవగాహన కలిగించాలన్నారు. ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ మాట్లాడుతూ.. స్మార్ట్ మీటర్ల వల్ల జరిగే నష్టాన్ని వినియోగదారులకు అవగాహన కల్పించేందుకు ప్రజా సంఘాలు కార్యాచరణ రూపొందించుకుని, ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఈ ఉద్యమంలో ప్రజలను భాగస్వాములు చేయడానికి సదస్సులో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. కొన్ని ప్రాంతాల్లో స్మార్ట్ మీటర్లను ఏర్పాటును ప్రతిఘటించిన సంఘటనలు చోటు చేసుకున్నాయని తెలిపారు. కొందరు గృహవినియోగదారుడి అనుమతి లేకుండా, విద్యుత్ సిబ్బందిపేరుతో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశానికి ఎపి రైతు సంఘం సీనియర్ నాయకులు వై.కేశవరావు అధ్యక్షత వహించారు. ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్షులు పి.ప్రసాద్, ప్రధాన కార్యదర్శి పోలారి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.జమలయ్య, ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రామకృష్ణ, టియుసిఐ రాష్ట్ర అధ్యక్షులు మరీదు ప్రసాద్ బాబు, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి వెంకటసుబ్బయ్య, నగర అధ్యక్షులు ఆంజనేయులు, కార్యదర్శి సాంబశివరావు, సిఐటియు రాష్ట్ర కోశాధికారి మూర్తి, ఎఐఎఫ్‌టియు (న్యూ) నాయకులు లక్ష్మణరావు, ఇఫ్టూ నగర కార్యదర్శి మునిశంకర్ తదితరులు సామావేశంలో పాల్గొన్నారు.

మాంగనీస్ గనిలో తనిఖీలు చేస్తున్న అధికారులు

## దేవాడ మాంగనీస్ గనిలో అధికారుల తనిఖీలు

**ప్రజాశక్తి-చీపురుపల్లి (విజయనగరం జిల్లా)**

విజయనగరం జిల్లా గరివిడి మండలం దేవాడలోని మహాలక్ష్మి మినరల్స్ మైనింగ్‌లో గురువారం రెవెన్యూ, మైనింగ్ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. దేవాడ మైనింగ్ బ్లాక్‌లో నిబంధనలకు విరుద్ధంగా మాంగనీస్ తవ్వుతున్నట్లు డిప్యూటీ సిఎం కార్యాలయానికి ఫిర్యాదులు వచ్చాయి. ప్రజాభిప్రాయ సేకరణలో వచ్చిన అభ్యంతరాలను పరిగణలోకి తీసుకోకుండా తవ్వకాలు చేపడుతున్నారని ఆ ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు అధికారులు తనిఖీలు చేశారు. మైనింగ్ అనుమతులు, రాయల్టీ చెల్లింపులు, ఖనిజం తవ్వకాలపై ఆరా తీశారు. మైనింగ్ ఎంత విస్తీర్ణంలో తీసుకున్నారు? మైనింగ్ నుంచి వస్తున్న రా మెటీరియల్ ఎక్కడ వేస్తున్నారు? మైనింగ్ నుంచి వస్తున్న మెటీరియల్ ఎక్కడ విక్రయిస్తున్నారు? ఎప్పుడు లీజుకు తీసుకున్నారు? తదితర విషయాలను పరిశీలించారు. ఈ తనిఖీల్లో డిప్యూటీ కలెక్టర్ మురళి, మైనింగ్ శాఖ ఆర్ఐ రాంబాబు, తహాశీల్దార్ బంగారురాజు పాల్గొన్నారు. డిప్యూటీ సిఎం ఆదేశాల మేరకు ఈ తనిఖీలు చేపట్టామని, దీనిపై ఓ నివేదికను డిప్యూటీ సిఎం కార్యాలయానికి పంపినున్నట్లు అధికారులు తెలిపారు.

## సరిహద్దు గ్రామాల సమస్యలు పరిష్కరించాలని గిరిజనుల ధర్నా

**ప్రజాశక్తి- మందస (శ్రీకాకుళం జిల్లా)**

ధర్నా చేస్తున్న గిరిజనులు

ఆంధ్రా-ఒడిశా సరిహద్దు గిరిజన గ్రామాల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శ్రీకాకుళం జిల్లా మండసలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో గిరిజనులు గురువారం ధర్నా నిర్వహించారు. ధర్నాకు సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహన రావు సంఘీభావం తెలిపారు.

ఈ సందర్భంగా గిరిజన సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు సవర గురునాథ్, సవర ఫాల్గునరావు మాట్లాడుతూ... మండలంలోని సాబకోట, చీపి, బుడార్‌సింగి పంచాయతీ పరిధిలోని మాణిక్యప ట్నం, మధ్యకళ్ల దాల్సరి, కొండమేర, గుడ్డికోల గ్రామాల్లో గిరిజనులు తరతరాలుగా స్థిరనివాసాలు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నామని తెలిపారు.

ఒడిశా గ్రామాలను ఆంధ్రా ప్రాంతంలో నిర్మిస్తూ సరిహద్దు గ్రామాల్లోని భూములు, చెరువులు, శ్మశానాలు, పంట కాలువలు, రోడ్లను ఒడిశా ప్రభుత్వం అండతో ఆక్రమించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మౌలిక వసతులు, కనీస సౌకర్యాలు కల్పించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే జోక్యం చేసుకొని సమస్యలు పరిష్కరించాలని గిరిజనులు సాగుచేస్తున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, గిరిజనుల సాగులో ఉన్న భూములను ఆక్రమించుకుంటున్న గిరిజనేతరులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## సముద్రంలో మునిగిన బోటు

- సురక్షితంగా బయటపడ్డ మత్స్యకారులు

**ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్**

శ్రీకాకుళం జిల్లా కొయ్య గ్రామం సముద్ర తీరంలో అలల తాకిడికి బోటు ధ్వంసమై మునిగిపోయింది. విశాఖపట్నం నుంచి ఎనిమిది మంది మత్స్యకారులు 954 ఎంఎం బోటులో చేపల వేటకు వెళ్లారు. విశాఖపట్నానికి 45 నాటికల్ మైళ్ల దూరంలో శ్రీకాకుళం జిల్లా కొయ్య గ్రామానికి సమీపంలో అలల తాకిడికి బోటు మునిగిపోయింది. బోటు యజమాని ధనరాజు, కళాశీలు ఎం.కొండ, ఎల్లయ్య, నీలయ్య, సత్తయ్య, కె.సత్తయ్య, సిహెచ్ అప్పలరాజు, సూరి, డ్రైవర్ ఎస్.రాము బోటు మునిగిపోతుండగా, దగ్గరలోనే ఉన్న ఎంఎం 56 ఎల్లమ్మ తల్లి బోటులోకి చేరుకున్నారు. దీంతో అందరూ సురక్షితంగా బయటపడ్డారు. సముద్రంలో మునిగిపోయిన బోటు విలువ సుమారు రూ.50 లక్షలు ఉంటుందని, అందులో ఉన్న ఆయిల్ సుమారు ఐదు వేల లీటర్లు అని, అన్నీ కలిపి సుమారు రూ.60 లక్షలు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.చంద్రశేఖర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## తండ్రికి అంత్యక్రియలు నిర్వహించిన కుమార్తె

**ప్రజాశక్తి - ఆలమూరు(డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా)**

తండ్రి అంత్యక్రియలకు నిర్వహిస్తున్న చిన్నకుమార్తె

తనను పెంచి పెద్దచేసిన తండ్రి రుణం తీసుకునేందుకు కుమార్తె కొడుకుగా మారి అంత్యక్రియలు నిర్వహించింది. ఈ ఘటన డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరులో గురువారం చోటు చేసుకుంది. ఆలమూరుకు చెందిన ఈదల శ్రీనివాస్ (61) వృత్తిరీత్యా పశు వైద్యుడు. ఆయన ప్రస్తుతం పినపల్ల పశువైద్యశాలలో పనిచేస్తున్నారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు. ఇద్దరికీ వివాహం చేశాడు. పెద్ద కుమార్తె హరీష మండపేట మండలం తాపేశ్వరంలోని అత్తింట్లో ఉంటోంది. చిన్న కుమార్తె గాయత్రికి ఇటీవలే వివాహం చేశారు. ఆమె తన భర్తతో కలిసి అమెరికాలో ఉంటున్నారు. ఇటీవల అనారోగ్యానికి గురైన శ్రీనివాస్ పరిస్థితి విషమించి మంగళవారం మరణించారు. తండ్రి అంత్యక్రియలను చిన్నకుమార్తె గురువారం నిర్వహించారు.

# రోడ్డెక్కే ప్రతి రైతు రౌడీనా?

### వైసిపి అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి ప్రశ్న

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

తమకు న్యాయం, గిట్టుబాటు ధర కావాలని అడిగే ప్రతి రైతునీ రౌడీగా ప్రచారం చేయడం అన్యాయమని వైసిపి అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో ఆయన పోస్ట్ చేశారు. రైతులకు ఏ సమస్యా లేదనే విధంగా ప్రభుత్వం ప్రచారం చేయడం, ప్రశ్నించిన వారందరూ అసాంఘికశక్తులన్ని చెప్పడం ఏం విధానమని ప్రశ్నించారు. కర్నాటకలో కిలో 14 చొప్పున కొంటుంటే కిలోకు రూ.4 పెట్టి కొంటామని ఎందుకు ప్రకటన చేశారు? కిలోకు కనీసం రూ.8 వెచ్చించైనా కొనాలని ఆదేశాలు ఎందుకు ఇచ్చారో రైతులకు సమాధానం చెప్పాలని పేర్కొన్నారు. కిలో రూ.16 పెట్టి కొనుగోలు చేస్తామని, ఎన్‌డిఏలో ఉన్న జెడిఎస్ నాయకులు కుమారస్వామికి కేంద్రం లేఖ రాసిందని తెలిపారు బంగారుపాళ్యంలో తాను పర్యటిస్తున్నానని తెలియగానే అచ్చెన్నాయుడును ఎందుకు ఢిల్లీకి పంపారో ప్రజలకు సమాధానం చెప్పాలని కోరారు. దాని అర్థం రైతులు నష్టపోతున్నట్లేనని, ఒకవైపు నష్టం జరుగుతుందని అంగీకరిస్తూనే, నష్టాన్ని ఎత్తిచూపితే విమర్శించడం ఏమిటని తెలిపారు. 2.2 లక్షల ఎకరాల్లో 76 వేల రైతుల కుటుంబాల సమస్యని, దాన్ని అడగడంలో తప్పేమిటో చెప్పాలని కోరారు. కూటమి ప్రభుత్వంలో వరి, మిరప, పత్తి, జొన్న, కందులు, మినుములు, పెసలు, మొక్కజొన్న, సజ్జ, రాగులు, అరటి, ఉల్లి, చీనీ, కోకో, పొగాకు చివరకు మామిడి ఏ పంటకూ కనీస గిట్టుబాటు లేదని తెలిపారు. మిర్చి రైతులు ధర కోసం గగ్గోలు పెడితే కేంద్రంతో కొనిపిస్తామని పేర్కొన్నారని, ఒక్క కిలో అయినా కొనలేదని తెలిపారు. రైతు భరోసా ఇవ్వలేదని, ఇన్‌పుట్ సబ్సిడీ విధానాన్ని గాలికి వదిలేశారని, ఉచిత పంటబీమా ఎత్తేశారు, ఆర్‌బికెలు,ఇ- క్రాప్ విధానం, గ్రామంలోనే నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు సప్లయి చేసే వ్యవస్థను నిర్వీర్యం చేశారని తెలిపారు. ఇప్పటికైనా రైతులను నేరగాళ్లుగా చూపే పనిగాకుండా వారిని ఆదుకునే పనిచేయాలని కోరారు.

**పాలన వదిలేసి రికార్డుల కోసం తాపత్రయం : పుత్తా**

కూటమి ప్రభుత్వం పాలన గాలికొదిలేసి రికార్డుల కోసం ప్రయత్నాలు చేస్తోందని వైసిపి అధికార ప్రతినిధి పుత్తా శివశంకర్‌రెడ్డి తెలిపారు. గురువారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. గురుపూర్ణిమ సందర్భంగా తల్లికి వందనం ఆలోచన లోకేష్ చేశారని చెప్పడం అన్యాయమని అన్నారు.

జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుండి అమ్మఒడి ఇస్తున్నారని, దానికి పేరుమార్చి లోకేష్ ఆలోచన నుండి వచ్చిందని చెప్పడం సరికాదని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను పక్కదారి పట్టించి గిన్నీస్‌బుక్ రికార్డుల కోసం ప్రయత్నించడం ఏమి పద్ధతని ప్రశ్నించారు.

## ఎన్నాళ్ళయినా ప్రోగ్రామర్లను ఎఐ భర్తీ చేయలేదు

- మైక్రోసాఫ్ట్ బిల్‌గేట్స్ వెల్లడి

**శాన్‌ఫ్రాన్సిస్కో :** కృత్రిమ మేధా (ఎఐ) ఎంత విస్తరించినప్పటికీ ప్రోగ్రామర్లను భర్తీ చేయలేదని మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ అన్నారు. వచ్చే 100 ఏళ్లలోనూ ప్రోగ్రామర్లకు ఎఐ ప్రత్యామ్నాయం కాలేదని..అంతేకాదు కోడింగ్ పైనా ఎఐ ప్రభావం ఉండదని పేర్కొన్నారు. ఎఐ అనేది ప్రోగ్రామింగ్ రంగంలో మనిషికి ప్రత్యామ్నాయం కాలేదని.. కేవలం ఒక సహాయకారిగా మాత్రమే పని చేస్తుందన్నారు. ప్రోగ్రామింగ్‌లో క్లిష్టమైన సమస్యగా భావించేదాన్ని ఎంతో నైపుణ్యంతో పరిష్కరించాల్సి ఉంటుందన్నారు. ప్రోగ్రామింగ్‌లో అది సవాలుతో కూడుకున్న విషయమన్నారు. మానవ మేధస్సు లేని యంత్రాలు అలా చేయలేవన్నారు. కోడింగ్ అంటే కేవలం టైపింగ్ చేయడం కాదని, చాలా లోతుగా ఆలోచించాల్సి ఉంటుందన్నారు. భవిష్యత్తులో కోడింగ్, ఎనర్జీ మేనేజ్‌మెంట్, బయాలజీ రంగాలకు ఆటోమేషన్ ముప్పు తక్కువేనని పేర్కొన్నారు.

# ఎల్ఐసిలో మళ్లీ వాటాల విక్రయం..!

**జూన్‌లో పెరిగిన పాలసీ అమ్మకాలు**

**న్యూఢిల్లీ :** ప్రభుత్వ రంగంలోని దిగ్గజ జీవిత బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసి)లోని వాటాలను విక్రయించాలని మోడీ సర్కార్ యోచిస్తోంది. కేంద్ర ప్రభుత్వం మరోసారి తన వాటాను విక్రయించడానికి వీలుగా పెట్టుబడుల ఉపసంహరణ శాఖ ప్రణాళికలు రూపొందిస్తోందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. 2022 మే నెలలో ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపిఒ)లో భాగంగా 3.5 శాతం వాటాను కేంద్రం విక్రయించింది. ఐపిఒలో ఒక్కో షేరుకు ధరల శ్రేణిని రూ.902-949గా నిర్ణయించి.. వాటాలను విక్రయించడం ద్వారా రూ.21 వేల కోట్లు తన ఖజానాలో వేసుకుంది. కేంద్రానికి ప్రస్తుతం ఎల్ఐసిలో 96.5 శాతం వాటా ఉంది. ఈ దఫా ఆఫర్ ఫర్ సేల్ (ఒఎఫ్ఎస్)లో భాగంగా తదుపరి వాటా విక్రయానికి మోడీ సర్కార్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. అయితే.. ప్రస్తుతానికి ఈ చర్చలు ఇంకా ప్రారంభ దశలో ఉన్నాయని తెలుస్తోన్నప్పటికీ.. పెట్టుబడులు ఉపసంహరణ ప్రక్రియ త్వరలోనే వేగవంతం అయ్యే అవకాశాలు మెండుగా కనబడుతున్నాయి.

మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా వాటా విక్రయ ప్రక్రియను పెట్టుబడుల ఉపసంహరణ విభాగం పూర్తి చేయనుంది. 2027 మార్చి 16 నాటికి పబ్లిక్ షేర్ హోల్డింగ్‌ను 10 శాతం ఉండాలన్న నిబంధనను చేరుకోవడంలో భాగంగా మరో 6.5 శాతం వాటాను కేంద్రం విక్రయించాల్సి ఉంటుంది. అయితే.. ఎప్పుడు, ఎంతమేర వాటా విక్రయిస్తారనే అనే వివరాలు ఇంకా తెలియరావాల్సి ఉంది. కాగా.. త్వరలో పలు రాష్ట్రాల్లో జరగనున్న ఎన్నికల తర్వాత వాటాల విక్రయం ఉంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

ప్రస్తుతం ఎల్ఐసి మార్కెట్ విలువ రూ.5.85 లక్షల కోట్లుగా ఉంది. గురువారం బిఎస్ఇలో ఎల్ఐసి షేర్ 2.01 శాతం నష్టపోయి 926.85 వద్ద ముగిసింది. ఈ ఏడాది జూన్‌లో ఎల్ఐసి వ్యక్తిగత ప్రీమియం ఆదాయం 14.60 శాతం పెరిగి రూ.5,313 కోట్లుగా నమోదయ్యింది. గతేడాది ఇదే నెలలో 12.49 లక్షల పాలసీలను జారీ చేయగా.. 2025 జూన్‌లో కొత్తగా 14.65 లక్షల పాలసీలను విక్రయించింది.

# పరుపుల కంపెనీలో అగ్నిప్రమాదం

- సుమారు రూ.10 కోట్ల మేర ఆస్తి నష్టం

**ప్రజాశక్తి - ఏలూరు అర్బన్**

మంటలు అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

ఏలూరు జిల్లా కొత్తూరు రోడ్డులోని వంగాయగూడెం కేన్సర్ ఆసుపత్రి ఎదురుగా ఉన్న పరుపుల కంపెనీలో గురువారం ఉదయం భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. సుమారు రూ.10 కోట్లు మేర ఆస్తి నష్టం వాటిల్లింది. అగ్నిమాపక సిబ్బంది సుమారు మూడు గంటలు శ్రమించి మంటలను అదుపు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వంగాయగూడెంలో సుస్మిత ఫర్నీచర్ కుషనింగ్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీని సుమారు మూడేళ్ల క్రితం ఏర్పాటు చేశారు. పరుపులతోపాటు, పరుపులకు వాడే ఫోమ్ మెటీరియల్ కూడా అక్కడే తయారు చేస్తున్నారు. గురువారం ఉదయం వాచ్‌మెన్ ఫ్యాక్టరీలో ఎసిలు ఆన్ చేశారు. కొద్దిసేపటికే లోపలి నుంచి భారీగా మంటలు ఎగసిపడడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. మంటల కారణంగా సమీప ప్రాంతంలో భారీగా పొగ వ్యాపించింది. స్థానికులు అందించిన సమాచారం మేరకు ఏలూరు, భీమడోలు, కైకలూరు, హనుమాన్ జంక్షన్ ఫైర్ స్టేషన్‌ల నుంచి ఫైరింజన్లను రప్పించి సుమారు మూడు గంటలపాటు శ్రమించి మంటలను అదుపు చేశారు. మూడు రోజులుగా సుమారు రూ.50 లక్షల విలువైన పరుపులను తయారు చేశామని, అవన్నీ కాలి బూడిదయ్యాయని అక్కడ పనిచేసే కార్మికులు తెలిపారు. పరుపులు తయారు చేసేందుకు వాడే మిషనరీ రూ.10 కోట్ల వరకు ఉంటుందని, మిషనరీ మొత్తం కాలిపోయిందని ఏలూరు ఫైర్ ఆఫీసర్ రామకృష్ణ తెలిపారు. ఫ్యాక్టరీలో ప్రమాదం జరిగే సమయానికి కార్మికులు ఎవరూ విధులకు రాకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. ఏలూరు డిఎస్‌పి శ్రావణ్‌కుమార్, వన్‌టౌన్ సిఐ సత్యనారాయణ, సిబ్బంది అక్కడికి చేరుకుని పరిస్థితిని పర్యవేక్షించారు.

# సీమలో కరువు నివారణకు మార్గమేంటి?

- కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్

**ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్**

సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, పక్కన మంత్రి అచ్చెన్నాయుడు

రాయలసీమ జిల్లాలలో కరువు నివారణకు శాశ్వత పరిష్కారం కనుగొందామని కేంద్ర వ్యవసాయ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్ అన్నారు. గురువారం శ్రీసత్యసాయి జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో దక్షిణ ఆంధ్రప్రదేశ్ లోని కరువు పీడిత జిల్లాల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు కలిసికట్టుగా ఆలోచించి కరువు నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలన్నది తగిన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో గ్రామీణ అభివృద్ధి, ఉపాధి హామీ పథకం, వాటర్ షెడ్ తదితర పథకాల కింద ఎలాంటి చర్యలు తీసుకోవచ్చో తెలపాలని సూచించారు. ఎలాంటి సహకారం కావాలన్న అందించడానికి కేంద్రం సిద్ధంగా ఉందని చెప్పారు. క్షేత్రస్థాయిలో పథకాల అమలతో పాటు కరువును ఎలా అధిగమించవచ్చునో ప్రణాళిక తయారు చేయాలన్నారుసత్యసాయి జిల్లా కలెక్టర్ టిఎస్ చేతన్ మాట్లాడుతూ.. జిల్లాలో వ్యవసాయ అనుబంధ రంగాలు, ఉద్యాన శాఖ పరిధిలో చేపడుతున్న కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీ రావు, రాష్ట్ర హార్టికల్చర్ మరియు సిరికల్చర్ కమిషనర్ కె .శ్రీనివాసులు, అనంతపురం జిల్లా జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ, సత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, కర్నూలు జాయింట్ కలెక్టర్ నవ్య తదితరులు పాల్గొన్నారు.

# టిసిఎస్‌కు రూ.12,760 కోట్ల లాభాలు




- ప్రతీ షేర్‌పై రూ.11 డివిడెండ్
- క్యూ1లో పెరిగిన నియామకాలు

**ముంబయి :** దేశంలోనే అతిపెద్ద ఐటి కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) మెరుగైన ఫలితాలను ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26 జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1) 6 శాతం వృద్ధితో రూ.12,760 కోట్ల నికర లాభాలు సాధించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.12,040 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.62,613 కోట్ల ఆదాయాన్ని ప్రకటించగా.. గడిచిన క్యూ1లో 1.3 శాతం పెరుగుదలతో రూ.63,437 కోట్ల ఆదాయాన్ని సాధించింది. అంతర్జాతీయ స్థూల ఆర్థిక పరిస్థితులు, అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ పరిస్థితుల్లో అనిశ్చితుల కారణంగా డిమాండ్ తగ్గిందని కంపెనీ సిఇఒ కె కృతి వాసన్ తెలిపారు. ఫలితాల సందర్భంగా మధ్యంతర డివిడెండ్ కింద ప్రతీ షేర్‌పై రూ.11 చొప్పున చెల్లించడానికి ఆ కంపెనీ బోర్డు ఆఫ్ డైరెక్టర్లు ఆమోదం తెలిపారు. దీనికి జులై 16వ తేదీని రికార్డు డేట్‌గా నిర్ణయించింది. ఆగస్టు 4న చెల్లింపులు చేయనున్నట్లు తెలిపింది. గతేడాది ఇదే త్రైమాసికంతో పోలిస్తే ఈ ఏడాదిలో నికర నియామకాలు 5,090 పెరిగినట్లు టిసిఎస్ వెల్లడించింది. దీంతో మొత్తం ఉద్యోగుల సంఖ్య 6,13,069కు చేరింది. ఈ ఏడాది ఉద్యోగులకు వేతనం పెంపు అంశంలో ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని టిసిఎస్ చీఫ్ హెచ్ఆర్ ఆఫీసర్ మిలింద్ లక్కడ్ తెలిపారు. భౌగోళికంగా సూక్ష్మ పరిస్థితులు మెరుగుపడితే సాధారణంగానే తాము మంచి పెంపుదల ఇస్తామన్నారు.

సంపాదకీయం

# పరిశోధనపై ప్రయి'వేటు'

**శా**స్త్ర సాంకేతిక, పరిశోధనా రంగాలకు తగిన ప్రాధాన్యం ఇచ్చే దేశాలే ఆధునిక కాలంలో అగ్రపథాన రాణిస్తాయి. కాలానికి అనుగుణమైన పరిశోధనలు, ఆవిష్కరణలు నిత్య కృత్యంగా సాగినప్పుడే దేశం అభివృద్ధి పుంతలు తొక్కుతుంది. 144 కోట్ల సంఖ్యను అవలీలగా దాటేసి, జనాభాలో మొదటి స్థానానికెగసిన మన దేశం - శాస్త్ర సాంకేతిక ఆవిష్కరణల్లో ఎక్కడ ఉందంటే- సమాధానం ఖచ్చితంగా నిరుత్సాహపరిచేదిగా ఉంటుంది. శాస్త్రీయంగా ఆలోచించటానికి, కొత్త విషయాలను కనుక్కోవటానికి మన పాలకులు ఇచ్చే అవకాశం అత్యంత నాసిగా ఉండటం వల్ల- ప్రపంచ పేటెంట్లలో మన వాటా కేవలం 2 శాతం. నూతన ఆవిష్కరణల వైపు దూసుకుపోతూ చైనా 25 శాతం పేటెంట్లను కైవశం చేసుకుంటుండగా, 20 శాతం వాటాతో అమెరికా రెండో స్థానంలో ఉంది. అత్యుత్తమ శాస్త్ర పరిశోధనా పత్రాల సమర్పణలో కూడా ప్రపంచపటం మీద మన ప్రతిభ ఒక శాతానికి మించటం లేదు. అత్యంత పరిశీలనాశక్తి, పరిశోధక దృష్టి ఉన్న విద్యార్థులకు పాఠశాల స్థాయి నుంచీ తగిన సహాయ సహకారాలు కొరవడటం ఈ వెనుకబాటుతనానికి కారణం. దీనికితోడు బిజెపి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి శాస్త్రీయ దృక్పథానికి చెదలు పట్టించే పుక్కిట పురాణాల వల్లెవేత పెరిగింది. వాస్తవాలకు, విశ్వాసాలకు మధ్య ఉన్న రేఖను చెరిపేసే చాదస్తపు పాఠాలు పుస్తకాల్లోకి ప్రవేశించాయి. శాస్త్రవేత్తల సదస్సులో ఏకంగా ప్రధాని నరేంద్ర మోడీయే పురాణ కథలకు సైన్సును ఆపాదించే దుస్సాహసం చేశారు. ఇలాంటి కలగాపులగపు కహానీలతో వైజ్ఞానిక వికాసం జరగదు.

ఇటీవల కేంద్ర ప్రభుత్వం రూ.లక్ష కోట్ల ప్రతిపాదనతో రీసెర్చి డెవలప్‌మెంటు అండ్ ఇన్నోవేషన్ (ఆర్‌డిఐ) పేరిట ఒక పథకాన్ని ప్రకటించింది. లక్ష కోట్ల నిధి అన్న మాట ఘనంగా ఉన్నప్పటికీ- దీనిని ప్రయివేటు భాగస్వామ్యంతో ముడిపెట్టటంతోనే అసలు ఉద్దేశం బయటపడుతుంది. ఈ పథకాన్ని కేంద్ర మంత్రిత్వ శాఖ తరఫున అనుసంధాన్ నేషనల్ రీసెర్చి ఫౌండేషన్ (ఎఎన్ఆర్ఎఫ్) పర్యవేక్షిస్తుంది. ప్రయివేటు సంస్థల నుంచి నిధులను, పరిశోధనలను ఈ సంస్థ సమన్వయం చేస్తుంది. తక్కువ వడ్డీ రేట్లకు నిధులను సమకూర్చి, టెక్నాలజీ రెడీనెస్ లెవెల్ 4కి చేరిన ప్రాజెక్టులకు మంజూరు చేస్తుంది. 'వంటపాత్రలూ కూరగాయలూ, నూనె, గ్యాసూ మీరు సమకూర్చుకొండి. తాలింపు వేయటానికి నేను తోడ్పడతాను.' అన్నట్టుంది ఈ పథకం. ప్రభుత్వ విశ్వవిద్యాలయాలకు, పరిశోధనా సంస్థలకు తొలినుంచీ తగిన నిధులూ, సన్నద్ధ ఏర్పాట్లూ సమకూర్చకుండా - 4వ స్థాయి పరిశోధనలు ఎలా పుట్టుకొస్తాయి? కేవలం 0.64 శాతం నిర్వహణా నిధులతో కునారిల్లుతున్న ప్రభుత్వ పరిశోధనారంగం ఎలా తెప్పరిల్లుతుంది?

సాంకేతిక ప్రమాణాల ప్రకారం... పరిశోధనల స్థాయిలను తొమ్మిది అంచెలుగా లెక్కిస్తారు. ప్రారంభంలోని 1, 2 స్థాయిల్లో పరిశోధనకు ఒక భూమిక ఏర్పర్చుకోవటం, దాని ప్రామాణికతను నిర్దిష్టపర్చుకోవటం, అందుకు అవసరమైన ప్రయోగాలు చేయడం ఎంతో వ్యయ ప్రయాసలతో కూడిన పని. ప్రభుత్వ చేయూత అవసరమైన సమయం అది. కానీ, పునాది సమయంలో చేయూతనివ్వకుండా నిర్మాణానికి ప్రారంభోత్సవం చేస్తామనటం ఎలా సబబు? దరిమిలా కార్పొరేటు స్థాయి ప్రయివేటు సంస్థలకు మాత్రమే ఈ పథకం ఉపయోగపడుతుంది. ప్రయివేటు సంస్థల పరిశోధనలు అయినప్పుడు అవి సహజంగా లాభాల మీదనే గురి పెట్టి సాగుతాయి. సామాన్య ప్రజల విద్య, వైద్యం, వ్యవసాయం తదితర రంగాల్లోని అవసరాలకు దోహదపడే ఆవిష్కరణలు జరగాలంటే- ప్రభుత్వరంగంలో పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వాలి.

దక్షిణ కొరియా, అమెరికా, జపాన్, చైనా వంటి దేశాలన్నీ పరిశోధనలకు జిడిపిలో 3 - 6 శాతం నిధులు వెచ్చించి, మంచి ఫలితాలను సాధిస్తున్నాయి. మనదేశం ఈ రంగానికి వెచ్చిస్తున్న మొత్తం ఒక శాతం కన్నా తక్కువ. ఐదేళ్ల క్రితం సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్నోవేషన్ పాలసీలో పేర్కొన్న విధంగా కనీసం 2 శాతానికైనా నిధుల కేటాయింపు పెంచాలి. పాఠశాల దశ నుంచి పిల్లల్లో శాస్త్రీయ దృష్టిని పెంచటం ద్వారా పరిశీలనలకు, ప్రశ్నలకు, పరిశోధనలకు ప్రోత్సాహం ఇవ్వాలి. వీధి బడుల నుంచి విశ్వ విద్యాలయాల వరకూ విజ్ఞాన శాస్త్రానికి ప్రయోగాల పట్టం కట్టినప్పుడే దేశం వైజ్ఞానిక రంగంలో పురోగమిస్తుంది.

మహనీయుల మాట



**ధనిక పెట్టుబడిదారులతో ఆస్తిపాస్తులు లేని కార్మికులు వ్యక్తిగతంగా తలపడితే కార్మికులు బానిసలుగా మారిపోతారు. కాని ఆ కార్మికులే ఐక్యమైతే పరిస్థితి మారిపోతుంది.**

**- వి.ఐ. లెనిన్**

# డిగ్రీ విద్యలో సంస్కరణలు - సమస్యలు

వ్యాసం



**డి. రాము**

**క**రోనా అనంతరం పాఠశాల విద్య, ఇంటర్మీడియట్ విద్య సవ్యంగా నడుస్తున్నప్పటికి డిగ్రీ విద్యా వ్యవస్థ ఇంకా గాడిలో పడలేదు. నూతన విద్యా విధానం పేరుతో డిగ్రీలో తీసుకొస్తున్న అనేక సంస్కరణలే దీనికి ప్రధాన కారణం. ఈ సంస్కరణల మూలంగా ఉన్నత విద్య చదువుకోవాలనుకునే విద్యార్థులు గందరగోళానికి గురవుతూ డిగ్రీ విద్యకు దూరమవుతున్నారు.

**అడ్మిషన్లలో అలసత్వం**

ఇంటర్మీడియట్ విద్యార్థులు పరీక్షలు పూర్తిచేసుకొని మూడు మాసాలు గడిచిపోయింది. నేటికీ డిగ్రీ అడ్మిషన్లు పూర్తికాలేదు. సింగిల్ మేజర్ అండ్ డ్యూయల్ మేజర్ విధానాల్లో దేన్ని అమలు చేయాలో ప్రభుత్వానికి స్పష్టత లేదు. ఈ కారణంగా అడ్మిషన్లలో ఆలస్యం జరిగింది. వస్తున్న వార్తలను, జరుగుతున్న పరిణామాలను పరిశీలిస్తే దీనికి మరో కారణం లేకపోలేదు. చాలామంది విద్యార్థులు డిగ్రీలో జాయిన్ అయిన తర్వాత ఇంజనీరింగ్ కళాశాలలో సీటు వచ్చినప్పుడు డిగ్రీని అర్ధాంతరంగా నిలిపివేసి ఇంజనీరింగ్‌లో చేరుతున్నారు. దీని మూలంగా కళాశాల యాజమాన్యాలు డిగ్రీలో కొన్ని సీట్లను కోల్పోతున్నాయి. అందుకే ఇంజనీరింగ్ మొదటి విడత పూర్తయిన తర్వాత డిగ్రీ సీట్లు భర్తీ చేయాలని ఉన్నత విద్యా మండలి నిర్ణయించింది. డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభించక ముందే ఇంజనీరింగ్ అడ్మిషన్లకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడమే దీనికి నిదర్శనం. డిగ్రీ కోర్సుల్లో ప్రతి సంవత్సరం రెండు లక్షల మంది వరకు చేరుతున్నారు. గత సంవత్సరం 1.30 లక్షల మంది జాయిన్ అయ్యారు. ఉన్నత విద్యా మండలి చెబుతున్నట్లు డిగ్రీ నుంచి ఇంజనీరింగ్ ప్రవేశం పొందే విద్యార్థుల సంఖ్య కేవలం 10,000 లోపే ఉంటుంది. డిగ్రీలో చేరి ఇంజనీరింగ్ వైపు వెళ్తున్నారనే ఆలోచనతో సుమారు రెండు లక్షల మంది విద్యార్థులకు మూడు నెలలపాటు ఖాళీగా ఉంచడం సరైన నిర్ణయం అనిపించుకోదు. ఇలా అడ్మిషన్లు ఆలస్యంగా ప్రారంభించడం వలన విద్యా సంవత్సరం వేగంగా ముగించాల్సి వచ్చినప్పుడు...ఆ విద్యా సంవత్సరం కుదించబడుతుంది. సెమిస్టర్‌కు సెమిస్టర్‌కు మధ్య సమయం తగ్గి విద్యార్థులు పరీక్షలకు సిద్ధం కాలేకపోతున్నారు. దీంతో ఎక్కువ మానసిక ఒత్తిడికి లోనవుతూ పరీక్షల్లో ఫెయిల్ అవుతున్నారు.

**ఆన్‌లైన్ అడ్మిషన్ విధానం**

ఆఫ్‌లైన్ ద్వారా అడ్మిషన్లు జరిగినప్పుడు విద్యార్థులు తమకు నచ్చిన కళాశాలలో జాయిన్ అయ్యేవాళ్లు. కానీ గత ప్రభుత్వం డిగ్రీ అడ్మిషన్లు ఆన్‌లైన్ ద్వారా భర్తీ చేయాలని నిర్ణయించింది. అన్ని కాలేజీలను నాలుగు గ్రేడ్లుగా విభజించింది. కళాశాల మౌలిక పరిస్థితుల ఆధారంగా గ్రేడ్లను ప్రకటించింది. వచ్చిన గ్రేడ్ ప్రకారం కళాశాలకు సీట్లు, ఫీజులు ఖరారు చేసింది. దీనితో అప్పటి వరకు తక్కువ ఫీజులు వసూలు చేసే అనేక కళాశాలలు ఫీజులు పెంచుకున్నాయి. కానీ అప్పటి వరకు ఎక్కువ ఫీజులు వసూలు చేసే కళాశాలలు మాత్రం ఫీజులు తగ్గించలేదు. ఫలితంగా ఈ నిర్ణయం కళాశాల యాజమాన్యాలకు తప్పితే విద్యార్థులకు ఏ రకంగానూ ఉపయోగపడలేదు. ఇకపోతే ఈ ఆన్‌లైన్ అడ్మిషన్ల విధానం విద్యార్థులకు మరిన్ని చిక్కులు తెచ్చిపెడుతుంది. ఈ ఆన్‌లైన్ అడ్మిషన్లు ప్రారంభ సంవత్సరంలో అనేక టెక్నికల్ సమస్యలు వచ్చి కొంతమంది సీట్లు పొందలేక సంవత్సర కాలాన్ని వృథా చేసుకున్నారు. మూడు విడతల్లో అడ్మిషన్లు జరగడం మూలాన మొదటి విడతలో జాయిన్ అయ్యేవాళ్ళకు చివరి విడతలో జాయిన్ అయ్యేవాళ్ళకి మధ్య కొన్ని నెలల గ్యాప్ ఏర్పడుతుంది. మొదటి విడతలో చేరిన విద్యార్థులకు వెంటనే క్లాసులు ప్రారంభం అవుతున్నాయి. చివరి దశలో జాయిన్ అయిన విద్యార్థులకు ఆ క్లాసులు నడవక, చేరిన కొంత కాలానికే పరీక్షలు రావడంతో వాటికి సిద్ధం కాలేకపోతున్నారు. చాలామంది ఇప్పటికే ప్రైవేట్ కళాశాలల్లో దరఖాస్తులు పెట్టుకొని తీరా అక్కడ సీటు రాకపోవడంతో ముందుగా కట్టిన అడ్మిషన్ ఫీజులు నష్టపోతున్నారు. కళాశాల యాజమాన్యాలు అడ్మిషన్లు చేపట్టినప్పుడు కేవలం తమ కాలేజీలకు మాత్రమే వెబ్ ఆప్షన్ ఇస్తున్నాయి. మిగిలిన కళాశాలల ఆప్షన్ పెట్టడంలేదు. దీంతో ఆ కాలేజీలలో సీటు రాక, ఇతర అనుకున్న చోట సీట్లు నిండిపోయి మేనేజ్‌మెంట్ కోటాలో అనివార్యంగా జాయిన్ అవ్వాల్సి వస్తున్నది. అలా జాయిన్ అయిన వారు ప్రభుత్వం నుండి రావాల్సిన స్కాలర్‌షిప్ పొందలేక, వేలాది రూపాయల ఫీజులు కట్టలేక మధ్యలోనే చదువు ఆపేస్తున్నారు. కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వం కూడా అదే బాట పడుతున్నది. ఆన్‌లైన్‌లో అడ్మిషన్లు జరపాలంటూనే యాజమాన్యాలను సంతృప్తి పరచడం కోసం ఆఫ్‌లైన్ ద్వారా కూడా అడ్మిషన్లు జరుపుకోవచ్చు అంటుంది. ఆఫ్‌లైన్ ఉన్నప్పుడు మళ్లీ ఆన్‌లైన్ ఎందుకు? అయితే ఆన్‌లైన్ ద్వారా జరగాలి. లేదంటే ఆఫ్‌లైన్ ద్వారా జరగాలి. అలా కాదని రెండు విధాలుగా జరిగితే ఆఫ్‌లైన్‌లో భర్తీ చేసుకున్న వారు ఆన్‌లైన్‌లో కూడా ఆప్షన్లు పెట్టడం వలన సీట్ల సర్దుబాటులో గందరగోళం ఏర్పడుతుంది.

**మేజర్, మైనర్ సబ్జెక్ట్ విధానం**

గతంలో ఒక గ్రూపులో మూడు గ్రూప్ సబ్జెక్టులు, రెండు లాంగ్వేజ్‌లు, రెండు ఫండమెంటల్ కోర్సులు ఉండేవి. దీని ద్వారా అన్ని గ్రూపులపైన విద్యార్థి మంచి పట్టు సంపాదించేవాడు. కానీ ఒక అంశంపై పూర్తి స్థాయిలో పట్టు సంపాదించాలనే వంకతో మేజర్, మైనర్ సబ్జెక్టులను తీసుకు వచ్చింది. ఈ మేజర్, మైనర్ సబ్జెక్ట్ విధానం కంపెనీలకు చీప్, స్కిల్డ్ లేబర్‌ని అందిస్తుంది తప్పితే విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించడం లేదు. ఇప్పటికే నారాయణ, శ్రీచైతన్య వంటి కార్పొరేట్ విద్యాసంస్థల్లో పాఠశాల స్థాయి నుండే కేవలం గ్రూప్ సబ్జెక్టులకు మాత్రమే ప్రాధాన్యతనిస్తూ మిగిలిన సాంఘిక శాస్త్రం, లాంగ్వేజ్ సబ్జెక్టులను పక్కన పెట్టేస్తున్నారు. చివరి రెండు నెలల్లో పరీక్షలు దగ్గర పడుతున్నాయి అన్నప్పుడు అన్నింటిని ఒకేసారి వారిపై రుద్దేస్తున్నారు. ఇంటర్మీడియట్‌లో కూడా అదే జరుగుతున్నది. ఇప్పుడు డిగ్రీకి కూడా దాన్ని ఆపాదించాలని చూస్తున్నారు. ఈ మేజర్-మైనర్ విధానం వలన కొన్ని గ్రూపులకు మాత్రమే డిమాండ్ పెరిగి మిగిలిన గ్రూపులకు ఎటువంటి ప్రాధాన్యతా లేకుండా పోతుంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఫార్మా లేకుంటే సాఫ్ట్‌వేర్ కంపెనీల్లోనే ఉపాధి దొరుకుతుంది. అందువల్ల ఎక్కువమంది విద్యార్థులు అయితే కెమిస్ట్రీ లేకుంటే కంప్యూటర్ సైన్స్‌ని మేజర్, మైనర్ సబ్జెక్టులుగా ఎంచుకుంటున్నారు. దీనివల్ల మిగిలిన గ్రూపుల్లో చేరేవారు లేక...పి.జి కి వచ్చేసరికి చదివేవారి సంఖ్య రోజురోజుకి తగ్గిపోతున్నది. ఈ కారణంగా యూనివర్సిటీల్లో సదరు కోర్సులు ఎత్తివేసే పరిస్థితులు దాపురిస్తున్నాయి. మైనర్ సబ్జెక్టులకు తక్కువ క్రెడిట్ పాయింట్లు ఉండటం వలన ఆ సబ్జెక్టులతో పి.జి చదవడానికి వీలు లేకుండా పోతున్నది.

**నాలుగు సంవత్సరాల డిగ్రీ విధానం**

ఆనర్స్ డిగ్రీ పేరుతో మూడు సంవత్సరాల డిగ్రీని కాస్తా నాలుగు సంవత్సరాలకు పెంచారు. ఒక సంవత్సరం పూర్తి చేస్తే సర్టిఫికెట్, రెండు సంవత్సరాలు పూర్తి చేసిన వారికి డిప్లమో, మూడు సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారికి డిగ్రీ, నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారికి ఆనర్స్ డిగ్రీ ఇవ్వడం జరుగుతుంది. ఇలా ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం చదువుని ఆపివేసే వెసులుబాటును విద్యార్థులకు అందించడం వలన డ్రాపౌట్లు పెరుగుతారు. అంతేకాకుండా అదనంగా ఒక సంవత్సరం పాటు విద్యార్థుల తల్లిదండ్రులపైన ఆర్థిక భారం పడి కేవలం డబ్బున్న వారికే ఉన్నత చదువులు చదివే అవకాశం కలుగుతుంది. పేద విద్యార్థులకు ఉన్నత చదువు అందని ద్రాక్షగా మిగిలిపోతుంది. విద్యార్థులు తర్వాత కాంపిటీటివ్ చదువులో ఒక సంవత్సరం సమయాన్ని కోల్పోతున్నారు. ఉద్యోగానికి చేరే వయో పరిమితిలో ఒక సంవత్సరం నష్టపోతున్నారు. వీటితోపాటు ఇంటర్న్‌షిప్ తీసుకువచ్చారు. అది కూడా ఆఫ్‌లైన్‌లో కాకుండా ఆన్‌లైన్‌లో అందిస్తున్నారు. దీనివలన విద్యార్థి ఎటువంటి నైపుణ్యాన్ని పొందలేకపోతున్నాడు. సరికదా 6 నెలల సమయాన్ని, అదనపు ఫీజుల భారాన్ని, అనవసరపు ఖర్చును భరిస్తున్నాడు. పెట్టుబడిదారుల కంపెనీల్లో తక్కువ జీతానికి పనిచేసే సైన్యం తయారీకి తోడ్పడే ఈ విధానాలను రద్దు చేయాలి. విద్యార్థులకు నాణ్యమైన, శాస్త్రీయమైన విద్యను అందించాలి.

ఆనర్స్ డిగ్రీ పేరుతో మూడు సంవత్సరాల డిగ్రీని కాస్తా నాలుగు సంవత్సరాలకు పెంచారు. ఒక సంవత్సరం పూర్తి చేస్తే సర్టిఫికెట్, రెండు సంవత్సరాలు పూర్తి చేసిన వారికి డిప్లమో, మూడు సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారికి డిగ్రీ, నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారికి ఆనర్స్ డిగ్రీ ఇవ్వడం జరుగుతుంది. ఇలా ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం చదువుని ఆపివేసే వెసులుబాటును విద్యార్థులకు అందించడం వలన డ్రాపౌట్లు పెరుగుతారు. అంతేకాకుండా అదనంగా ఒక సంవత్సరం పాటు విద్యార్థుల తల్లిదండ్రులపైన ఆర్థిక భారం పడి కేవలం డబ్బున్న వారికే ఉన్నత చదువులు చదివే అవకాశం కలుగుతుంది. పేద విద్యార్థులకు ఉన్నత చదువు అందని ద్రాక్షగా మిగిలిపోతుంది.

(వ్యాసకర్త ఎస్.ఎఫ్.ఐ విజయనగరం జిల్లా అధ్యక్షుడు,
సెల్ : 9705545164)

కవిత్వం

## ఏకరువు కాలం..!!

**గా**లి దుమారంలో నడుస్తూ
పేక గుడిసెల కింద
తల దాచుకుంటున్నాము
యాళకింత కడుపుకేద్దామంటే
ఎసరు మరగని బ్రతుకైంది
ఏకరువు కాలం వచ్చినాక
వెతుక్కోవడమే జీవనమైంది.

మధ్యతరగతి వీధుల్లో
మంచినీళ్ళకు కూడా కరువై
తడారిన నోటితోనే
చెప్పుకునే పరిస్థితి వచ్చింది
గతుకుల దారిలో పాదాలు
తూట్లుపడిపోతున్నా
నొప్పిని భరించే తాహతు
బొత్తిగా లేకపోయింది.

అన్నీ వున్నవారే లేరు కదా
లోలోపల మగ్గిపోతున్న
ఒట్టి పేగులు కూడా వున్నాయి
ఎవర్ని తప్పు పట్టట్లేదు
ఎవర్ని దూషించనూ లేదు
ఆకలి బాధ ఆవిరైపోతుంటే
నోరు తెరిచి అడగటమే పనైంది.

ప్రశ్నించే తత్వాన్ని చంపుకుని
అర్థించే ధ్యాసలో వున్నాం
తిరిగి తిరిగి అడిగే ఓపిక లేక
తిరగబడి నిలదీసే స్తోమత లేక
తరగబడిన జీవనాధారంతో
ఎగబడి కలబడలేక
ఏకరువు కాలంతో మమేకమై
వేడుకుంటున్నాం సారూ!

**- నరెద్దుల రాజారెడ్డి,**
**సెల్ : 9666016636**

# దలైలామా డ్రామా, బిజెపి విన్యాసాలు

కథనం

**- పీపీ**

**భా**రత దేశంలో తిష్ట వేసిన దలైలామా కుటిల రాజకీయాలు, ఆయనతో పాలక వర్గాల పాచికలు ఈ మధ్యలో మరోసారి పతాక శీర్షికలెక్కాయి. ఆయన 90వ జన్మదినం జరుపుకోగా ప్రధాని మోడీతో సహా శుభాకాంక్షలు గుప్పించారు. కొంతమంది అత్యుత్సాహవంతులు భారతరత్న ఇవ్వాలని సంతకాలు కూడా సేకరించారట. ఇంతకూ ఈ 90వ జన్మదినాన తన తదుపరి అవతారమేమిటో చెబుతానని ఆయన గారు గతంలో ప్రకటించారు. అయితే కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు అంతా దలైలామా ఇష్టమని ముందే ప్రకటించేశారు. దానిపై చైనా అభ్యంతరం చెప్పింది. లామా సంప్రదాయం ప్రకారం వారసులు నిర్ణయమవుతారు తప్ప దలైలామానే ప్రకటించడం అనుమతించబడదని చెప్పింది. అసలు చైనాలో 1400 రకాల బౌద్ధ విశ్వాసాలలో అన్ని రకాల పునర్జన్మలు లేదా అవతార ప్రకటనలు వుంటాయని కూడా స్పష్టం చేసింది. ఉలిక్కిపడిన మోడీ ప్రభుత్వం మెంటనే అధికారిక వివరణ జారీ చేసింది. ధర్మశాలలో సంబంధిత సంస్థలు తప్ప దలైలామా పునర్జన్మ లేదా తదుపరి అవతారం ఏమిటనే దానితో తమకేమీ సంబంధం లేదని. రిజిజు ప్రకటన ప్రభావాన్ని తటస్థీకరించే ప్రయత్నం చేసింది. కానీ ఇప్పుడు ఆ తంతు వాయిదా వేశారు.

చైనాలో అంతర్భాగమైన టిబెట్ నుంచి పారిపోయి వచ్చి ఇక్కడ ఆశ్రయం పొందిన దలైలామా కేంద్రం, అంతకు మించి అంతర్జాతీయ సామ్రాజ్యవాదం వెన్నుదన్నుతో చైనాకు వ్యతిరేకంగా పని చేస్తుంటారనేది ప్రపంచమంతా తెలిసిన రహస్యం. నోబెల్ బహుమానంతో సహా ఆయనకు అందించడంలో ఆంతర్యం అదే. దలైలామా వ్యవహారమంతా మతం పేరిట, రాజకీయ ఆశ్రయం చాటున సాగిపోతుంటుంది. హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాలలో టిబెట్ ప్రవాస ప్రభుత్వం కూడా నడుస్తుంటుంది. ఆయనకు ఆశ్రయం తప్ప ఇతర అంశాలతో మాకు సంబంధం లేదని కేంద్రం చెబుతుంటుంది. కానీ గతంలో వాజ్‌పేయి హయాంలో కర్మప లామా చైనా నుంచి పారిపోయి వస్తే ఆశ్రయం ఇచ్చి హడావుడి చేశారు. తర్వాత ఆయన హఠాత్తుగా ఉడాయించాడు. కొన్ని సంవత్సరాల కిందట నంద్యాలలో శాంభవి అనే అమ్మాయి దలైలామా అవతారమని ప్రహసనం నడిస్తే దాన్ని కూడా ఆయన ప్రోత్సహించాడు. అది కూడా అపహాస్యంగా ముగిసింది.

తాజాగా అరుణాచల్ ముఖ్యమంత్రి పెమా ఖండూ తాము టిబెట్‌తో సరిహద్దు కలిగివున్నామే గానీ చైనాతో కాదని వ్యాఖ్యానించారు. సావర్నిటీ గాక సుజెరైనిటీ అనే పదం వాడినా టిబెట్‌లో చైనా స్థానాన్ని భారతదేశం గుర్తించింది. అలాంటప్పుడు ఖండూ మాటలకు అర్థమేముంటుంది? అరుణాచల్‌ప్రదేశ్ పైనే ఇరు దేశాలకూ వివాదం అలాగే వుండగా ముఖ్యమంత్రి టిబెట్ పైనా మాట్లాడటం ఇంకా విపరీతం కాదా? సహజంగానే మీడియా దలైలామా అవతార చర్చకు అరుణాచల్ ముఖ్యమంత్రి వ్యాఖ్యలనూ కలిపి నివేదించింది. భారత, చైనాలు మొన్ననే బ్రిక్స్ సంయుక్త ప్రకటనలో పాలు పంచుకున్నాయి, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ రెచ్చిపోయి వ్యవహరిస్తున్న సమయంలో బ్రిక్స్ ప్రకటనే ఆశాకిరణంగా వుందని ప్రపంచ దేశాలు ప్రశంసించాయి. ఒకవైపున ఇలాంటి పరిణామాలు నడుస్తుంటే మరోవైపున దలైలామా, పెమా ఖండూల ప్రకటనలూ ప్రవర్తనా ఎలా చూడాలి? ఎటు పోతాయి?

గతంలో చంద్రబాబు ప్రభుత్వ హయాంలో అమరావతి బౌద్ధ క్షేత్రంలో కాలచక్ర పేరిట దలైలామా నడిపిన తతంగానికి చాలా ప్రచారార్భాటమే నడిచింది. ఇప్పుడు ప్రస్తుత రాజధాని అమరావతికి చిహ్నంగా కనిపించే బుద్ధ విగ్రహం అప్పటిదే, నిజానికి ఇది అమరావతిలోని అసలైన నాటి విగ్రహం కాదు. అసలు ఈ అవతారాల గుట్టు తెలియాలంటే బౌద్ధం లోతుల్లోకి వెళ్లాలి. బుద్ధుడు జీవిత కాలంలో ఎప్పుడూ పునర్జన్మల వంటివి చెప్పలేదు. ఇవన్నీ ఆయన మరణానంతర మహాయాన పండితులు పుట్టించారు. తుషిత బుద్ధులు లేదా బుద్ధపరంపర తీసుకొచ్చారు. బోధిసత్వుడు అన్నారు. దలైలామా చాటున సాగే రాజకీయం మాత్రం అంతా ఇంతా కాదు. తాజాగా అరుణాచల్ ముఖ్యమంత్రి పెమా ఖండూ తాము టిబెట్‌తో సరిహద్దు కలిగివున్నామే గానీ చైనాతో కాదని వ్యాఖ్యానించారు. సావర్నిటీ గాక సుజెరైనిటీ అనే పదం వాడినా టిబెట్‌లో చైనా స్థానాన్ని భారతదేశం గుర్తించింది. అలాంటప్పుడు ఖండూ మాటలకు అర్థమేముంటుంది? అరుణాచల్‌ప్రదేశ్ పైనే ఇరు దేశాలకూ వివాదం అలాగే వుండగా ముఖ్యమంత్రి టిబెట్ పైనా మాట్లాడటం ఇంకా విపరీతం కాదా? సహజంగానే మీడియా దలైలామా అవతార చర్చకు అరుణాచల్ ముఖ్యమంత్రి వ్యాఖ్యలనూ కలిపి నివేదించింది. భారత, చైనాలు మొన్ననే బ్రిక్స్ సంయుక్త ప్రకటనలో పాలు పంచుకున్నాయి, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ రెచ్చిపోయి వ్యవహరిస్తున్న సమయంలో బ్రిక్స్ ప్రకటనే ఆశాకిరణంగా వుందని ప్రపంచ దేశాలు ప్రశంసించాయి. ఒకవైపున ఇలాంటి పరిణామాలు నడుస్తుంటే మరోవైపున దలైలామా, పెమా ఖండూల ప్రకటనలూ ప్రవర్తనా ఎలా చూడాలి? ఎటు పోతాయి?

**ఎన్ని మాఫియాలో! ఇ.వై నివేదిక చెప్పిందేంటి?**

ఇన్‌ఫ్రా పేరిట సాగుతున్న భారీ దందాపై ఎర్నెస్ట్ అండ్ యంగ్ (ఇ.వై) అనే అంతర్జాతీయ నిపుణుల బృందం ఒక నివేదిక ప్రకటించింది. ప్రపంచవ్యాపితంగా రహస్య ఆర్థిక వ్యవస్థ (షాడో ఎకానమీ) లోతుపాతులేంటో విశదపర్చింది. భారతీయ మాఫియాల ప్రత్యేకతలనూ విశ్లేషించింది. ఇసుక, రియల్ ఎస్టేట్, రోడ్లు, గనులు, రైల్వేలు నిర్మాణాలు, కొండలు, డ్రగ్స్, వ్యభిచార గృహాలు, బెట్టింగ్ యాప్‌లు, నేరస్త శక్తులు ప్రతి చోటా మాఫియా పరుచుకుందని తేల్చింది. అధికార యంత్రాంగం అధినేతల అండదండలతో, భాగస్వామ్యంతో మాత్రమే ఇవి నడవడం సాధ్యమని చెప్పింది. ఈ విధమైన ఆర్థిక వ్యవస్థ 2023 జిడిపిలో 26 శాతం వుండొచ్చని అంచనా వేసింది. అంటే ఏటా లక్ష కోట్ల డాలర్లు లెక్కలోకి రావడం లేదన్నది. జర్మనీలో ఏడు శాతం షాడో ఎకానమీ వుంటే ఇండియాలో 23 శాతం అంటే ఎంత ఎక్కువో లెక్కేసుకోవచ్చు. ఇది ఎక్కడా నమోదు కాదు. దాని దుష్ఫలితాలు నేరుగా తెలియవు. వీరి దెబ్బకు నిజాయితీపరులు ఎందరో ప్రాణాలు కోల్పోయారని ఉదాహరణలతో సహా ఇచ్చింది. జాతీయ రహదారులపై అనధికార టోల్ గేట్ల నుంచి హైవేలు వేయకుండానే నిధులు కాజేయడం వరకూ ఈ తరహాలోకి వచ్చేవే.

**బాహుబలి పంజా**

రాజమౌళి 'బాహుబలి ద బిగినింగ్' పేరట సినిమా వదిలి ఇప్పటికి పదేళ్లయిందని మీడియా, పరిశ్రమ కూడా గుర్తు చేసుకుంటున్నాయి. శివగామి, కట్టప్ప వంటి నిరంకుశులు, విద్రోహ పాత్రలు, అంధ విధేయతలూ ప్రవేశ పెట్టడమే కాదు. తెలుగు సినిమాను ఆ మాటకొస్తే భారతీయ సినిమానే పాన్ ఇండియాగా మార్చడం వెండితెర రూపమే మార్చేసింది. ఏదో విధంగా వందల కోట్లు గుమ్మరించి, లేనిపోని కథలు అల్లి హైప్‌లు ఇచ్చి టెక్నికల్ హంగులతో భారీ జూదంగా మారింది. పురాణాలు, చరిత్ర అలా వుంచి అల్లూరి సీతారామరాజు, కొమరం భీం వంటి ఇటీవలి చరిత్ర వీరులను కూడా ఇష్టానుసారం కథలల్లే వరవడి తీసుకొచ్చింది. ఈ కోవలో కల్కి నుంచి వీరమల్లుల వరకూ పుట్టుకొస్తున్నారు. కానీ వందల కోట్ల ఖర్చులు పెరిగినందతా విజయాలు పెరిగిందేమీ లేదు. ఇంకా ఇంకా భారాల్లో కూరుకుపోవడమే జరుగుతున్నది. అభద్రత పెరిగిపోయింది. ప్రత్యామ్నాయ ప్రయత్నాలకు, ప్రగతిశీల ప్రయోగాలకు అవకాశం బాగా తగ్గింది. ఓటిటి వంటవి వున్నాయని సరిపెట్టుకున్నా ఇవన్నీ పిల్ల కాలువల వంటివే తప్ప ప్రధానంగా లేవు. కార్పొరేట్ వ్యాపారం కాషాయ కూటమి సందేశం మేళవింపుగా ఈ చిత్రాలు రావడం యువత ఆలోచనలపైనా అభిరుచుల పైనా కూడా తీవ్ర ప్రభావం చూపుతున్నది. ఇప్పుడు అనివార్యంగా ఏదో ఒక చరిత్ర లేదా పురాణంతో కృత్రిమంగానైనా సంధానం చేయకపోతే కుదరని పరిస్థితి. స్టార్‌డమ్‌తో పాటే వారి పారితోషికాలు కూడా ఆకాశం తాకే విపరీతం. శివగామి, కట్టప్ప పాత్రలు మంచివా చెడ్డవా? ఆ పాత్రలతో వేసిన ముద్ర నిగూఢ సందేశమేమిటి? వాటితో అల్లిన కృత్రిమ కథలు ఎటు పోతాయి? ఎన్టీఆర్ వంటి వారు లోగడ పౌరాణిక, సాంఘిక, చారిత్రిక చిత్రాలు ఎన్నో చేసి మనోరంజనం చేశారు. కానీ ఇప్పుడు ధనరంజనం ప్రధానమై రాజకీయ వాతావరణం కలసిపోయి గందరగోళ దృశ్యం చూసి సాహోరే బాహుబలి అందామా? సంమాంతర చిత్రాల కోసం ప్రయత్నం చేద్దామా?

జనవాక్యం

## సందర్శకులను ఇబ్బంది పెట్టొద్దు

**క**ట్టుదిట్టం పేరుతో సచివాలయానికి వచ్చే జనాన్ని ఇబ్బంది పెట్టడం మానుకోవాలి. మెట్రో రైల్ స్టేషను మాదిరి, రాష్ట్ర సచివాలయం గేటు దగ్గర ఏర్పాటు చేస్తామని రంగం సిద్ధం చేస్తున్నారు. తక్షణమే ఇలాంటి ప్రయోగం మానుకోవాలి. అన్నీ బాగా తెలిసినవారే మెట్రో స్టేషన్‌లో ఇబ్బంది పడుతున్నారు. టికెట్ పోయిందంటే గేటు తెరుచుకోదు. మరలా బయటికి రావాలంటే చాలా శ్రమ పడాలి. రైల్వేవారు అలా చేశారంటే టికెట్ లేకుండా ప్రయాణం చేసేవారిని నియంత్రించటం కోసం అనుకోవచ్చు. ఇక్కడ అది కాదు గదా! వందల కిలోమీటర్ల ప్రయాణం చేసి, తమ పనుల కోసం నాయకులనుగాని, అధికారులను గాని కలుద్దామనుకుంటే ఇక్కడ ఇలా పరీక్షలా!! దుర్మార్గం. టికెట్ చూపించి, ఆలీబాబా నలభై దొంగలు సినిమాలో గేటు దగ్గర అదేదో మంత్రం చదివినట్లు, జనాలకు ఇవన్నీ ఏం తెలుసు ? ఇపుడున్న పరిస్థితి బాగానే వుంది. ఎందుకు జనాలను ఇబ్బంది పెట్టడం? ఇలాంటి అత్యుత్సాహపు పనులను ప్రభుత్వం మానుకోవాలి.

**- నార్నె వెంకట సుబ్బయ్య**

**మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :**
**editpageps@gmail.com**

## ఆర్‌డిఎస్‌ఎస్‌లో భాగంగానే స్మార్ట్‌మీటర్లు

**సిపిడిసిఎల్ సిఎండి పుల్లారెడ్డి**

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్రప్రభుత్వం పథకం ఆర్‌డిఎస్‌ఎస్‌లో భాగంగానే స్మార్ట్‌మీటర్ల అమరుస్తున్నా మని ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటేడ్ (ఎపిసిపిడిసిఎల్) సిఎండి పుల్లారెడ్డి తెలిపారు. ఈ మీటర్ల వల్ల వినియోగదారులు తమ విద్యుత్ వినియోగాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చునని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్‌ను కొలవడానికే స్మార్ట్ మీటర్లు ఉద్దేశించినట్లు చెప్పుకొచ్చారు.

# సిపిఎం నాయకుడిపై టిడిపి నేతల దాడి

### తనపైనే దాడి చేశారని ప్రధాన నిందితుడి నాటకం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి/సత్తెనపల్లి రూరల్

దాడికి నిరసనగా క్రోసూరులో ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులు

పల్నాడు జిల్లా క్రోసూరు మండలం దొడ్లేరు గ్రామంలో బుధవారం సిపిఎం మండల కార్యదర్శి తిమ్మిశెట్టి హనుమంత రావుపై టిడిపి మండల అధ్యక్షులుగా చెప్పుకుంటున్న మొగిలి జాన్, అతని సోదరుడు సమీర్ దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనపై హనుమంతరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. హనుమంతరావు తమపై దాడి చేసినట్టు తప్పుడు కేసు పెట్టేందుకు టిడిపి నాయకులు ప్రయత్నిస్తున్నారు. ఘటన పూర్వపరాలు ఇలా ఉన్నాయి. గత ప్రభుత్వ హయంలో దొడ్లేరు గ్రామీణ బ్యాంకులో దాదాపు 450 మంది ఖాతాదారుల బంగారం మాయం అయింది. బంగారం తాకట్టు పెట్టిన రైతుల తరుపున సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళనలు జరుగుతున్నాయి. ఈ ఆందోళనల నేపథ్యంలో దాదాపు 300 మందికి తిరిగి బంగారం అప్పగించారు. మిగతా 150 మందికి కూడా బంగారం ఇవ్వాలని సిపిఎం, రైతు సంఘాల తరుపున ఆందోళనలు జరుగుతున్నాయి. బుధవారం పలువురు రైతులు బ్యాంకు వద్ద ఆందోళనకు దిగారు. సిపిఎం తరుపున మండల కార్యదర్శి తిమ్మిశెట్టి హనుమంతరావు రైతులకు మద్దతుగా ఆందోళనలో పాల్గొన్నారు. ఈ వ్యవహారంపై విచారణ జరుగుతుందని బుధవారం సాయంత్రం డిఎస్‌పి వస్తారని త్వరలో న్యాయం చేస్తామని పోలీసు అధికారులు హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. దీంతో హనుమంతరావు తన స్వగ్రామం ఎర్రబాలెం వెళ్తుండగా దొడ్లేరులో టిడిపి కార్యాలయం వద్ద ఉన్న జాన్, అతని సోదరుడు సమీర్ అసభ్య పదజాలంతో దూషిస్తూ దాడికి పాల్పడ్డారు. తాము ఎక్కడా టిడిపిని విమర్శించలేదని తనను ఎందుకు తిడుతున్నారు...తనను ఎందుకు కొడుతున్నారని, ఈ విషయాన్ని పెదకూరపాడు ఎమ్మెల్యేకు చెబుతానని హనుమంతరావు చెప్పగా ఎమ్మెల్యేను తిట్టావంటూ సమీర్ మళ్లీ దాడి చేశాడు. ఈ ఘటనపై ఫిర్యాదు ఇవ్వగా పై అధికారులతో మాట్లాడి కేసు నమోదు చేస్తానని ఎస్ఐ కేసు నమోదు చేయకుండా పెండింగ్‌లో ఉంచారు. ఈ నేపథ్యంలో దాడికి పాల్పడిన జాన్ కొత్త నాటకానికి తెరదీశారు. బ్లేడ్‌తో కోసుకుని, చొక్కా చించుకని తనపై దాడి జరిగిందని పోలీసులకు సమాచారం ఇచ్చి పోలీసు కానిస్టేబుల్‌ను తీసుకుని ఆస్పత్రికి వెళ్లాడు. టిడిపి నేతల దాడిని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్, పార్టీ నాయకులు గద్దె చలమయ్య, ఏపూరి గోపాలరావు ఖండించారు.

**దాడికి పాల్పడిన వారిని శిక్షించాలి : ఎపి కౌలు రైతు సంఘం**

హనుమంతరావుపై దాడి చేసిన మొగల్ జాన్, అతని సోదరుడిని కఠినంగా శిక్షించాలని ఎపి కౌలు రైతుల సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వై.రాధాకృష్ణ, ఎం.హరిబాబులు గురువారం ప్రకటన విడుదల చేశారు. ఈ విషయంపై స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పోలీసులు నిర్లక్ష్య వైఖరిని కౌలు రైతుల సంఘం తీవ్రంగా ఖండిస్తుందన్నారు.

# కాంట్రాక్టు పద్ధతిలో 77 మంది వైద్యుల భర్తీ

### 17న ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైద్య విద్య డైరెక్టర్ పరిధిలో 77 మంది వైద్యుల పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేసేందుకు వైద్య,ఆరోగ్య శాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. 40 మంది ప్రొఫెసర్, 37 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయనుంది. ఈ నెల 17న ఇందుకు సంబంధించిన ఇంటర్వ్యూలు జరుగుతాయని ఎపి మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు గురువారం ఒక ప్రకటన ద్వారా వెల్లడించింది. నేషనల్ హెల్త్ మిషన్‌లో 15 ఎపిడిమాలజిస్ట్ పోస్టులను కూడా కాంట్రాక్టు విధానంలో భర్తీకి కూడా నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నెల 10 నుంచి 16వ తేది వరకు ఆన్‌లైన్‌లో http://apmsrb.ap.gov.in/msrb/ https://dme.ap.nic.in దరఖాస్తు చేసుకోవాలని వెల్లడించింది.

# కానిస్టేబుల్ పరీక్షల్లో 33,921 మంది ఎంపిక

- ఒఎంఆర్ పరిశీలన 12వ తేదీ వరకూ అవకాశం
- ఎపిఎస్‌ఎల్‌పిఆర్‌బి చైర్మన్ రాజీవ్ కుమార్ మీనా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పోలీసు కానిస్టేబుల్స్ నియామకాల కోసం రాత పరీక్షలో 33,921 మంది ఎంపికైనట్లు పోలీసు రిక్రూట్మెంట్ బోర్డు రాజీవ్ కుమార్ మీనా తెలిపారు. గత నెల 1వ తేదీన నిర్వహించిన ఈ పరీక్షకు మొత్తం 37,600 మంది హాజరవగా, వీరిలో పురుషులు 32,364 మంది, మహిళలు 5,236 మంది ఉండగా, ఎంపికైన వారిలో పురుషులు 29,211 మంది, మహిళలు 4,710 మంది ఉన్నారని గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 5 కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహించగా విశాఖపట్నం కేంద్రంలో 10,354, కాకినాడ కేంద్రంలో 5,502, గుంటూరు కేంద్రంలో 7,323, కర్నూలు కేంద్రంలో 6,320, తిరుపతి కేంద్రంలో 4,417 మంది ఎంపికయ్యారని వెల్లడించారు. అభ్యర్థులు వారి మార్కుల జాబితాల కోసం www.slprb.ap.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. అభ్యర్థులు వారి ఒఎంఆర్ షీట్‌లను పరిశీలించుకునేందుకు ఈ నెల 10వ తేదీ నుంచి 12వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకూ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచడం జరుగుతుందన్నారు. ఒఎంఆర్ వెరిఫికేషన్ కోసం ఈ నెల 12వ తేదీన సాయంత్రం 5 గంటలలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడంతోపాటు రూ.వెయ్యి ఫీజు చెల్లించాలని తెలిపారు. వెరిఫికేషన్‌లో మార్కులు పెరిగితే చెల్లించిన ఫీజును అభ్యర్థికి వెనక్కి ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ ఫలితాల వివరాలను ఎస్ఎంఎస్, ఇమెయిల్ ద్వారా పంపనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాల కోసం అభ్యర్థులు హెల్ప్ లైన్ 94414 50639 లేదా 91002 03323 నంబర్లకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటలలోపు సంప్రదించవచ్చని సూచించారు.

# నిర్దిష్ట సమయానికి ప్రాజెక్టులు పూర్తి

### ట్రాన్స్‌కో సమీక్షలో సిఎస్ విజయానంద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ట్రాన్స్‌కో ప్రాజెక్టులను నిర్దిష్ట సమయానికి పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ట్రాన్స్‌కో సిఎండి కె విజయానంద్ అధికారులను ఆదేశించారు. ట్రాన్స్‌కో ప్రాజెక్టుల పురోగతిపై సచివాలయంలో గురువారం సమీక్ష నిర్వహించారు. సుమారు రూ.12వేల కోట్ల విలువైన ట్రాన్స్‌మిషన్ నెట్ వర్క్ ప్రాజెక్టులను రాష్ట్రవ్యాప్తంగా ట్రాన్స్‌కో ఆధ్వర్యంలో చేపటినట్లు తెలిపారు. వీటిల్లో 7 ప్రాజెక్టులు పూర్తయ్యాయని, 62 ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయని, 5 ప్రాజెక్టులు చేపట్టేందుకు అనుమతులు మంజూరయ్యాయని తెలిపారు. మరో రూ.3614 కోట్లు విలువ చేసే 31 పనులకు టెండర్లు ఆహ్వానించినట్లు వెల్లడించారు. ఈ ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. పారిశ్రామిక కారిడార్లు, పట్టణ కస్టర్ల వంటి ప్రాధాన్యత కలిగిన ప్రాంతాల్లో ప్రాజెక్టులపై రోజువారీ స్థాయిలో సమీక్షించాలని, వారానికోసారి పురోగతి నివేదికలు సమర్పించాలని సూచించారు.జిల్లా కలెక్టర్లు, స్థానిక సంస్థల సమన్వయంతో వేగవంతం చేయాలని చెప్పారు. రాజధాని ప్రాంతంలోని ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. ఈ సమావేశంలో ట్రాన్స్‌కో జెఎండి కీర్తి చేకూరి, డైరెక్టర్లు ఏకెవి భాస్కర్, జె వెంకటేశ్వరరావు, సిఇ సుధీవన్ కుమార్ పాల్గొన్నారు.

**బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర**
Bank of Maharashtra
జోనల్ ఆఫీసు, విజయవాడ: 1వ అంతస్తు, ఇన్ఫినిటీ ప్లాజా, డోర్ నం.: 59ఎ-21-7/3, హైస్కూల్ రోడ్, పటమట, విజయవాడ, ఆం.ప్ర-520007.
Ph :0866-2431225, email: zmvijayawada@mahabank.co.in

**స్వాధీనతా ప్రకటన (రూలు 8(1))**

ఏదైతే, క్రింది సంతకందారు, బ్యాంకు ఆఫ్ మహారాష్ట్ర, చీఫ్ మేనేజర్, విజయవాడ జోన్ యొక్క అధీకృత అధికారిగా, ది సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్సియల్ అసెట్స్ & ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8తో చదువబడే సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (12) క్రింద సంక్రమించిన అధికారాలను ...

తేది: 09.07.2025
ప్రదేశం: గుంటూరు
సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి, బి.ఓ.ఎం, విజయవాడ జోన్.

**బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర**
Bank of Maharashtra
జోనల్ ఆఫీసు, విజయవాడ: 1వ అంతస్తు, ఇన్ఫినిటీ ప్లాజా, డోర్ నం.: 59ఎ-21-7/3, హైస్కూల్ రోడ్, పటమట, విజయవాడ, ఆం.ప్ర-520007.
Ph :0866-2431225, email: zmvijayawada@mahabank.co.in

**స్వాధీనతా ప్రకటన (రూలు 8(1))**

తేది: 09.07.2025
ప్రదేశం: గుంటూరు
సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి, బి.ఓ.ఎం, విజయవాడ జోన్.

**యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**

**అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరుచు ప్రకటన (30 రోజుల ప్రకటన)**

తేది : 09-07-2025
స్థలం : విజయవాడ
సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

**యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**
గుడివాడ బ్రాంచి (55340)
10-137, గ్రౌండ్ ఫ్లోర్, ఏలూరు రోడ్డు, గుడివాడ-521301.

**అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరుచు ప్రకటన (30 రోజుల ప్రకటన)**
(RULE 6(2)/RULE 8(6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002)

తేది: 01-07-2025
ప్రదేశము: గుడివాడ
అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

**భౌతిక స్వాధీనత నోటీసు**

ICICI Bank
శాఖ కార్యాలయం: ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, 4/10 మైత్రి టవర్, బొమ్మన్ హల్లి హోసూర్ మెయిన్ రోడ్డు, బెంగళూరు-560068

దిగువసంతకందారు అయిన ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ యొక్క ఆధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటి ఇంట్రస్ట్ యాక్ట్, 2002 క్రింద సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువుతూ సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలతో రుణగ్రహీతలను సదరు నోటీసు స్వీకరించిన తేది నుండి 60 రోజులలోపట దిగువ ...

| క్ర. సం. | రుణగ్రహీతలు పేరు/ లోను ఖాతా సంఖ్య | ఆస్తి వివరణ/ భౌతిక స్వాధీనత తేది | డిమాండ్ నోటీసు తేదీ/ డిమాండ్ నోటీసులో మొత్తం (రూ.) | శాఖ పేరు |
|---|---|---|---|---|
| 1. | ... / LBGTR00003216530 | ... తేది: 07.07.2025 | 12.02.2024 Rs. 16,59,899.00/- | గుంటూరు |

తేది : 11 జులై, 2025, ప్రదేశం : గుంటూరు
అధీకృత సెక్రెటరీ, ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ తరుపున

**ARKA FINCAP LIMITED**
ARKA
రిజిస్టర్డ్ ఆఫీసు: 2504, 25వ అంతస్తు, వన్ లోధా ప్లేస్, సేనాపతి బాపట్ మార్గ్, లోయర్ ప్యారెల్, ముంబయి-400013, మహారాష్ట్ర, ఇండియా.

**డిమాండ్ నోటీసు**

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటి ఇంటరెస్ట్ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద ప్రకటన.

| రుణ ఖాతా నం. | రుణగ్రహీతల వివరాలు | డిమాండ్ నోటీసు వివరాలు & ఎన్‌పిఎ తేది |
|---|---|---|
| 2002023942 | ... | రూ. 41,06,320.83 ... డిమాండ్ నోటీసు తేది: 07.07.2025, ఎన్‌పిఎ తేది: 04.07.2025. |

ప్రదేశం: విజయవాడ, తేది: 11.07.2025
సం/- అధీకృత అధికారి, అర్కా ఫిన్‌క్యాప్ లిమిటెడ్.

Kirloskar Group Company
The mark 'Kirloskar' in the status line is owned by Kirloskar Proprietary Limited and Arka Fincap Limited is the permitted user.

TATA
**టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్**
శాఖ చిరునామా: డో.నం: 54-15-4సి/1, ...

**స్థిరాస్తి అమ్మకం కోసం నోటీసు**
సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 ...

| | | | | |
|---|---|---|---|---|
| 5. | TCHHL0800 3000100084 260 | ... | రూ.83,59,032/- ... 15.11.2022 | రూ.68,00,000/- ... | రూ.1,20,15,817/- ... 04.07.2025 |

ప్రదేశం : ఆంధ్రప్రదేశ్
తేది : 11.07.2025
సం/- అధీకృత అధికారి, టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

# సెప్టెంబర్ 24 నుంచి శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు

- టిటిడి అదనపు ఇఒ

ప్రజాశక్తి - తిరుమల

సెప్టెంబర్ 24 నుంచి అక్టోబర్ 2 వరకూ శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు జరగనున్న నేపథ్యంలో ప్రణాళికలు రూపొందించి నిర్దేశిత సమయంలోపు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని టిటిడి అదనపు ఇఒ సిహెచ్ వెంకయ్య చౌదరి ఆదేశించారు. తిరుమల అన్నమయ్య భవన్‌లో గురువారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. సెప్టెంబర్ 16న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, 23న అంకురార్పణ, 24న ధ్వజారోహణం, 28న గరుడ వాహనం, అక్టోబర్ 1న రథోత్సవం, 2న చక్రస్నానం ఉంటుందన్నారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వాహన సేవలు ఉంటాయి. బ్రహ్మోత్సవ రోజుల్లో యాత్రికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రోటోకాల్ ప్రముఖులకు మినహా విఐపి బ్రేక్ దర్శనాలు రద్దు చేస్తున్నట్లు వెల్లడించారు. అలాగే వృద్ధులు, దివ్యాంగులు, దాతల దర్శనాలూ రద్దు చేశారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి, రోడ్‌మ్యాప్‌లు, పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. 27-29 తేదీల్లో తిరుమల ఘాట్ రోడ్డుల్లో ద్విచక్రవాహనాలకు అనుమతి నిరాకరించారు. యాత్రికుల రద్దీకి తగిన విధంగా లడ్డూలను నిల్వ ఉంచుకోవాలని ఆదేశించారు.

# కార్మిక వర్గానికి సిసిజిజిఓఓ అభినందనలు

**న్యూఢిల్లీ :** సార్వత్రిక సమ్మెను అఖిల భారత స్థాయిలో విజయవంతం చేసిన కార్మిక వర్గానికి కేంద్ర ప్రభుత్వ గెజిటెడ్ ఆఫీసర్ సంఘాల సమాఖ్య (సిసిజిజిఓఓ) అభినందనలు తెలియజేసింది. అనూహ్యమైన రీతిలో కార్మికులు, కర్షకులు, వ్యవసాయ కూలీలు, వివిధ రంగాలకు చెందిన ప్రజలు ఏకమై కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తీవ్రంగా నిరసించారని పేర్కొంది. తదుపరి దశలో సమైక్య కార్యాచరణలకు ఇది ఆరంభమని వ్యాఖ్యానించింది. ఈ మేరకు సిసిజిజిఓఓ జాతీయ చైర్మన్, పెన్షనర్లు, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ కార్యదర్శి వి.కృష్ణ మోహన్ ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. చారిత్రక రీతిలో కార్మిక వర్గం ప్రదర్శించిన ఈ ఐక్యత, నిబద్ధత, కేంద్ర ప్రభుత్వానికి, కార్పొరేట్ శక్తులకు ఒక స్పష్టమైన సందేశాన్ని పంపిందని ఆ ప్రకటన పేర్కొంది. కార్మికుల హక్కులను కాలరాసి, వారి శ్రమను దోపిడీ చేస్తే సహించేది లేదని స్పష్టం చేసింది. ఈ సమ్మెతో దేశ ఆర్థిక వ్యవస్థలోని కీలక రంగాలు స్తంభించాయి. కింది స్థాయి నుండి కీలకమైన పరిశ్రమల వరకు కార్మికులందరూ ఏకతాటిపై నిలిచారు. న్యాయం కావాలని నినదించారని ఆ ప్రకటన పేర్కొంది. బొగ్గు, ఖనిజ రంగాలు, బ్యాంకులు, ఎల్‌ఐసి, ఒఎన్‌జిసి, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ముఖ్యంగా పోస్టల్, ఆదాయపన్ను, ఆడిట్, టెలికం ఇలా పలు రంగాలకు చెందిన వారు సమ్మెలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జూట్, జౌళి, ఐటి, మెడికల్, సేల్స్ రిప్రజెంటేటివ్‌లు, పలు రాష్ట్రాల్లో ప్రభుత్వ, ప్రైవేటు రవాణా రంగ కార్మికులు, విద్యుత్, రక్షణ, రైల్వే, సహాపలు రంగాలకు చెందిన వారు పాల్గొన్నారు. అన్ని రాష్ట్రాల్లో ఎఐకెఎస్, ఎఐఎడబ్ల్యుయు, ఎస్‌కెఎం అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో రైతులు, వ్యవసాయ కూలీలు పాల్గొన్నారు. రాబోయే రోజుల్లో రంగాలవారీ పోరాటాలతో సుదీర్ఘ పోరు సాగించేందుకు ఇది ప్రారంభం మాత్రమేనని సిసిజిజిఓఓ పేర్కొంది. కార్మిక, కర్షకుల మధ్య ఐక్యత మరింత పెరిగి, ప్రత్యామ్నాయ విధాన వ్యవస్థ కోసం పెద్ద ఎత్తున, సమైక్య జాతీయోద్యమంగా అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నట్లు తెలిపింది.

# 'తల్లికి వందనం' అప్పులకు జమ

- బ్యాంకర్ల నిర్వాకంతో లబోదిబోమంటున్న బాధితులు
- చర్యలు తీసుకోవాలని వ్యకాస డిమాండ్

ప్రజాశక్తి-శింగనమల

తల్లికి వందనం పథకానికి సంబంధించిన డబ్బులను బ్యాంకు అధికారులు పాత అప్పునకు జమ చేసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న బాధితులు శింగరమల మండలంలోని సలకంచెరువు స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) వద్ద లబోదిబోమంటున్నారు. వివరాల్లోకి వెళ్తే...సలకం చెరువు మాదిగ కాలనీకి చెందిన బందెల రాములమ్మకు కుమారుడు, కొడుకు ఉండటంతో తల్లికి వందనం పథకం కింద రూ.26వేలు గ్రామంలోని ఎస్‌బిఐ రాములమ్మ ఖాతాలో జమ అయింది. ఈమెతో పాటు ఇదే గ్రామానికి చెందిన హరిజన లతకు ఓ కుమార్తె ఉన్నారు. దీంతో ఆమెకు కూడా తల్లికి వందనం కింద రూ.13వేలు ఇదే బ్యాంకు ఖాతాలో జమ అయింది. అయితే ఆయా కుటుంబాలకు మహిళా సంఘాల్లో అప్పు ఉండటంతో తల్లికి వందనం నగదును సంబంధిత బ్యాంకు అధికారులు జమ చేసుకున్నారు. దీంతో బాధితులు బ్యాంకు వెళ్లి తల్లికి వందనం నగదు ఇవ్వాలని అడగడంతో బ్యాంకు అధికారులు భయభ్రాంతులకు గురి చేస్తూ బయటికి పొమ్మని హుకుం జారీ చేస్తున్నట్లు బాధితులు వాపోతున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ పథకాలకు సంబంధించిన మొత్తాన్ని బ్యాంకుల్లోని అప్పులకు జమ చేసుకోకూడదు. అయితే సలకం చెరువు బ్యాంకు అధికారులు మాత్రం ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తూ పేదలకు నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. విషయం తెలుసుకున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్ బాధితులతో కలిసి బ్యాంకు సిబ్బందితో ఆరాతీశారు. అయినా కూడా బ్యాంకు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వ్యకాసం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సలకంచెరువు ఎస్‌బిఐ మేనేజర్, ఫీల్డ్ ఆఫీసర్ ఖాతాదారుల పట్ల నిర్యక్ష్యంగా వ్యవహరించడం మంచిది కాదన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చిన సంక్షేమ పథకాల సొమ్మును అప్పులకు జమ చేసుకుని పేదల కడుపు కొట్టడం మంచిది కాదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వం నుంచి వచ్చిన తల్లికి వందనం డబ్బులను బాధితులకు అందేలా చూడాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

## విదేశీ పర్యటన నుంచి భారత్‌కు తిరిగి వచ్చిన ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ :** విదేశీ పర్యటన ముగించుకుని ప్రధాని నరేంద్ర మోడీ గురువారం భారత్‌కి తిరిగి వచ్చారు. జూలై 2 నుంచి 9 వరకు ప్రధాని మోడీ ఆరు దేశాల్లో పర్యటించారు. ఘనా, ట్రినిడాడ్, టొబాగో, అర్జెంటీనా, బ్రెజిల్, నమీబియా దేశాల్లో మోడీ పర్యటించారు. బ్రెజిల్‌లో రియో వేదికగా జరిగిన 17వ బ్రిక్స్ సదస్సుకి ఆయన హాజరయ్యారు.

# శ్రీశైలంలో వైభవంగా శాకంబరీ ఉత్సవం

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

శ్రీశైలంలో ఆషాడ పౌర్ణమిని పురస్కరించుకుని భ్రమరాంబదేవీ అమ్మవారికి గురువారం శాకంబరీ ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ఉత్సవాన్ని పురస్కరించుకొని ఆకు కూరలు, కూరగాయలు, వివిధ రకాల ఫలాలతో భ్రమరాంబదేవి మూల మూర్తికి, ఉత్సవమూర్తికి, ఆలయ ప్రాంగణంలోని రాజరాజేశ్వరి అమ్మవారికి, అన్నపూర్ణాదేవి అమ్మవారికి, గ్రామ దేవత అంకాలమ్మ అమ్మవారికి శాకాలంకరణ ఉత్సవ పూజలు నిర్వహించారు. ఉత్సవంలో భాగంగానే అమ్మవారి ఆలయ ప్రాంగణాన్ని పలు రకాల ఆకుకూరలు, కూరగాయలతో అలంకరించారు. అలంకరణ కోసం సుమారు మూడు వేల కేజీలకు పైగా వివిధ రకాల కూరగాయలు, 100 గుమ్మడి కాయలు, రెండు వేల నిమ్మకాయలు, వివిధ రకాల 600 ఆకు కూరలు తెప్పించారు.


**యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా — UMFB గుడివాడ బ్రాంచి (01461)**
10/52-1, గౌరీశంకరపురం, గుడివాడ-521301, కృష్ణాజిల్లా, ఏ.పి.

**అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరుచు ప్రకటన (30 రోజుల ప్రకటన)**
(RULE 6(2)/RULE 8(6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002)

ఋణగ్రహీతలు/కో ఆబ్లిగెంట్స్ / తనఖాదారులు / హామీదారులు: 1. శ్రీ చెరుకువాడ అప్పల రామ కృష్ణం రాజు, తండ్రి: శ్రీ సి.హెచ్.రంగారావు, డి.నెం.2-155, ఆంధ్రా బ్యాంక్ వీధి, యెండగండి, ఉండి మండలం, పశ్చిమ గోదావరి జిల్లా, ఏపి-534186. ...

తేది: 01-07-2025 ప్రదేశం: గుడివాడ — అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

**ఫీనిక్స్ ఏఆర్‌సి ప్రైవేట్ లిమిటెడ్** (Phoenix ARC)
... రోడ్ మరియు వెస్టర్న్ ఎక్స్‌ప్రెస్ హైవే ..., ఫ్యాక్స్: 022-67412313
CIN: U67190MH2007PTC168303 email: info@phoenixarc.co.in, Website: www.phoenixarc.co.in

ఇ-వేలం అమ్మకపు ప్రకటన ... ఇ-వేలం తేదీ & సమయం తేదీ: 19-08-2025 ...

తేది: 11-07-2025 — సం/- అధీకృత అధికారి, ఫీనిక్స్ ఏఆర్‌సి ప్రైవేట్ లిమిటెడ్

**pnb Housing Finance Limited**
... బ్రాంచ్ చిరునామా: ..., విజయవాడ-520010.

తేది: 11-07-2025, ప్రదేశం: విజయవాడ, ఆంధ్రప్రదేశ్ — సం/- అధీకృత అధికారి, పిఎన్‌బి హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

**యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా — UMFB గుడివాడ బ్రాంచి (01461)**
10/52-1, గౌరీశంకరపురం, గుడివాడ-521301, కృష్ణాజిల్లా, ఏ.పి.

**అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరుచు ప్రకటన (30 రోజుల ప్రకటన)**
(RULE 6(2)/RULE 8(6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002)

ఋణగ్రహీతలు/కో ఆబ్లిగెంట్స్ / తనఖాదారులు / హామీదారులు: శ్రీ బొప్పున జగదీశ్వర రావు, తండ్రి: బి. సూర్యనారాయణ, డి.నెం. 2-92-1, మోక్షకలవపూడి, మండవల్లి, గుడివాడ, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్-521301. ...

తేది: 01-07-2025 ప్రదేశం: గుడివాడ — అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

**యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా — గుడివాడ బ్రాంచి (55340)**
10-137, గ్రౌండ్ ఫ్లోర్, బందరు రోడ్డు, గుడివాడ-521301.

**అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరుచు ప్రకటన (30 రోజుల ప్రకటన)**
(RULE 6(2)/RULE 8(6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002)
...
తేది: 01-07-2025 ప్రదేశం: గుడివాడ — అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

**నిడో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్** (nido HOME FINANCE)
(గతంలో ఇడెల్‌వీస్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పేరుగలది)
రిజిస్టర్డు ఆఫీసు: 5వ అంతస్తు, టవర్-3, వింగ్ 'బి', కోహినూర్ సిటీ మాల్, కోహినూర్ సిటీ, కిరోల్ రోడ్, కుర్ల (వెస్ట్), ముంబయి-400 070.
బ్రాంచి ఆఫీసు చిరునామా: 4వ అంతస్తు, జానకీ అవెన్యూ, నం.1-11-220/15, బృందావన్ కాలనీ, ప్లాట్ నం.2, బేగంపేట్, హైదరాబాద్-500016.

**ఇ-వేలం-చట్టబద్ధ 15 రోజుల అమ్మకపు ప్రకటన**
ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్& ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2022 క్రింద ఇ-వేలం ద్వారా అమ్మకం.
ఇందుమూలంగా సర్వజనులకు మరియు ప్రత్యేకించి రుణగ్రహీత& హామీదారులకు ప్రకటన ఇవ్వడమేమనగా, రుణ బకాయిలను రికవరీచేయు వరకు పట్టికలో పేర్కొన్న మొత్తాల రికవరీ కొరకు "ఎక్కడ ఏది ఎలా ఉన్నది, అక్కడ అది అలాగే ఉంటుంది" ప్రాతిపదికన దిగువ పేర్కొన్న ఆస్తి విక్రయించబడుతుంది. ...
LAN: LVIJSBI0000095925 ... తేది: 11.07.2025 — సం/- అధీకృత అధికారి, నిడో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్

**బ్యాంక్ ఆఫ్ ఇండియా, విజయవాడ జోనల్ ఆఫీస్** (Bank of India — Relationship beyond banking)
#31-23-1A, పి.ఆర్ కాంప్లెక్స్, 1వ ఫ్లోర్, BSNL భవన్ (ప్రక్కన, చుట్టుగుంట), విజయవాడ-520004, ఆంధ్రప్రదేశ్, ఫోన్: 0866-2467777 / 2467764

**SARFASI ACT స్వాధీనతా ప్రకటన**
... తేది: 09-07-2025, ప్రదేశం: విజయవాడ — సం/- అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ ఇండియా

# ప్రభుత్వ - ప్రైవేటు భాగస్వామ్యం వైద్యరంగంలో వైఫల్యమే!

**ప్రజలకు అందని ఉచిత సేవలు • కార్పొరేట్ సంస్థల చేతుల్లోకి ఖరీదైన భూములు • మెడికల్ సీట్ల కోసం లక్షల్లో వసూలు**




**ప్రభుత్వ - ప్రైవేటు భాగస్వామ్యం పేరుతో వైద్యరంగంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంస్కరణలు సంపూర్ణంగా విఫలమయ్యాయి. పేదలకు ఉచితంగా సేవలందించిన పరిస్థితి దేశంలో ఎక్కడా లేదు. లక్షల రూపాయలు మెడికల్ సీట్ల కోసం ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. టైమ్స్ ఆఫ్ ఇండియాలో ప్రచురితమైన కథనం ప్రకారం... అనేక రాష్ట్రాల్లో ప్రభుత్వాసుపత్రులు ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టగా, అప్పటివరకూ అందిన కొద్దిపాటి సేవలు కూడా దూరమయ్యాయని తేలింది. మెరుగైన సేవలందుతాయని, బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గుతాయని ఊదరగొడుతున్న కేంద్రంలోని మోడీ ప్రభుత్వం, ఆయా రాష్ట్రాల్లోని బిజెపి, ఇతర పార్టీల నేతృత్వంలోని ప్రభుత్వాల మాటలన్నీ వట్టివేనని తేలిపోయింది. నిరుపేదలైన ప్రజలు వైద్యం చేయించుకోలేక ప్రాణాలు కోల్పోతుండగా, మధ్యతరగతి ప్రజలు ఉన్న ఆస్తులను అమ్ముకుని రోడ్డునపడుతున్నారు. మన రాష్ట్రంలో చంద్రబాబు నేతృత్వంలోని కూటమి సర్కారు ఇప్పటికైనా ఈ విధానాల నుంచి వైదొలగాలని ప్రజలు కోరుకుంటున్నారు.**

**న్యూఢిల్లీ :** దేశంలో నయా ఉదారవాద సంస్కరణల అమలు ఇలా ఉంది..కొన్ని ప్రభుత్వ ఆస్పత్రులు చాలా నాసిరకంగా వున్నాయి. ప్రజలు పన్నుల రూపంలో చెల్లించిన కోట్లాది రూపాయిల మొత్తానికి అవి ప్రాతినిధ్యం వహిస్తున్నాయి, ఆ ఆస్పత్రులు వున్న భూముల విలువే కోట్లలో వుంటుంది. దేశవ్యాప్తంగా, అనేక ప్రభుత్వ ఆరోగ్య సంరక్షణా వ్యవస్థలను ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తున్నారు. ఈ ఆస్పత్రులను మరింత ఆధునీకరించి, వేలాదిమంది డాక్టర్లను తయారుచేసే మెడికల్ కాలేజీలను నిర్మించడం ద్వారా ఆ ప్రైవేటు సంస్థలు మరింత మెరుగైన రీతిలో ఆరోగ్య సంరక్షణా సేవలను ప్రజలకు అందిస్తాయనేది కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల వాదన. ప్రభుత్వ ఆస్పత్రుల్లో డాక్టర్ల ఖాళీలను స్పెషలిస్టులను భర్తీ చేయడానికి ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పిపిపి) ఉపకరించలేదని తేలిపోయింది.

ప్రపంచ బ్యాంక్‌తో సంప్రదించిన తర్వాత భారత ప్రభుత్వం, నీతి ఆయోగ్ 2017లో ఈ సంస్కరణలకు మద్దతిచ్చాయి. 300 లేదా అంతకు తక్కువ పడకలు కలిగిన ఆస్పత్రులను ప్రైవేటు సంస్థలకు అప్పగించాలని నిర్ణయించారు. ఈ ప్రైవేటు సంస్థలు ఆస్పత్రితోపాటు మెడికల్ కాలేజీలను కూడా నిర్మించాల్సి వుంది. ఈ కాలేజీల ఏర్పాటుకు అయ్యే వ్యయంలో 30 నుండి 40శాతం మొత్తాలను భరిస్తామని 2020లో కేంద్ర ప్రభుత్వం చెప్పింది. ఆయా కాలేజీలను నిర్మించే రాష్ట్రాలు మరో 30-40 శాతాన్ని భరించాల్సి వుంటుందని పేర్కొంది. కాలేజీలు పెట్టిన మొదటి ఐదేళ్లలో వీటి నిర్వహణా వ్యయాలను కేంద్రం, రాష్ట్రం వరుసగా 50శాతం, 25శాతం భరించాలని కూడా సిఫార్సు చేయబడింది. కొన్ని ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యాల్లో, ప్రభుత్వం భూమిని మొత్తంగా ప్రైవేటుసంస్థకు దఖలు పరుస్తోంది. అక్కడ ఆస్పత్రిని ఏర్పాటు చేసేందుకయ్యే వ్యయంలో ప్రధాన భాగాన్ని భరిస్తోంది. ఇందుకు అన్ని రాష్ట్రాలు ముందుకు రాలేదు. ప్రధానంగా తమిళనాడు అనేక అభ్యంతరాలను లేవనెత్తింది. ఇంకా ఈ మోడల్‌ను 15 రాష్ట్రాలు ఆమోదించలేదు.

**ఆరోగ్య సంరక్షణా రంగంలో పిపిపిల చీకటి చరిత్ర.. అన్ని రాష్ట్రాల్లో వైఫల్యమే!**

కొత్త పిపిపి నమూనాల ప్రకారం ప్రైవేటు కంపెనీలు నిర్వహించే ప్రభుత్వ ఆస్పత్రుల్లో కొన్ని బెడ్‌లను ఉచిత చికిత్సకు కేటాయించాల్సి వుంటుంది. గతంలో జరిగిన అనుభవాలు చూస్తే, భారతదేశవ్యాప్తంగా దాదాపు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఇలాంటి ప్రజా సంక్షేమ చర్యలను తప్పనిసరిగా అమలయ్యేలా చూడడంలో విఫలమయ్యాయి.

గతంలోని కొన్ని పిపిపి ప్రాజెక్టులు భయంకరమైన వైఫల్యాలను మిగిల్చాయి. చత్తీస్‌గఢ్ ప్రభుత్వం 2002లో ఎస్కార్ట్స్ హార్ట్ ఇనిస్టిట్యూట్ అండ్ రీసెర్చ్ సెంటర్ భాగస్వామ్యంతో కలిసి కార్డియాక్ కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. 2017లో చత్తీస్‌గఢ్ ప్రభుత్వం మళ్లీ దాన్ని వెనక్కి తీసుకుంది. 1953లో, మంగళూరులోని కస్తూరిబా మెడికల్ కాలేజీ (కెఎంసి) విజయవంతమైన పిపిపి ప్రయోగానికి కేంద్రంగా నిలిచింది. ఆ విజయం శాశ్వతంగా నిలిచివుంది. పిపిపిలతో కర్ణాటక ప్రభుత్వ అనుభవాలు చాలా దారుణంగా వున్నాయి. అనేక అవగాహనా ఒప్పందాలను (ఎంఓయు) ప్రభుత్వం రద్దుచేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

రాయచూర్‌లోని రాజీవ్‌గాంధీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ఉదాహరణగా తీసుకుంటే, శతాబ్దం ప్రారంభంలో ఒక పెద్ద ప్రైవేటు ఆరోగ్యసంరక్షణా గ్రూపునకు అప్పగించారు. 2012లో, ప్రభుత్వం దాన్ని వెనక్కి తీసుకుంది. అక్కడ ఆర్థికంగా జరిగిన అవకతవకలతో పాటూ కేవలం 40శాతం బెడ్స్ మాత్రమే ఉపయోగంలో వున్నాయని, పైగా వాటిని కూడా ప్రజలు పూర్తి స్థాయిలో ఉయోగించుకోవడం లేదని వెల్లడవడంతో ప్రభుత్వం ఈ చర్య తీసుకుంది. పేదరోగులకు 11శాతం బెడ్స్‌ను మాత్రమే కేటాయించారు.

**కొత్త వెంచర్లు, పాత ప్రశ్నలు...**

ఈ అనుభవం వున్నప్పటికీ, కర్ణాటక ప్రభుత్వం ఆరోగ్య రంగంలో మరో పిపిపి నమూనాకు సిద్ధమవడం విచిత్రం. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో కొత్తగా 9 మెడికల్ కాలేజీలను ప్రారంభించడానికి సిద్ధంగా వుంది. అంటే, 9 జిల్లా ఆస్పత్రుల్లో రెండు వేలకు పైగా బెడ్‌లు, వెయ్యి కోట్ల రూపాయలకు పైగా విలువ చేసే ప్రజాధనం, మార్కెట్ ధర ప్రకారం భూమి విలువ చూస్తే ఇంకా ఎక్కువ, వీటన్నింటినీ ప్రైవేటు భాగస్వాములకు అప్పగించనున్నారు. ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు కూడా చెరో 16 పిపిపిలను ప్రకటించాయి. మధ్యప్రదేశ్ 12 పిపిపిలను ప్రకటించింది. ఇదే విధానం దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో వివిధ అనుభవాలను మిగులుస్తోంది. ఉత్తర ప్రదేశ్‌లోని మూడు పిపిపి మెడికల్ కాలేజీలు పనిచేస్తున్నాయి. అక్కడి ఆదిత్య నాధ్ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం ప్రైవేటు సంస్థలకు ఇచ్చిన ఆదేశాలేంటనేవి బహిరంగంగా అందు బాటులో లేవు. మెడికల్ కాలేజీలు నిర్మించడానికి ప్రభుత్వం ఉచితంగా భూమి ఇచ్చిన కేసుల్లో పూర్వపు ప్రభుత్వ ఆస్పత్రిలోని అన్ని బెడ్‌లు, అలాగే ప్రైవేటు భాగస్వామి కొత్తగా చేర్చే 20శాతం బెడ్‌లు ఇవన్నీ కూడా ఉచిత చికిత్సకు కేటాయించాల్సి వుంది. ఈ ఆదేశాలకు ప్రైవేటు సంస్థలు కట్టుబడక పోతే ఏం జరుగుతుంది? చేపట్టిన సంస్కరణలు విజయవంతమయ్యాయా? లేదా? అనేది చెప్పేందుకు అక్కడి ప్రభుత్వం సంసిద్ధంగా లేదు.

**ఉచిత చికిత్స వర్సెస్ ఇన్సూరెన్స్**

చాలా రాష్ట్రాల్లో ఉచిత ఔట్‌పేషంట్ కన్సల్టేషన్, డయాగ్నసిస్ విభాగాలు పిపిపికే అప్పగించబడ్డాయి. తక్కువ సంఖ్యలోనే బెడ్‌లను కేటాయించడం వల్ల వచ్చిన రోగులు తాము దారిద్ర్య రేఖకు దిగువున (బిపిఎల్) కేటగిరీకి చెందిన వారమేనని రుజువు చేసుకోవాల్సి వస్తుంది. చాలామంది రోగులకు భారీగా ఆస్పత్రి చార్జీల్లో రాయితీలిస్తున్నామని అనేక రాష్ట్రాలు చెప్పుకుంటున్నాయి. కొన్ని కేసుల్లో, బిల్లులు చెల్లించే రోగులకు కూడా రేట్లను క్రమబద్ధీకరించారు, ఇక్కడ పెద్ద ప్రశ్న ఏంటంటే - చికిత్స ఆయుష్మాన్ లేదా రాష్ట్ర నిర్దిష్ట బీమా కింద వుంటుందని ప్రభుత్వాలు చెబుతున్నాయి. ఇన్ పేషంట్ చికిత్సకు మాత్రమే బీమా వర్తిసుంది. దీనికి సాధారణంగా నిర్దిష్ట పద్ధతి ప్రమాణాలు వుంటాయి. పైగా దీనికి రూ.5 లక్షల పరిమితి కూడా వుంటుంది.

**ఉచిత చికిత్స లేని బెంగాల్**

పశ్చిమ బెంగాల్‌లో పిపిపి నమూనాలో నాలుగు ఆస్పత్రులు కమ్ మెడికల్ కాలేజీలు నడుస్తున్నాయి. ఎక్కడా ఉచిత చికిత్స లేదు. సెకండరీ చికిత్స, పూర్తి చికిత్స కవరయ్యేలా రాష్ట్ర బీమా పథకం వుంది. ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల పరిమితి వుంది. కానీ, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచిత చికిత్స అందుబాటులో వున్నట్లైతే ఎవరూ పిపిపి ఆస్పత్రులకు వెళ్లరని ప్రజారోగ్య నిపుణులు చెబుతున్నారు. అధికారిక డేటా ప్రకారం, కీలకమైన సమస్య ఏమిటంటే, ప్రభుత్వ ఆస్పత్రులతో పోల్చుకుంటే ప్రైవేటు రంగంలోని ఆస్పత్రుల్లో వైద్య చికిత్స ఆరు రెట్లు వ్యయభరితంగా వుంటుంది. దీనర్థం బీమా లెక్కలన్నీ ప్రభుత్వాలకు వ్యతిరేకంగానే వుంటాయి. ఈ బీమా పథకాల కోసం ప్రభుత్వాలు ఈ సేవలను ప్రైవేటు ఆస్పత్రుల నుండి కొనుగోలు చేయాల్సి వస్తుంది. అందువల్లే, పలు రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రైవేటు ఆస్పత్రులకు చెల్లించే బీమా మొత్తాలను ఎగవేస్తున్నాయి. అనేక ప్రైవేటు ఆస్పత్రులు కూడా ప్రభుత్వ బీమా పథకాల కింద చికిత్స చేయడానికి నిరాకరిస్తున్నాయి.

## గణాంకాలే అసలు కథను చెబుతున్నాయి?

డెలివరీ సందర్భాన్ని మినహాయిస్తే మిగిలిన సమయాల్లో ఆస్పత్రిలో చేరాల్సి వస్తే వైద్య చికిత్సకయ్యే వ్యయం గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ ఆస్పత్రుల్లో సగటున రూ.4,290గా వుంది. అదే ప్రైవేటు ఆస్పత్రులైతే ఆరు రెట్లు ఎక్కువగా రూ.27,347గా వుందని 2017-18లో ఆరోగ్య వ్యయంపై ఎన్ఎస్ఎస్ఓ నివేదిక తెలియచేస్తోంది. పట్టణ ప్రాంతాల్లో, ఈ గణాంకాలు వరుసగా రూ.4,837, రూ.38,822 (ఎనిమిది రెట్లు ఎక్కువగా)గా వున్నాయి. ఎన్ఎఫ్‌హెచ్ఎస్ (2019-21) డేటా చూసినట్లైతే, డెలివరీకయ్యే సగటు ఖర్చు ప్రభుత్వ ఆస్పత్రుల (రూ.3,245) కన్నా, ప్రైవేటు ఆస్పత్రుల్లో దాదాపు ఎనిమిది రెట్లు (రూ.24,663) అధికంగా వుంది. భారతదేశంలో వైద్య సంరక్షణ రంగంలో ద్రవ్యోల్బణ రేటు 12నుండి 14శాతం మధ్యన వుందని అంచనా వేయబడింది. ఇది ఆసియాలోనే అత్యధికం. ఆస్పత్రుల్లో ఫీజులు పెద్దగా చెల్లించుకోలేని నిరుపేదవర్గాలకు పిపిపి నమూనాలో వైద్య ఖర్చుల భారం చాలా ఎక్కువగా వుంటోంది.

### మధ్యప్రదేశ్, గుజరాత్‌లో నిరసనలతో వెనకడుగు

మధ్యప్రదేశ్‌లో ప్రజల నుండి తీవ్రంగా నిరసనలు వెల్లువెత్తడంతో జిల్లా ఆస్పత్రులను ప్రైవేటు సంస్థలకు అప్పగించలేకపోయింది. ఈ ఆస్పత్రులను బోధనా కార్యకలాపాల కోసం 'అటాచ్' చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. పిపిపి ఆస్పత్రుల్లో చికిత్స ఆయుష్మాన్ రేట్ల ప్రకారం జరగాలని, అది కూడా 75శాతం బెడ్‌లకు జరగాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇది, రోగులందరికీ ఉచిత చికిత్సనందించే పరిస్థితి లేదు. గుజరాత్‌లో కూడా ప్రజా నిరసనలు వెల్లువెత్తాయి. 300 బెడ్‌ల వైరా జిల్లా ఆస్పత్రిని టొరెంట్ గ్రూపునకు అప్పగించాల్సి వుంది. స్థానికులు ఆ మార్పును వ్యతిరేకించడంతో ఆ ఆస్పత్రి ఇంకా ప్రభుత్వ ఆధీనంలోనే వుంది.

### ఖరీదైన వైద్య విద్య

పిపిపి పద్ధతిలో మెడికల్ కాలేజీల్లో ఎంబిబిఎస్ సీట్లు పెరగవచ్చు, కానీ చాలామంది విద్యార్థులకు ఇవి అందుబాటులోనే వుండవు. యుపి ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో వార్షిక ఫీజు రూ.40వేలుగా వుంది. ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో సగటు ఫీజు రూ.12 లక్షలుగా వుంది. బెంగాల్‌లో పూర్తి స్థాయి ప్రైవేటు కాలేజీలు, పిపిపి కాలేజీలు అత్యధిక ఫీజులే వసూలు చేస్తున్నాయి. గణనీయంగా ప్రభుత్వ సాయం అందుకునే పిపిపి కాలేజీలు అధిక ఫీజులు చెల్లించలేని విద్యార్థుల కోసం అధిక నిష్పత్తిలో సీట్లను అట్టిపెట్టాలి కదా? రాష్ట్ర కోటాలో కూడా ప్రభుత్వ కాలేజీ సీట్ల కన్నా ఈ సీట్లుకయ్యే ఖర్చు చాలా ఎక్కువ. ఒక పిపిపి కాలేజీలో, ఎంబిబిఎస్ కోర్సు ఫీజులు 2023లో 50 రాష్ట్ర కోటా సీట్లకు రూ.26.8 లక్షలు చొప్పున వుంది. ప్రభుత్వ కాలేజీల్లో ఎంబిబిఎస్ కోర్సు లకు సగటు ట్యూషన్ ఫీజు రూ.40వేలుగా వుంది. హౌరాలో పిపిపి కాలేజీని నిర్వహిస్తున్న ప్రైవేటు సంస్థ ఒక బ్యాచ్ విద్యార్థుల నుండి ప్రతి ఏడాది దాదాపు రూ.26కోట్లు వసూలుచేస్తోంది. ఆస్పత్రి బెడ్‌లను ఉపయోగించుకున్నందుకు ఏడాదికి దాదాపు రూ.9 కోట్లను రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లిస్తోంది. ఇక్కడ చెప్పాలంటే లాభాల మార్జిన్ చాలా ఎక్కువగా వుంది. గుజరాత్‌లో కూడా నాలుగు జిల్లా ఆస్పత్రులను (1150 పడకలకు పైగా) 33ఏళ్ల కాలానికి ఒక రూపాయి చొప్పున ప్రైవేటు సంస్థలకు అప్పగించారు. మెడికల్ కాలేజీలు నిర్మించేందుకు సాయంగా ప్రభుత్వం దాదాపుగా రూ.290 కోట్లను ఖర్చు పెట్టింది. ఇక్కడ ట్యూషన్ ఫీజులు పెద్ద మొత్తంలో ఆదాయాన్నిస్తాయి. ఈ కాలేజీల్లో మూడు కాలేజీలు మొదటి ఏడాదిలో ట్యూషన్ ఫీజుల ద్వారా దాదాపు రూ.6.5కోట్లు వసూలు చేశాయి. రెండో ఏడాదిలో ట్యూషన్ ఫీజు కింద దాదాపుగా రూ.16కోట్లు వసూలు చేశాయి. గుజరాత్ అదానీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ప్రభుత్వ కోటా సీట్ల కోసం ఏడాదికి రూ.10 లక్షలు చొప్పున చార్జీ చేస్తోంది. మొత్తంగా ఎంబిబిఎస్ కోర్సు కోసం బరోడా, భావనగర్‌లో ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ఫీజులు దాదాపుగా రూ.11 లక్షలుగా వున్నాయి.

### పిపిపి పిపిటి

పిపిటి అంటే పీపుల్ పే ట్వైస్ (రెండుసార్లు ప్రజలు చెల్లించేది). ప్రస్తుత పిపిపి నమూనా సమస్యల్లో ఇదొకటి. ప్రజలు చెల్లించే పన్ను మొత్తాలతో ప్రభుత్వ ఆస్పత్రులను కడుతున్నపుడు ప్రజలు ఒకసారి చెల్లించినట్లే. ఈ ఆస్పత్రులను ప్రైవేటు సంస్థలకు అప్పగించినపుడు తమకు అవసరమైన వైద్య సంరక్షణ కోసం ప్రజలు మరోసారి చెల్లించాల్సి వస్తోంది. ఇక్కడ సార్వజనీన ఉచిత చికిత్స నిలిచిపోయింది. ఒకవేళ బీమా సదుపాయం అందుబాటులో వున్నా దాని కింద ఏ సేవా రాదు.

పిపిపి మార్గంలోకి వెళ్లిన రాష్ట్రాలు దీన్ని, ఆరోగ్య సంరక్షణపై అధిక మొత్తంలో పెట్టిన ఖర్చుకు సమాధానంగా చూస్తున్నాయి. చౌకగా ఆరోగ సేవలందించాలన్నది లక్ష్యమైనట్లైతే ప్రస్తుత పిపిపి నమూనా విఫలమైందనే పై ఉదాహరణలు చాటిచెబుతున్నాయి. ఆ ఆస్పత్రులను మళ్లీ వెనక్కి తీసుకుని నిర్వహించాల్సిన పరిస్థితి ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కారుచౌకగా కార్పొరేట్లకు, ప్రైవేటు సంస్థలకు వైద్యరంగాన్ని కట్టబెట్టడం మాని... ప్రజల నుంచి వసూలు చేస్తున్న పన్నులు జనానికి ఉపయోగపడేలా ప్రభుత్వరంగంలోనే వైద్యసేవలందించడం అవసరం.

---

## ఆ ఐదు పంచాయతీలను తెలంగాణలో విలీనం చేయండి

- సిఎం చంద్రబాబుకు ఎమ్మెల్సీ కవిత లేఖ

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో కలిపిన ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఐదు గ్రామాలను తెలంగాణలో విలీనం చేయాలని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు గురువారం ఆమె లేఖ రాశారు. పోలవరం ముంపు పేరుతో 2014లో చీకటి ఆర్డినెన్స్ ద్వారా ఏడు మండలాలను ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేశారని తెలిపారు. దీంతో భద్రాచలం పట్టణంలో అంతర్భాగంగా ఉన్న యటపాక, కన్నాయిగూడెం, గుండాల, పిచ్చుకలపాడు, పురుషోత్త పట్నం గ్రామాలు ఆంధ్రప్రదేశ్‌లో అంతర్భాగమయ్యాయన్నారు. రాముల వారు తెలంగాణలో ఉంటే వారి భూములు పురుషోత్త పట్నంలో ఉండడంతో అవి కబ్జాకు గురవుతున్నాయని పేర్కొన్నారు. ఆ ఐదు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనీ, విద్య, వైద్యం కోసం వందల కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. రాముల వారి భూములను పరిరక్షించాలనీ, ఆ ఐదు గ్రామాలను తెలంగాణలో విలీనం చేయాలని చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు.

## ఇజ్రాయిల్ దాడుల్లో మరో 55 మంది మృతి

**గాజా :** ఇజ్రాయిల్ నరమేధానికి మరో 55 మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారు. గురువారం తెల్లవారు జాము నుండి ఇజ్రాయిల్ దళాలు గాజాపై వైమానిక, భూతల దాడులకు పాల్పడ్డాయని వైద్య వర్గాలు తెలిపాయి. ఈ దాడులను ఐక్యరాజ్యసమితి తీవ్రంగా విమర్శించింది. ఇజ్రాయిల్ ఇంధనాన్ని నిలిపివేయడం వల్ల విద్యుత్ సరఫరా ఆగిపోయి ఆసుపత్రుల్లో రోగులు చనిపోతున్నారని వైద్యులు ఆందోళన వ్యక్తం చేశారు.

## అమెరికా ఆంక్షలతో క్యూబా కుదేలు

- 63 ఏళ్ల సుదీర్ఘ నిర్బంధం
- సంఖ్యలు చెబుతున్న వాస్తవాలు

**హవానా :** క్యూబా దశాబ్దాలుగా అమెరికా ఆర్థిక నిర్బంధాన్ని ఎదుర్కొంటోంది. అగ్రరాజ్యం అనుసరిస్తున్న దుర్మార్గపు విధానాలు, ఆంక్షల ఫలితంగా క్యూబా ప్రజల జీవితాలు కుదేలవుతున్నాయి. అక్కడి ప్రజలు అనేక కష్టాలు ఎదుర్కొంటున్నారు. ఆహారం, మందులు, ఇంధనం, విద్య, వైద్యం వంటి ప్రాథమిక అవసరాలు తీరని పరిస్థితి. ఇంధన సంక్షోభం వల్ల క్యూబాలో రోజుకు 6 నుండి 8 గంటల విద్యుత్ కోత ఉంటోంది. రవాణా వ్యవస్థ దెబ్బతిని, బస్సులు, ట్రక్కులు తగ్గినందున ప్రజలు సైకిళ్లపై ఆధారపడుతున్నారు. క్యూబా ఇతర దేశాలతో వ్యాపారం చేయడానికి బ్యాంక్‌ల నుండి అవరోధాలున్నాయి . క్యూబా ఓడలు అమెరికా

చీకటిలో క్యూబావాసులు

**ఆంక్షల నష్టం సంఖ్యల్లో ఇలా...**

- 25 రోజుల ఆర్థిక ఆంక్షల నష్టంతో (339 మిలియన్ డాలర్లు) దేశంలో ఒక సంవత్సరానికి అవసరమైన ప్రాథమిక ఔషధాలను క్యూబన్ ప్రజలందరికి అందించవచ్చు.
- 9 రోజుల ఆంక్షల నష్టం వైద్యానికి అవసరమైన పత్తి, గాజు, సిరంజీలు, సూదులు, కుట్టులు, కాథెటర్లు , సీరం పరికరాల దిగుమతి మొత్తానికి (129 మిలియన్ డాలర్లు) సమానం.
- 21 గంటల ఆంక్షల నష్టంతో దేశవ్యాప్తంగా ఒక సంవత్సరానికి ఇన్సులిన్‌ను అందించేందుకు (12 మిలియన్ డాలర్లు) సరిపోతాయి..
- 18 రోజుల ఆంక్షల నష్టంతో (250 మిలియన్ డాలర్లు) జాతీయ విద్యుత్ వ్యవస్థను సంవత్సరం పాటు నిర్వహించవచ్చు.
- 4 నెలల ఆంక్షల నష్టంతో (1.6 బిలియన్ డాలర్లు) దేశ ప్రజలకు ఏడాది పాటు నిత్యావసర వస్తువులను పంపిణీని చేయొచ్చు.
- 38 గంటల ఆంక్షల నష్టంతో దేశంలోని విద్యా వ్యవస్థ అవసరమైన అధ్యయన సామగ్రి సేకరణ ధరకు (21,789,000 డాలర్లు) సమానం.
- 8 గంటలపాటు ఆంక్షలు ఆగితే 45 లక్షల డాలర్లు నష్టం మిగులుతుంది. దీంతో క్యూబాలోని అన్ని కిండర్‌గార్డెన్‌లకు బొమ్మలు , బోధనా సామాగ్రిని సమకూర్చవచ్చు.
- క్యూబా 30 నిమిషాలకు 256,363 డాలర్లు నష్టపోతుంది. ఇది దేశంలోని విద్యా వ్యవస్థ అవసరమైన విద్యుత్, సాంప్రదాయ వీల్‌చైర్ల ఖర్చుకు సరిపోతుంది.
- 44 గంటల ఆంక్షల నష్టంతో (25,200,000 డాలర్లు) దేశంలోని విద్యా కేంద్రాలన్నింటికి కంప్యూటర్లను సమకూర్చవచ్చు .
- 15 నిమిషాల ఆంక్షల నష్టంతో (144,000 డాలర్లు) సరిగ్గా మాటలు వినిపించని పిల్లలకు, యువకులకి వినికిడి యంత్రాలను అందచేయవచ్చు .
- మూడు రోజుల ఆంక్షల నష్టంతో (40 మిలియన్ డాలర్లు) దేశంలోని ప్రజా రవాణా వ్యవస్థను ఏడాది పాటు నిర్వహణ చేయవచ్చు.
- తొమ్మిది నెలల ఆంక్షల నష్టంతో (3,893 మిలియన్ డాలర్లు) క్యూబాలో పేదలందరికి కొత్తగా ఇళ్లు నిర్మించవచ్చు.

ఓడరేవులకు వెళ్లడానికి అనుమతి లేదు. వ్యవసాయానికి ఎరువులు, యంత్రాలు లేక పంటల దిగుబడి తగ్గిపోయింది. అమెరికా ఆంక్షలు 1962 నుండి కొనసాగుతున్నాయి. ప్రపంచంలో ఏదేశం పైనా ఇలాంటి దీర్ఘకాలిక ఆంక్షలు లేవు. ఐక్యరాజ్య సమితి (యుఎన్) పలు మార్లు నిరసించింది. అనేక దేశాలు ఖండించినా... అమెరికా తన దుష్టవిధానాలను ఉపసంహరించుకోవడం లేదు.

## నిర్వాసితుల పేరుతో 'భూ' కుంభకోణం

(మొదటిపేజీ తరువాయి)

పోలవరం నిర్వాసితుల కోసం భూసేకరణ జరిగిందని, అప్పట్లో వెయ్యి ఎకరాల మిగులు భూములు తేలాయని, వాటిని నిర్వాసితులకు ఇవ్వకుండా కౌలుకు ఇచ్చి ప్రజాప్రతినిధులు లబ్ధి పొందుతున్నారని ఆరోపించారు. ఈ భూముల సంగతేంటో వెంటనే నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీలో జనసేన ఎమ్మెల్యే ఉన్నారని, పవన్‌కల్యాణ్ వెంటనే జోక్యం చేసుకుని గిరిజనులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. జెండాలు పాతిన భూముల్లో వెంటనే పంటలు వేయాలని, పట్టాలు సాధించే వరకూ పోరాటం చేయాలని గిరిజనులకు పిలుపునిచ్చారు. ఎల్‌టిఆర్ భూములను పేదలకు పంచి పట్టాలు ఇవ్వాలని కోరారు. ఏజెన్సీలో సమస్యలపై వార్తలు రాస్తున్న విలేకరులపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులు పెట్టి వేధించడం ఏ విధంగా సమంజసమని ప్రశ్నించారు. 30 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న గిరిజనుల భూములను తూర్పుగోదావరి జిల్లా పోలవరం నిర్వాసితులకు ఇస్తామంటూ సేకరణకు దిగడం దారుణమన్నారు. దీనిపై అంతా కలిసి పోరాడాలని, అవసరమైతే న్యాయ పోరాటం చేస్తామని తెలిపారు. రెడ్డిగణపవరంలో గిరిజనుల ఆధ్వర్యంలో సాగువుతున్న ఒక ప్రాంతంలో 16 ఎకరాలు, మరో ప్రాంతంలోని తొమ్మిది ఎకరాల భూములను ఆయన పరిశీలించి జెండాలు పాతారు. రికార్డులు పరిశీలించకుండా, గ్రామసభలు నిర్వహించకుండా భూములు కేటాయించడం తగదన్నారు. ఇనుమూరు గ్రామంలో గిరిజనులు పోరాడి సాధించుకున్న 70 ఎకరాల భూములను ఆయన పరిశీలించి జెండాలు పాతారు. రౌడీషీట్లు తెరుస్తామంటూ గిరిజనులను పోలీసులు బెదిరించడంపై ఆయన ఆగ్రహించారు. గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు అశోక్ మాట్లాడుతూ.. ఏజెన్సీలో భూములు లాక్కోవాలని చూస్తున్నారని, దీనిపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, ఎర్రజెండా ఎప్పుడూ ప్రజలకు అండగా ఉంటుందని చెప్పారు. అనంతరం సిపిఎం బృందం బుట్టాయగూడెం మండలంలో నిలిచిపోయిన ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి భవనాలను పరిశీ లించింది. అటు తర్వాత పోలవరం ప్రాజెక్టును సందర్శించింది. పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో సిపిఎం బృందం పర్యటించింది. తొలుత వ్యూ పాయింట్ నుంచి పోలవరం ప్రాజెక్టును పరిశీలించారు. ప్రాజెక్టులో జరుగుతున్న పనుల వివరాలను బృందానికి ప్రాజెక్ట్ ఎఇఇ చిరంజీవి వివరించారు. ప్రాజెక్టు స్పిల్‌వే వద్దకు చేరుకుని ఎగువ కాఫర్ డ్యామ్ నుండి డయాఫ్రం వాల్ పనులను పరిశీలించారు. అనంతరం అల్లూరి సీతారామరాజు జిల్లాకు చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం, రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం, రాష్ట్ర కమిటీ సభ్యులు మొడియం నాగమణి జిల్లా కార్యదర్శి ఎ.రవి, నేతలు తెల్లం రామకృష్ణ, తెల్లం దుర్గారావు, ఎం.జీవరత్నం తదితరులు పాల్గొన్నారు.

## నాలెడ్జ్ ఎకానమీదే భవిష్యత్తు

(మొదటిపేజీ తరువాయి)

కోటి మొక్కలు నాటాలని డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ విసిరిన సవాలును తాను స్వీకరిస్తున్నా... విద్యాశాఖ ద్వారానే కోటి మొక్కలు నాటుతాం అని తెలిపారు. సమావేశం అనంతరం సిఎం, మంత్రి లోకేష్ పుట్టపర్తికి చేరుకున్నారు. కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో కలిసి సత్యసాయి మహాసమాధిని చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్ సందర్శించారు. సత్యసాయి ట్రస్ట్ సభ్యులు, అధికారులతో సిఎం సమావేశమయ్యారు. సత్యసాయి ట్రస్ట్, ప్రభుత్వం సంయుక్తంగా శత జయంతి వేడుకలను విజయవంతం చేద్దామని చెప్పారు. ట్రస్ట్‌కు రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన సహకారం అందిస్తుందని చెప్పారు.

## బీహార్‌లో 'ఎస్ఐఆర్' ఇప్పుడే ఎందుకు?

(మొదటిపేజీ తరువాయి)

ఏడాది సమయం తీసుకుంటున్నప్పుడు ఇసి డెడ్‌లైన్ కేవలం 30రోజులే ఎందుకు పెట్టారని ప్రశ్నించారు. 'ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఒక వ్యక్తి తన ఓటును కోల్పోతే ఇక అడిగేందుకు సమయం వుండదు, ఓటర్ల జాబితా ఖరారైన తర్వాత ఇక న్యాయస్థానాలు కలగచేసుకోవు' అని అన్నారు. ఇలాంటి సందేహాల కారణంగా ఈ ప్రక్రియను నిలుపుచేయవద్దని రాకేష్ ద్వివేది కోరారు. గత దశాబ్ద కాలంలో 70లక్షల మంది బీహార్ నుండి వలస వెళ్లారని, అందుకోసమే ఎస్ఐఆర్ చేపట్టాల్సి వచ్చిందని పేర్కొన్నారు. లక్షమందికి పైగా అధికారులు, వలంటీర్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఇలా అందరూ ఇంటింటికి తిరిగి సర్వే చేస్తున్నారని, ఇదొక బృహత్తరమైన ప్రక్రియ అని చెప్పారు.

**'పౌరసత్వం'పై పరిశీలన ఎందుకు?**

'బీహార్ ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణలోకి పౌరసత్వం అంశాన్ని ఎందుకు తీసుకుపోతున్నారు? అది కేంద్ర హోం మంత్రిత్వ శాఖ పరిధిలోని విషయం కదా' అని సుప్రీంకోర్టు బెంచ్ కేంద్ర ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించింది. 'ఒకవేళ బీహార్ ఎన్నికల జాబితా ఎస్ఐఆర్ ప్రక్రియలో పౌరసత్వాన్ని పరిశీలించాలని మీరు అనుకుంటే ముందుగానే ఆ పని చేసి ఉండాల్సింది. ఇప్పుడు ఆలస్యం జరిగిపోయింది' అని తెలిపింది. దీనిపై ఎన్నికల కమిషన్ స్పందిస్తూ రాజ్యాంగంలోని 326వ అధికరణ ప్రకారం ఓటరుగా అర్హత పొందాలంటే పౌరసత్వాన్ని పరిశీలించాల్సి ఉంటుందని పేర్కొంది.

## పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు

- గంభీర బ్రిడ్జి ప్రమాదంపై స్థానికులు
- 16కి పెరిగిన మృతులు

**గుజరాత్ :** గుజరాత్‌లో 16 మంది మృతికి కారణమైన వడోదర సమీపంలోని గంభీర వంతెన ప్రమాదకరమని ఎప్పటినుంచో స్థానికులు హెచ్చరిస్తూనే ఉన్నారు. పలుమార్లు ఫిర్యాదు చేసినా ఆర్అండ్‌బి అధికారులు పట్టించుకోలేదని, ఫలితంగా ఇంతటి భారీ ప్రమాదం సంభవించిందని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా దీని నాణ్యతకు సంబంధించి గతంలో స్థానికులు, ప్రజాప్రతినిధులు చేసిన ఫిర్యాదులు ఇప్పుడు వెలుగులోకి వచ్చాయి. ఈ వంతెనను 1986లో నిర్మించారు. కొన్నేళ్లక్రితం వడోదర జిల్లా పంచాయత్ సభ్యుడు హర్షద్‌సిన్హా పర్మార్ ఆర్అండ్‌బి శాఖకు ఓ లేఖ రాశారు. గంభీర బ్రిడ్జి ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిందని అందులో హెచ్చరించారు. ఈ వంతెనపై ప్రయాణం సురక్షితం కాదని ప్రకటించాలంటూ 2022 ఆగస్టులో ఆయన డిమాండ్ చేశారు. దానిపై వాహనాల రాకపోకలు సాగకుండా మూసివేయాలని డిమాండ్ చేశారు. అంతేకాదు.. ఆ ప్రాంతంలో మరో వంతెన నిర్మాణం చేపట్టాలని కోరారు. ఇక అక్టోబర్ 2022లో మోర్బి వంతెన కూలిన తర్వాత కూడా పర్మార్ మరోసారి జిల్లా కలెక్టరేట్‌కు అభ్యర్థన పంపారు.

తాజాగా పర్మార్ ఓ ఆంగ్ల పత్రికతో మాట్లాడుతూ "వంతెన పిల్లర్లలో ప్రకంపనలు వచ్చేవి. ఈ నిర్మాణం పరిస్థితిపై ఇంజినీర్లు ఇచ్చిన నివేదికను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశాను. ఆ వంతెన కూలుతుందని అధికారులకు తెలుసు. కానీ, ఎవరూ చర్యలు తీసుకోలేదు" అని పేర్కొన్నారు.

ఇక ఆర్‌టిఐ యాక్టివిస్ట్ లఖన్ దర్బార్ మాట్లాడుతూ.. 2022లో ఆర్అండ్‌బి డిపార్ట్‌మెంట్ ఈ వంతెన వాడకానికి పనికిరాదని తేల్చిందన్నారు. 'ఈ బ్రిడ్జ్ సురక్షితం కాదు. టెస్టింగ్ రిపోర్ట్ ప్రతికూలంగా వచ్చింది. అయితే మేము ఎంత డిమాండ్ చేసినా ఆ నివేదికను బహిర్గతం చేయలేదు. మూడేళ్లుగా బ్రిడ్జ్‌ను వాడుతూనే ఉన్నారు' అని పేర్కొన్నారు.

ఇక ఆర్అండ్‌బి శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎన్ఎం.నాయకవాల స్పందిస్తూ తమ డిపార్ట్‌మెంట్ నివేదికలో గంభీర వంతెనలో ఎటువంటి లోపాలనూ గుర్తించలేదన్నారు. బేరింగ్‌లో సమస్యలుంటే గతేడాది వాటిని సరిచేసినట్లు చెప్పారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ ప్రమాదంపై తీవ్రంగానే స్పందించింది. సంబంధిత అధికారులను దీనిపై వివరణ కోరినట్లు ప్రభుత్వ ప్రతినిధి రిషికేశ్‌పటేల్ పేర్కొన్నారు. మంత్రివర్గంలో ఈ అంశంపై చర్చించినట్లు తెలిపారు.

## తీవ్ర సంక్షోభంలో ఉన్నత విద్యా రంగం

- బిజి.దేశ్‌ముఖ్ స్మారకోపన్యాసంలో ప్రొఫెసర్ దీపక్ నాయర్



**న్యూఢిల్లీ :** భారతదేశంలో ఉన్నత విద్యా రంగంలో తీవ్ర సంక్షోభం నెలకొందని ప్రముఖ విద్యావేత్త, మాజీ ముఖ్య ఆర్థిక సలహాదారు దీపక్ నాయర్ వ్యాఖ్యానించారు. ఈ సంక్షోభానికి నరేంద్ర మోడీ ప్రభుత్వానిదే బాధ్యత అని విమర్శించారు. 2014 నుండి విశ్వవిద్యాలయాల్లో రాజకీయ జోక్యం, ప్రభుత్వ ప్రమేయం పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. 2019 నుండి ఈ పరిస్థితి మరింత ఉధృతమైందన్నారు.

**"భారతదేశంలోని ఉన్నత విద్యా రంగంలో సంక్షోభం :** కల్లోపరుస్తున్న వర్తమానం, ఆందోళన కలిగిస్తున్న భవిష్యత్" అనే అంశంపై బుధవారం ఆయన బిజిదేశ్‌ముఖ్ స్మారకోపన్యాసం చేశారు. విద్యార్థులకు తగిన అవకాశాలు వుండడం లేదని, ఉన్న విద్యా సంస్థలు కూడా ప్రమాణాలకు తగిన రీతిలో పనిచేయడం లేదని దీపక్‌నాయర్ విమర్శించారు. కొన్ని విద్యా సంస్థలు సగటు సామర్థ్యాలు వున్న విద్యార్థులకు కూడా ఉపయోగపడే రీతిలో వుండడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. విద్య, పరిశోధనా రంగాల్లో నాణ్యత బాగా క్షీణించిపోయిందన్నారు. విశ్వవిద్యాలయాలపై రాజకీయ నియంత్రణ పెరిగిపోతోందని అన్నారు. నిధులకు సంబంధించిన నిర్ణయాల దగ్గర నుండి ఫ్యాకల్టీ నియామకాల వరకు అంతా రాజకీయ నేతల ప్రమేయంతోనే సాగుతోందన్నారు. దీనివల్ల విశ్వవిద్యాలయాల స్వయంప్రతిపత్తి తుడిచిపెట్టుకుపోతోందని అన్నారు. యూనివర్శిటీల్లో, అండర్ గ్రాడ్యుయేట్ కాలేజీల్లో ఫ్యాకల్టీ నియామకాలు ప్రధానంగా ఆర్ఎస్ఎస్ సిద్ధాంత భావజాలానికి అనుగుణంగా జరుగుతున్నాయని విమర్శించారు. ప్రతిభ, నైపుణ్యాల కన్నా కేవలం రాజకీయాలకే బిజెపి ప్రాధాన్యతనిస్తోందని ప్రొఫెసర్ నాయర్ విమర్శించారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) కింద అడ్మిషన్ల ప్రక్రియలు కేంద్రీకృతమవడాన్ని ఆయన విమర్శించారు. ఎన్‌టిఎకు పారదర్శకత, జవాబుదారీతనం లేకుండా పోతోందని అన్నారు.

## చెప్పుడు మాటలు

**రా**మాపురం ఊరిలో సిరి, సీత అనే ఇద్దరు స్నేహతురాళ్ళు ఉన్నారు. ఒక రోజు వారి దగ్గరకు భవాని వచ్చి 'నేను మీతో స్నేహం చెయ్యవచ్చునా' అంది. 'సరే' అని ఇద్దరూ ఒప్పుకున్నారు. కొన్ని రోజులు అయింది. ఒక రోజు భవానికి వీరి మీద కోపం వచ్చింది. వీరిద్దరిని విడకొట్టాలనుకున్నది. అనుకున్నదే తడవు సిరి దగ్గరకు వెళ్ళి సీత గురించి చాడీలు చెప్పింది. మరో రోజు సీత దగ్గరికి వెళ్ళి 'సిరి తిట్టింద'ని అబద్ధం చెప్పింది.

భవాని మాటలు విన్న సీత, సిరి ఒకరినొకరు మాట్లాడుకోవడం మానుకున్నారు. కొన్ని రోజుల తర్వాత సుజాత టీచర్ గమనించి సీత, సిరిని పిలిచి అడిగారు.

'సీత నన్ను తిట్టింది' అని సిరి చెప్పింది. 'సిరి నన్ను తిట్టింది' అని సీత చెప్పింది. 'మీకు ఎవరు చెప్పారు' అని టీచర్ అడిగారు. ఇద్దరూ ఒకేసారి 'భవాని చెప్పింది' అన్నారు. ఆ క్షణం సిరి, సీత ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. భవానీనే ఇద్దరికి చెప్పిందని వారికి అర్థమైంది. మాస్టారు భవానిని పిలిచి అడిగారు.

'ఊరికే అబద్ధం చెప్పాను' అని చాలా ఉదాసీనంగా భవాని చెప్పింది. భవానీ ప్రవర్తనకి సీత, సిరికి చాలా కోపం వచ్చింది. చెప్పుడు మాటలు విని తమ స్నేహాన్ని వదులుకున్నామని బాధపడ్డారు. టీచర్ మందలించడంతో భవాని ఇద్దరికీ క్షమాపణ చెప్పింది. ఆ రోజు నుంచి ముగ్గురూ కలిసి మెలిసి ఉన్నారు.

**- వంగపల్లి హిమబిందు,**
**7వ తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,**
**అనంతసాగర్, సిద్దిపేట జిల్లా.**

## కృష్ణా తరంగాలు

**పు**ట్టింది పడమటి కనుమలు
మహాబలేశ్వరంలో జాడలు
బిరబిరా కృష్ణమ్మ పరుగులు
తడిపెను తీరప్రజల గొంతులు

తుంగభద్ర హొయల నడకలు
భీమా, మూసీ ఉరకలు
కోయినా ఘాట్ ప్రభ జలాలు
కృష్ణలో కలగలిసి వరదలు

కృష్ణవేణి తరంగాలు
జీవకోటి ప్రసాదాలు
ప్రాణము నిలుపు అమృతాలు

అవి మన పాలిట వరాలు

శ్రీశైల నికర జలాలు
సీమ బతుకు తెరువులు
విద్యుత్ జనకాలు

తెలుగు వారికి ప్రాణాలు

నాగార్జున సాగర్ నీటి నిల్వలు
పంటపొలాలకు ఆయువులు
కళకళలాడే వరి పంటలు
ఆకలి తీర్చే ఆహార ధాన్యాలు

భూగర్భ జలాలు పెంచే ప్రవాహాలు
తీరమంత పచ్చని అందాలు
పేదరికము బాపే నడకలు
కృష్ణా జలాలకు వందనాలు

**- ఆవుల చక్రపాణి యాదవ్,**
**99633 50973.**

## నేను గీసిన బొమ్మ

**వి. శైలి ప్రణన్య,**
**6వ తరగతి,**
**కమల కాన్సెప్ట్ స్కూలు,**
**మార్కాపురం, ప్రకాశం జిల్లా.**

**పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com**

# పెంపుడు జంతువులతో జాగ్రత్త ..!

**చాలాకాలంగా మనిషికి తోడుగా, సహాయంగా మెలగిన జంతు నేస్తం కుక్కే. సాధు జంతువులను పెంచుకోవటం అందరూ చేసే పనే. వాటి మీద కొందరు విపరీతమైన ప్రేమ కురిపిస్తారు. మరికొందరైతే పెంపుడు జంతువులే తమ ప్రాణంగా భావిస్తారు. పెంపుడు జంతువుల్లో కుక్కపిల్లలు ముందుంటాయి. చాలామందికి కుక్క పిల్లలు ఇంట్లో ఉంటే మరో వ్యక్తి ఉన్నంత భావన కలుగుతుంది. అవసరాలు, మమకారం, రక్షణ, కాలక్షేపం, హోదాకు చిహ్నంగా భావించటం తదితర కారణాలతో చాలామంది జీవితాల్లో పెంపుడు జంతువులు భాగమయ్యాయి. అంతవరకూ బాగానే ఉంది. పెంపుడు జంతువుల నుంచి మనుషులు కొన్ని వ్యాధులు సంక్రమిస్తుంటాయి. వాటి పట్ల మాత్రం అప్రమత్తంగా ఉండాలి. వర్షాకాలంలో అవి మరింత విజృంభించే అవకాశం ఉంది.**

**నే**డు చాలామందికి జంతువుల పెంపకం, వాటి బాగోగులు చూసుకోవటం చాలా చక్కని వ్యాపకం. అక్వేరియంలో చేపలు కావొచ్చు. కుక్క, పిల్లి, రామచిలుక ... ఏదైనా సరే. పెంపుడు జీవులతో గడిపితే మానసిక ప్రశాంతత చేకూరుతుందని చాలామంది భావిస్తారు. ఉదయాన్నే పెంపుడు కుక్కతో కలిసి వాకింగ్ చేస్తుంటే- అవదుబాట్లో స్నేహితులు లేరని, ఉద్యోగం తర్వాత ఒంటరిగా అయ్యామని మనసులో కలిగే భావన దూరమవుతుందని కొందరు భావిస్తుంటారు. అచ్చం పిల్లల్లాగా యజమాని వెంటే ఉంటూ, తిరుగుతూ, కాళ్లకు అడ్డం పడుతూ, తోడుగా ఉంటూ పెంపుడు కుక్కలు తమ యజమానులకు అండగా ఉంటాయి.

మూగ జీవాల పెంపకంలో అవగాహనతోపాటుగా అప్రమత్తత ఎంతో అవసరం. మనం ఎంతో అభిమానంగా పెంచుకునే కుక్కల నుంచి ర్యాబిస్, గజ్జి; పశువులు, గొర్రెలు, మేకలు వంటి గడ్డి తినే జంతువుల నుంచి ఆంత్రాక్స్ వంటి ప్రాణాంతక వ్యాధులు మనుషులకు సోకుతాయి. ఈ సంక్రమిత వ్యాధులను 'జూనోసిస్ డిసీజెస్' అంటారు. మరీ ముఖ్యంగా వీధి కుక్కల నుంచి ర్యాబిస్ వేగంగా వ్యాపించి ప్రాణాంతకంగా మారుతుంది. పశువుల నుంచి మనుషులకు తరచుగా వచ్చే మరో వ్యాధి ఆంత్రాక్స్. దీన్ని 'దొమ్మరోగం' అని కూడా అంటారు. మనుషుల్లో చర్మంతోపాటు పేగులు, ఊపిరితిత్తులకు సోకే ఈ వ్యాధి అత్యంత ప్రమాదకరం. వీటిని నాడీ సంబంధిత సంక్రమిత వ్యాధులుగా పరిగణిస్తారు. పశువులు, గొర్రెలు, మేకలు, గాడిదలు, గుర్రాల్లో ఆంత్రాక్స్ చాలా వేగంగా విస్తరిస్తుంది. ఈ వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే పశు వైద్యాధికారులను సంప్రదించి చికిత్స చేయించుకోవాలి.

జంతువులు, పక్షులవల్ల వైరస్, బ్యాక్టీరియా, పరాన్నజీవులు పరిసరాల్లోకి వ్యాపించి మానవుల్లో వ్యాధులకు కారణమవుతాయి. ఇటీవల కుక్కలను పెంచటం ఎక్కువైంది. పట్టణాల్లో ఇంటి వసారాలు చిన్నగా ఉంటాయి. కాబట్టి పెంపుడు జంతువులున్నపుడు ఇంటి పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలి. కుక్కలను ఉంచే గదులు, కట్టివేసే ప్రాంతాలను కూడా శుభ్రంగా ఉంచాలి.

**పిల్లలకు ఎక్కువగా ముప్పు**

వైద్యుల అంచనాల ప్రకారం జంతువుల నుంచి మనుషులకు దాదాపుగా 200 రకాల వ్యాధులు సోకుతాయి. పెంపుడు జంతువుల వల్ల అందరికీ వ్యాధులు సోకే అవకాశముండగా పిల్లలకు ఈ ముప్పు ఎక్కువగా ఉంటుంది. కరోనా వైరస్ గబ్బిలాల నుంచి వ్యాపించినట్లు పేర్కొన్నా పూర్తిస్థాయి నిర్ధారణ జరగలేదు. పందుల ద్వారా మెదడువాపు వ్యాధి, కుక్కల ద్వారా రేబిస్, గొర్రెలు, మేకల ద్వారా ఆంత్రాక్స్, ఆవులు, గేదెల ద్వారా క్షయ, పాలద్వారా బ్రూసెల్లోసిస్ వ్యాపిస్తాయి. బ్రూసెల్లోసిస్ వల్ల కీళ్లనొప్పులు, జ్వరం, తద్వారా వంధత్వం సంక్రమించవచ్చు. పక్షుల వల్ల సిటాకోసిస్, ఎలుకలతో ప్లేగు, పిల్లుల ద్వారా పాగ్సోప్లాస్మోక్రాండై, కోళ్ల ద్వారా బర్డ్‌ఫ్లూ, కుందేళ్ల ద్వారా టాక్సోప్లాస్మోసిస్, కోతుల ద్వారా లెప్రసీ, ఇతరత్రా జంతువులు, పక్షుల ద్వారా చర్మ, శ్వాస సంబంధిత వ్యాధులు మనుషులకు వ్యాపిస్తాయి. వ్యాధులు సోకిన కోళ్లు, గొర్రెలు, జంతువులు, పశువుల మాంసం తిన్నా కూడా మనుషులకు వ్యాధులు వ్యాపిస్తాయి. కుక్కలు తదితరాల మలమూత్రాల వల్ల కూడా వ్యాధులు మనకు సంక్రమిస్తాయి. కుక్కలు, పిల్లులను ఒడిలో, సోఫాల్లో, మంచాల్లో కూర్చుండబెట్టినపుడు దుస్తుల ద్వారా బ్యాక్టీరియా, వైరస్ వ్యాపించవొచ్చు. అన్ని వ్యాధుల్లోనూ రేబిస్ అత్యంత ప్రమాదకరం కాబట్టి పిచ్చికుక్కలు మనుషులను, గేదెలను కరవటం పరిపాటిగా మారగా వీటిని నిర్మూలించేలా, వీధికుక్కలకు సైతం వ్యాక్సినేషన్ చేయాలి. మనదేశంలో ఏటా 30 వేల మంది రేబిస్‌తో చనిపోతున్నారు. ఈ వ్యాధి వ్యాపించటానికి కుక్కలే ప్రధాన కారణం. గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా టీకాలు పూర్తిగా అందుబాటులోకి మరణాలను కొంతమేరకు తగ్గించొచ్చునని డాక్టర్లు పేర్కొంటున్నారు.

### ఈ జాగ్రత్తలు మేలు

- పిల్లలు కుక్కలతో ఆడుకున్న వెంటనే స్నానం చేయించాలి.
- చేతులను శుభ్రంగా కడగాలి.
- జంతువులు తిన్న ఆహార పదార్థాలను చిన్న పిల్లలు తినకుండా చూడాలి. జంతువులను ముట్టుకున్న తర్వాత చేతులను నోట్లో పెట్టుకోకుండా చూడాలి.
- మనం తినే పదార్థాలను కుక్కలు, పిల్లులు తినకుండా చూడాలి.
- మనం తినే పళ్లేల్లోనూ అవి మూతి పెట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- పెంపుడు కుక్కలకు ప్రతి 6 మాసాలకోసారి తప్పనిసరిగా టీకాలను వేయించాలి.
- జబ్బుపడిన పశువుల పాలను సేవించకూడదు.
- పాలను తప్పనిసరిగా మరిగించాకే వినియోగించాలి.

### ప్రతిరోజూ 50 మూగ జీవాలకు ఆహారం

**మ**నం ప్రేమ చూపిస్తే మూగ జీవాలు కూడా మనతో అనుబంధంగా ఉంటాయి. గత 20 సంవత్సరాలుగా ప్రతిరోజూ 50 వీధికుక్కలకు ఆహారాన్ని వండించి అందజేస్తున్నా. కుక్కలు అనారోగ్యంతో ఉన్నా, ప్రమాదాలకు గురైనా సాధ్యమైనంతవరకూ పశువుల ఆసుపత్రులకు తీసుకెళ్లి వైద్యం చేయటానికి కృషిచేస్తున్నా. వీటితోపాటుగా పిల్లులు, పక్షులకు సైతం ఆహారాన్ని అందించేందుకు నా వంతుగా కృషిచేస్తున్నా.

**- హనుమంతు తమ్మారావు,**
**జంతు ప్రేమికుడు,**
**పాలకొండ మండలం, పార్వతీపురం మన్యం జిల్లా.**

## అక్టోబరు 31న 'బాహుబలి -ది ఎపిక్'

**ప్ర**భాస్ హీరోగా రాజమౌళి దర్శకత్వంలో రూపొందిన 'బాహుబలి' మూవీ రెండు భాగాలుగా విడుదలై, ప్రపంచవ్యాప్తంగా భారీ వసూళ్లను రాబట్టిన సంగతి తెలిసిందే. ఈ చిత్రం విడుదలై జులై 10 (గురువారాని)కి పదేళ్ల పూర్తయ్యింది. ఈ సందర్భంగా దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి సోషల్ మీడియాలో ఓ పోస్ట్ పెట్టారు. 'బాహుబలి.. ఎన్నో ప్రయాణాలకు నాంది. మరెన్నో మధుర జ్ఞాపకాలు. ఎంతో మందికి స్ఫూర్తి' అని పేర్కొన్నారు. అలాగే మరో విషయం గురించి కూడా రాశారు. 'బాహుబలి'.. సినిమా విడుదలై పదేళ్ల పూర్తయింది. రెండు భాగాలుగా అలరించిన బాహుబలి ఇప్పుడు ఒకే పార్ట్‌గా మీ ముందుకు వచ్చేందుకు సిద్ధమైంది. 'బాహుబలి: ది ఎపిక్ పేరుతో ఇది రిలీజ్ కానుంది. ప్రపంచవ్యాప్తంగా అక్టోబర్ 31న ప్రేక్షకుల ముందుకు రానుంది' అని పోస్ట్ పెట్టారు. తాజా పోస్టు ప్రకారం ఈ చిత్రం తెలుగు, హిందీ, తమిళ, మలయాళ భాషల్లో ఇది విడుదల కానుంది. ఈ స్పెషల్ సందర్భాన్ని పురస్కరించుకుని చిత్రబృందం 'బాహుబలి- ది ఎపిక్' అనే కొత్త టైటిల్‌తో ఈ చిత్రానికి సంబంధించి పోస్టర్‌ని కూడా విడుదల చేశారు.




## ధనుష్ కొత్త సినిమా ప్రారంభం

**త**మిళ కథానాయకుడు ధనుష్ మరో కొత్త సినిమాలో నటిస్తున్నారు. ఆయన నటించిన 'కుబేర' సినిమా ఇటీవల విడుదలై మంచి విజయాన్ని అందుకుంది. తన కెరీర్‌లో 54వ (డి-54) సినిమాగా ఈ చిత్రం తెరకెక్కనుంది. ఇక దీనికి దర్శకుడు విగ్నేష్ రాజా దర్శకత్వం వహిస్తున్నారు. వేల్స్ ఫిల్మ్ ఎంటర్‌టైన్మెంట్, థింక్ స్టూడియోస్ సంస్థలు నిర్మిస్తున్నాయి. జివి ప్రకాష్ సంగీతం. తాజాగా ఈ చిత్రం నుంచి ఓ ఇంట్రెస్టింగ్ పోస్టర్‌ను మేకర్లు విడుదల చేశారు. 'కొన్నిసార్లు ప్రమాదకరంగా ఉండటమే బతకడానికి ఏకైక మార్గం. డి-54లో ధనుష్ ఈరోజు నుంచి షూటింగ్‌లో పాల్గొంటారు' అని రాసుకొచ్చారు. పోస్టర్‌ను గమనిస్తే ధనుష్ నిలబడి దిగాలుగా ఉండగా, పత్తి పంట కాలిపోతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. ఈ సినిమాలో ధనుష్ ఒక రైతుగా కనిపిస్తాడని అంటున్నారు.

## 'సార్ మేడమ్' టీజర్ విడుదల

**వి**లక్షణ నటుడు విజయ్ సేతుపతి, నటి నిత్యా మేనన్ జంటగా నటించిన చిత్రం 'తలైవాన్ తలైవి'కి పాండిరాజ్ దర్శకత్వం వహించారు. ఈ సినిమా తెలుగులో 'సార్ మేడమ్' పేరుతో విడుదల కానుంది. తాజాగా దీని టైటిల్ టీజర్‌ను విడుదల చేశారు. పోస్టర్‌లో ఓ మధ్య తరగతి కుటుంబంలోని భార్యాభర్తల పాత్రల్లో నిత్యా మేనన్, విజయ్ సేతుపతి ఎంతో సహజంగా కనిపించి ఆకట్టుకుంటున్నారు.

## 'కొత్తపల్లిలో ఒకప్పుడు' ట్రైలర్ విడుదల

**'కే**రాఫ్ కంచరపాలెం', 'ఉమా మహేశ్వర ఉగ్రరూపస్య' లాంటి చిత్రాలతో సూపర్ హిట్‌లను అందుకున్న నిర్మాత ప్రవీణ పరుచూరి దర్శకత్వంలో రాబోతున్న తాజా చిత్రం 'కొత్తపల్లిలో ఒకప్పుడు'. దగ్గుబాటి రానా ఈ సినిమాకు సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు. పరచూరి విజయ్ ప్రవీణ ఆర్ట్స్ బ్యానర్‌పై గోపాలకృష్ణ పరుచూరి, ప్రవీణ పరుచూరి నిర్మిస్తున్నారు. రూరల్ బ్యాక్‌డ్రాప్‌లో రాబోతున్న ఈ సినిమా జూలై 18న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి తాజాగా చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. కామెడీ బ్యాక్‌డ్రాప్‌లో రూరల్ థ్రిల్లర్‌గా ఈ మూవీ రాబోతున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాతో మనోజ్ చంద్ర, మోనిక టి, ఉషా బోనె వెండితెరకు పరిచయం అవుతున్నారు. రవీంద్ర విజయ్, బెనర్జీ, బొంగు సత్తి, ఫణి, ప్రేంసాగర్ తదితరులు కీలక పాత్రలో నటిస్తున్నారు.

## కార్తీ కొత్త చిత్రం 'మార్షల్'




**త**మిళ హీరో కార్తీ తన కెరీర్‌లో 29వ సినిమా చేస్తున్నారు. ఈ సినిమాకు 'మార్షల్' అనే టైటిల్‌ను ఫిక్స్ చేస్తూ చిత్రబృందం ఓ పోస్టర్‌ను విడుదల చేసింది. గురువారం చెన్నైలో ఈ సినిమా ప్రారంభమైంది. కోలీవుడ్ సూపర్ హిట్ సినిమా తనక్కారన్ డైరెక్ట్ చేసిన యంగ్ దర్శకుడు 'తమిళ్' ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. సాయి అభ్యంకర్ మ్యూజిక్ అందిస్తున్నారు. ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా భారీ బడ్జెట్‌తో నిర్మించాలని చిత్రబృందం ఆలోచిస్తోంది. ఈ సినిమా కథ రామేశ్వరం నేపథ్యంలో సాగనుందని చెబుతున్నారు. దీంతో మెజారిటీ పోర్షన్ సముద్రం లొకేషన్స్ షూట్ చేస్తారని సమాచారం.

## 8 నుంచి 'మోతేవరి లవ్‌స్టోరీ' స్ట్రీమింగ్

**అ**నిల్ జీలా, వర్షిణి రెడ్డి జున్నుతుల ప్రధాన పాత్రల్లో నటించిన తాజా వెబ్‌సిరీస్ 'మోతేవరి లవ్‌స్టోరీ'. ఈ సిరీస్‌ను శివ కృష్ణ బుర్రా రూపొందించారు. ఏడు ఎపిసోడ్స్‌గా తెరకెక్కిన ఈ విలేజ్ కామెడీ, లవ్ సిరీస్ ఆగస్ట్ 8 నుంచి జీ5లో స్ట్రీమింగ్ కానుంది. ఈ సిరీస్‌కు సంబంధించిన పోస్టర్‌ను మేకర్లు విడుదల చేశారు. నటుడు ఆనంద్ దేవరకొండ హాజరై పోస్టర్, టైటిల్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'మోతేవరి లవ్ స్టోరీ' అనే టైటిల్, పోస్టర్ చాలా కొత్తగా ఉందనీ, విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

## లార్డ్స్‌లో కనిపించని 'బజ్ బాల్'

- ఇంగ్లండ్ 253/4
- సెంచరీకి చేరువలో రూట్
- నితీశ్ కుమార్‌కు రెండు వికెట్లు

**లార్డ్స్:** టెస్టుల్లో ధాటిగా ఆడే ఇంగ్లండ్ జట్టు లార్డ్స్‌లో అందుకు విరుద్ధంగా ఆడింది. బజ్ బాల్‌కు పెట్టింది పేరైన ఇంగ్లండ్ జట్టు తొలిరోజు 83 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 251 పరుగులే చేసింది. 'బజ్ బాల్' అంటే 'టెస్టుల్లో ఇంగ్లండ్ దూకుడు పెంచింది' అని అర్థం. కానీ లార్డ్స్‌లో భారత్‌తో గురువారం ప్రారంభమైన మూడో టెస్ట్‌లో అదెక్కడా కనిపించలేదు. ఓవర్‌కు 4 నుంచి 5 పరుగులు చొప్పున రాబట్టే ఇంగ్లండ్ జట్టు లార్డ్స్ టెస్ట్‌లో రన్ రేటును మూడు పరుగులకే పరిమితం చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ జట్టు స్కోర్ 44పరుగులకు చేరేసరికి ఓపెనర్లు ఇద్దరూ ఔటయ్యారు. క్రాలే, డకెట్ వికెట్లను నితీశ్ కుమార్ రెడ్డి తీశాడు. దీంతో ఆ జట్టు ఒక్కసారిగా షాక్‌కు గురైంది. ఆ తర్వాత పోప్(44), రూట్(71) కలిసి 3వ వికెట్‌కు 109పరుగులు జతచేసి గట్టి పునాది వేశారు. రెండో సెషన్‌లో భారత బౌలర్లు ఒక్క వికెట్‌ను కూడా పడగొట్టలేకపోయారు. దీంతో టీ విరామం వరకు భారత బౌలర్ల శ్రమ ఫలితంచలేదు. దీంతో ఇంగ్లండ్ జట్టు 2వికెట్ల నష్టానికి 153పరుగుల వద్ద టీ విరామానికి వెళ్లింది. ఆ తర్వాత మూడో సెషన్ ప్రారంభం కాగానే రవీంద్ర జడేజా తొలి బంతికే బ్రేక్ ఇచ్చాడు. ఆచి తూచి ఆడుతున్న పోప్ వికెట్‌ను పడగొట్టి పట్టు బిగించాడు. ఆ తర్వాత బ్రూక్(11)ను బుమ్రా ఔట్ చేసి భారత అభిమానుల్లో జోష్ నింపాడు. తొలి సెషన్‌లో రెండు వికెట్లు, మూడో సెషన్ ప్రారంభం లోనే భారత్‌కు రెండు వికెట్లు దక్కాయి. మూడో సెషన్ ప్రారంభంలోనే వరుసగా రెండు వికెట్లు కోల్పోయిన ఇంగ్లండ్‌ను ఆ తర్వాత భారత బౌలర్లు కట్టడి చేయలేకపోయారు. దీంతో తొలిరోజు ఆట ముగిసే సరికి రూట్(99), కెప్టెన్ బెన్ స్టోక్స్(39) క్రీజ్‌లో ఉన్నారు.

గాయపడ్డ వికెట్ కీపర్ రిషబ్ పంత్ వేలికి చికిత్స చేస్తున్న ఫిజియో.

వికెట్ తీసిన ఆనందంలో నితీశ్

**స్కోర్‌బోర్డు...**

**ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్:** క్రాలే (సి)పంత్ (బి)నితీశ్ రెడ్డి 18, డకెట్ (సి)పంత్ (బి)నితీశ్ రెడ్డి 23, పోప్ (సి) సబ్ ధృవ్ జురెల్ (బి)జడేజా 44, రూట్ (బ్యాటింగ్) 99, బ్రూక్ (బి)బుమ్రా 11, స్టోక్స్ (బ్యాటింగ్) 39, అదనం 17. (83ఓవర్లలో 4వికెట్ల నష్టానికి) 251 పరుగులు. **వికెట్ల పతనం:** 1/43, 2/44, 3/153, 4/172 **బౌలింగ్:** బుమ్రా 18-3-35-1, ఆకాశ్‌దీప్ 17-2-75-0, సిరాజ్ 14-5 33-0, నితీశ్ 14-0-46-2, జడేజా 10-1-26-1, సుందర్ 10-1-21-0.

## రాణించిన రాధా

- నాల్గో టి20లో ఇంగ్లండ్ మహిళలపై ఆరు వికెట్ల తేడాతో గెలుపు
- టి20 సిరీస్ తొలిసారి కైవసం

**మాంచెస్టర్:** ఇంగ్లండ్ పర్యటనలో ఉన్న భారత మహిళలజట్టు అదరగొట్టింది. ఇంగ్లండ్ గడ్డపై సిరీస్ కైవసం చేసుకొని హర్మన్‌ప్రీత్ సేన రికార్డు నెలకొల్పింది. ఐదు టి20ల సిరీస్‌లో భాగంగా బుధవారం రాత్రి ఇంగ్లండ్‌తో జరిగిన నాల్గో టి20లో భారతజట్టు ఆరు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. దీంతో మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 3-1 తేడాతో టి20 సిరీస్‌ను కైవసం చేసుకుంది. టాస్ గెలిచిన ఇంగ్లండ్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 126 పరుగులు చేయగా.. అనంతరం భారతజట్టు 17ఓవర్లలో కేవలం 4వికెట్లు కోల్పోయి సునాయాసంగా లక్ష్యాన్ని ఛేదించింది. తొలుత అమన్‌జ్యోత్ కౌర్‌కి తోడు తెలుగమ్మాయి శ్రీచరణి కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. మరోవైపు దీప్తి శర్మ, అరుంధతిరెడ్డి, రాధా యాదవ్ కూడా చెలరేగి బౌలింగ్ చేయడంతో ఇంగ్లండ్ జట్టు స్వల్ప స్కోర్‌కే పరిమితమైంది. సోఫియా డంక్లీ(22), బెల్మాంట్(20), ఆలిస్ కాప్సే(18) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. భారత బౌలర్లలో రాధా యాదవ్, శ్రీచరణికి రెండేసి, అమన్‌జోత్ కౌర్, దీప్తి శర్మ ఒక్కో వికెట్ తీశారు. ఛేదనలో భాగంగా స్మృతి మంధాన(32), షఫాలీ వర్మ(31) కలిసి తొలి వికెట్‌కు 56పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఆ తర్వాత హర్మన్‌ప్రీత్, రోడ్రిగ్స్ కలిసి గెలుపు తీరాలకు చేర్చారు రోడ్రిగ్స్(24నాటౌట్), హర్మన్‌ప్రీత్ కౌర్(26) బ్యాటింగ్‌లో రాణించారు. అమంజోత్ కౌర్ రనౌట్ కాగా.. రిచా ఘోష్ మరో వికెట్ పడకుండా మ్యాచ్‌ను ముగించింది. ఇంగ్లండ్ బౌలర్లలో షార్లెట్ డీన్, సోఫీ ఎక్లెస్టోన్, ఇస్సీ వాంగ్ తలో వికెట్ తీశారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ రాధా యాదవ్‌కు లభించగా.. ఎడ్జ్‌బాస్టన్ వేదికగా 12న ఐదో, చివరి టి20 మ్యాచ్ జరగనుంది.

**స్కోర్‌బోర్డు(సంక్షిప్తంగా)...**
**ఇంగ్లండ్ మహిళలు : 126/7 (20 ఓవర్లలో) (శ్రీచరణి 2/30, రాధా యాదవ్ 2/15)**
**భారత మహిళలు : 127/4(17 ఓవర్లలో) మంధాన 32, షెఫాలీ 31, రోడ్రిగ్స్(24నాటౌట్)**

## ఫైనల్‌కు అనిసిమోవా, స్వైటెక్

### సెమీస్‌లో టాప్‌సీడ్ సబలెంక ఓటమి

**లండన్:** వింబుల్డన్ గ్రాండ్ స్లామ్ టోర్నీ మహిళల సింగిల్స్ ఫైనల్లోకి 13వ సీడ్ అనిసిమోవా (అమెరికా), 8వ సీడ్ ఇగా స్వైటెక్(పోలండ్) ప్రవేశించారు. శుక్రవారం జరిగిన తొలి సెమీస్‌లో టాప్‌సీడ్, బెలారస్‌కు చెందిన అర్యానా సబలెంకకు అమందా అనిసిమోవా ఝులక్ ఇచ్చింది. మూడుసెట్ల హోరాహోరీ పోరులో అనిసిమోవా 6-4, 4-6, 6-4తో సబలెంకను చిత్తుచేసింది. మరో సెమీస్‌లో మాజీ నంబర్ వన్ క్రీడాకారిణి ఇగా స్వైటెక్ 6-2, 6-0తో బెన్సిక్(స్విట్జర్లాండ్)ను ఓడించింది. స్వైటెక్ మ్యాచ్ ప్రారంభం నుంచి దూకుడుగా ఆడుతూ సంచలన విజయాలకు సెమీస్‌కు చేరిన బెన్సిక్‌కు ఝులక్ ఇచ్చింది.

**నేడు పురుషుల సింగిల్స్ సెమీఫైనల్స్...**

వింబుల్డన్ సెంటర్ కోర్టులో శుక్రవారం జరిగే పురుషుల సింగిల్స్ సెమీఫైనల్స్ జరగనుంది. తొలి సెమీఫైనల్ 5వ సీడ్ ఫ్రిట్జ్(అమెరికా), 2వ సీడ్, కార్లోస్ అల్కరాజ్(స్పెయిన్), రెండో సెమీస్ టాప్‌సీడ్, ఇటలీకి చెందిన జెన్నిక్ సిన్నర్, 6వ సీడ్, సెర్బి యాకు చెందిన నొవాక్ జకోవిచ్‌ల మధ్య జరగనుంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68